09 . 01. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 216 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం

- చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు రవాణా సౌకర్యం
- తెలంగాణలో విద్యా విధానంపై సిఎం రేవంత్ వివరణ
- హిమాచల్ విద్యామంత్రి రోహిత్ కుమార్ భేటీలో వివరాలు వెల్లడి

# ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

- పేదల పొట్టకొట్టే యత్నం చేసిన మోడీ
- అధికారం ఉందని మోడీ ఇష్టారీతి నిర్ణయాలు
- ఉపాధితో పేదరిక నిర్మూలనకు అడుగులు
- పంచాయితీ ఎన్నికల మాదిరే మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం
- కార్యకర్తలకు సిఎం రేవంత్ రెడ్డి పిలుపు






**హైదరాబాద్,జనవరి8 వెలుతురు:** పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్నే మారుస్తారా అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం అని అన్నారు. మెజారిటీ ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయమిదని అన్నారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మొదటి విడతలో బాలికలకు ప్రాధాన్యం....

- రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందజేతపై కసరత్తు
- వచ్చే విద్యా సంవత్సరం ఆరంభానికి నగరంలో నూతన పాఠశాలలు
- ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగినట్లు సిలబస్
- విద్యా శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జనవరి 08:** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆర్ ఎస్) మొదటి విడతలో పూర్తయ్యే వాటిలో బాలికలకు ఎక్కువ స్కూల్స్ కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రతి నియోజకవర్గంలోనూ బాలురు, బాలికలకు





## హెచ్‌టీ పత్తి విత్తనాలను అడ్డుకోండి

- రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోండి
- టాస్క్ ఫోర్స్ టీమ్‌లతో నిఘా ఏర్పాటు
- అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం

**హైదరాబాద్,జనవరి8 వెలుతురు:** రాష్ట్రంలో అనధికారకంగా, అనుమతిలేని పత్తి విత్తనాల ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. పత్తి విత్తనాల ప్యాకేట్లపై వ్యవసాయశాఖ సంచాలకులతో సచివాలయంలో

# మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధం





- మరోమారు ప్రజల్లోకి వెళ్లేలా ప్రణాళికలు
- ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలకు ప్లాన్
- ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు సభల నిర్వహణ
- సభల నిర్వహణ బాధ్యత మంత్రి పొంగులేటికి అప్పగింత

**హైదరాబాద్,జనవరి8 వెలుతురు:** రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మరికొన్ని రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం ప్రభంజనం సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అలాగే ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనుంది. ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఈ బహిరంగ సభలు నిర్వహించాలని తేదీలను ఖరారు చేసింది. ఈ బహిరంగ సభల సమన్వయ బాధ్యతను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించింది. కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో మున్సిపల్ ఎన్నికలపైనా

## కృత్రిమ మేధకు కేరాఫ్ అడ్రస్ గా హైదరాబాద్

- ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



## వీ బి- జి రామ్ జీ చట్టాన్ని బలోపేతం చేసిన కేంద్రాన్ని తప్పు పట్టడం సరికాదు...

- సీఎం కుర్చీని కాపాడుకునేందుకు, రాహుల్ గాంధీ మెప్పుకోసం, కాంగ్రెస్ హై కమాండ్ రాజకీయాల్లో చక్రం తిప్పాలని ఆలోచనతో రేవంత్ రెడ్డి వీ బి- జి రామ్ జీ చట్టంపై విమర్శలు
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి బిజెపి శాసన పక్ష నాయకులు

**హైదరాబాద్ వెలుతురు జనవరి 08:** సీఎం కుర్చీని కాపాడుకునేందుకు, రాహుల్ గాంధీకి దగ్గరై కాంగ్రెస్ హైకమాండ్ రాజకీయాల్లో చక్రం తిప్పాలనే ఆశతోనే సీఎం రేవంత్ రెడ్డి అదే పనిగా ఉపాధి హామీ పథకాన్నివీ బి- జి రామ్ జీ చట్టాన్ని బలోపేతం చేసిన కేంద్రాన్ని తప్పుపడుతున్నారు. కేంద్రంలో బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారనే అదే తప్పుడు ప్రచారంతో కాంగ్రెస్ మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్ వంటి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగి దారుణంగా ఓడిపోయింది. బిజెపిని



## కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల పాపాలే... తెలంగాణకు శాపాలైనయ్

- నీళ్లు నిధులు నియామకాల ట్యాగ్ లైన్ తోనే దోపిడీకి తెరదీశాయ్,
- క్రిష్ణా జలాల వాటాలో తెలంగాణ మొదటి దోషి కాంగ్రెస్సే,
- అసెంబ్లీ సాక్షగా సీఎం రేవంత్ పచ్చి అబద్దాలాడారు.,
- ఆధారాల చూపిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులను ఎండగట్టిన కేంద్ర మంత్రి బండి సంజయ్.



**ఉమ్మడి కరీంనగర్ వెలుతురు జనవరి 08:** కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల పాపాలే...తెలంగాణ ప్రజల పాలిట శాపాలయ్యాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నీళ్లు నిధులు నియామకాల ట్యాగ్ లైన్ తోనే ఆ రెండు పార్టీలు దోపిడీకి తెరదీశాయని మండిపడ్డారు. క్రిష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం జరగిందని, ఇందులో మొదటి దోషి కాంగ్రెస్సేనని దుయ్యబట్టారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో తెలంగాణకు తీరని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర విభజన



## మహిళా మంత్రులకు కెసిఆర్ ఆత్మీయ స్వాగతం

- చీరసారెతో దంపతుల సత్కారం
- యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న కెసిఆర్
- మేడారం ఆహ్వాన పత్రికి అందచేసిన మంత్రులు

**గజ్వేల్,జనవరి8 వెలుతురు:** ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను

## రాయలసీమకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు

- సీమ ఎత్తిపోతలపై దుష్ప్రచారం వెనక కుట్ర
- తెలంగాణకు దాసోహమన్న సిఎం చంద్రబాబు
- ఎపి ప్రయోజనాలు తాకట్టు పెట్టిన బాబు
- రేవంత్ రెడ్డితో బాబు రహస్య ఒప్పందం
- ఎస్ఎల్‌బిసితో 45 టీఎంసీలు తరలించేలా పనులు
- మీడియా సమావేశంలో జగన్ ఘాటు విమర్శలు

**అమరావతి,జనవరి8 వెలుతురు:** రాయలసీమ ఎత్తిపోతలపై కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కరువు కోరల్లో చిక్కుకున్న ప్రాంతానికి నీళ్లు ఇవ్వాలనుకున్నామని అన్నారు. రాయలసీమకు తాము తలపెట్టిన



## వైకాపాలా రప్పా రప్పా విధానం మనది కాదు

ప్రజల తీర్పునకు అనుగుణంగా సేవలు అందించాలి
సమస్యలను పరిష్కరిస్తూనే..విమర్శలను తిప్పికొట్టాలి
మంత్రులతో లోకేశ్ వెల్లడి


**అమరావతి,జనవరి8 వెలుతురు:** వైసీపీలా రప్పారప్పా విధానం తమది కాదని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. దౌర్జన్యాలు, బెదిరించడం మన పార్టీ సంస్కృతి



## జల రవాణా పెంచుకునే దిశగా కార్యాచరణ

- లాజిస్టిక్స్ వినియోగంలో ప్రపంచ స్థాయిలో పోటీ
- పర్యాటక రంగం గేమ్ చేంజర్ కానుంది
- కేబినేట్ సమావేశంలో సిఎం చంద్రబాబు వెల్లడి
- మంత్రుల తీరుపై మరోమారు అసహనం

**అమరావతి,జనవరి 8 వెలుతురు:** జల రవాణా పెంచుకునే దిశగా కార్యాచరణ రూపొందించాలని సిఎం చంద్రబాబు తెలిపారు. లాజిస్టిక్స్ వినియోగంలో ప్రపంచ స్థాయిలో పోటీ పడాలన్నారు. జల రవాణా మెరుగుపర్చుకుంటే అభివృద్ధి పథంలో ముందుంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. రెండున్నర గంటలపాటు జరిగిన సమావేశంలో కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించింది. క్యాబినేట్‌లో అజెండా అంశాలు ముగిశాక,రాజకీయ, తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు అన్ని తీర ప్రాంత జిల్లాలో ఒక్కో పోర్టు ఏర్పాటు కావాలి. జగన్



https://epaper.velthuru.com



వెలుతురు

## వైకాపాలా రప్పా రప్పా విధానం మనది కాదు

కాదని చెప్పారు. క్యాబినెట్ భేటీకి ముందు పలువురు మంత్రులతో ఆయన మాట్లాడారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ ఎంత సేవ చేశామన్నదే మన అజెండా కావాలి. అభివృద్ధి-సంక్షేమం సమన్వయంతో ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలి. వైకాపా కుట్రలను పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నేతలు సమర్థంగా తిప్పికొట్టాలి. అందరూ ఏకతాటిపైకి వచ్చి అసృత ప్రచారాలకు దీటుగా బదులివ్వాలి. ప్రజావేదికలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి మంత్రులు బాధ్యత తీసుకోవాలి. తమ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి మంత్రులు చొరవ చూపాలి. పార్టీ బలోపేతం, క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇన్‌ఛార్జ్ మంత్రులు పనిచేయాలని లోకేశ్ అన్నారు. గురువారం ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో టీడీపీ మంత్రులతో మంత్రి లోకేష్ అల్పాహార విందు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు కీలక సూచనలు చేశారు. జగన్‌లా ప్రజల్ని భయపెట్టడం, బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటివి టీడీపీ సంస్కృతి కాదని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ఎంత మేర సేవ చేశామన్నదే మన అజెండా కావాలని తెలిపారు. అభివృద్ధి - సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూర్చామన్నదే కూటమి ప్రభుత్వ విధానమని తేల్చిచెప్పారు. వైసీపీ కుట్రలను పార్లమెంట్ వారీగా నేతలు సమర్థంగా తిప్పికొట్టాలని, పార్లమెంట్ కేంద్రాల్లో నేతలు ఏకతాటిపైకి వచ్చి వైసీపీ అసత్య ప్రచారాలకు ధీటుగా బదులివ్వాలని మంత్రి సూచించారు. మంత్రులు ప్రజావేదికలో తమకు వచ్చే ఫిర్యాదులు పరిష్కారమయ్యేలా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. తమ తమ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి మంత్రులు చొరవ చూపాలని ఆదేశించారు. పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇన్‌ఛార్జి మంత్రులు పనిచేయాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

## జల రవాణా పెంచుకునే దిశగా కార్యాచరణ

పాలనలో విధించిన ట్రూఅప్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరిస్తోంది. రూ. 4,490 కోట్ల ట్రూఅప్ ఛార్జీలు ప్రభుత్వమే భరిస్తోంది. యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.5.19 నుంచి రూ. 4.90కి తగ్గించాం. ఫెర్రో అల్లాయిస్ యూనిట్లు 70 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఏడాదిపాటు విద్యుత్ రాయితీలను కల్పిస్తే, తర్వాత అవే ఉత్పత్తి చేసుకుంటాయి. చీరాలలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించాలి. సూర్యలంకలో కొత్తగా 3 హోటళ్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. పర్యాటక రంగం ఓ గేమ్ ఛేంజర్. పర్యాటక రంగంలో అన్ని అవకా శాలను అందిపుచ్చుకోవాలి. బార్లకు, లిక్కర్ షాపులకు తేడా లేకుండా ఏఈఆర్‌టీ ఛార్జీలు సమం చేయాలని చంద్రబాబు అన్నారు. 'సముద్రంలో కలిసే జలాలు తెలుగు రాష్ట్రాలు ఉపయోగించుకుంటే మేలు కదా. నీరు ఊరికే సముద్రం పాలైతే ఎవరికీ ఉపయోగం ఉండదు. నీటి లభ్యత ఉంటే రైతులు కొత్త పంటలు వేసుకోవచ్చు. పోలవరం పూర్తయితే కృష్ణా జలాల్ని విశాఖకు తీసుకెళ్లొచ్చు. జగన్ హయాంలోనే రాయలసీమ లిఫ్ట్ ఆగిపోతే మనపై నిందలు వేస్తున్నారు. అధికారుల సమన్వయంతో ప్రతీ ప్రాజెక్టు గ్రౌండ్ అవ్వాలి. అన్ని రకాల పంటలను కొనుగోలు చేస్తున్నాం. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని సీఎం వివరించారు. కేబినెట్ ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రుల పనితీరు, పార్టీ వ్యవహారాల నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేబినెట్ భేటీ తర్వాత పార్టీ కార్యాలయానికి తరచూ తానే రావాల్సి వస్తోందని, అయినా ప్రజల నుంచి వచ్చే వినతులు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. నెలకు రెండు నుంచి మూడు సార్లు నేనే పార్టీ ఆఫీస్‌కు రావాల్సి వస్తోంది. అయినా వినతులు మాత్రం తగ్గడం లేదన్న సీఎం చంద్రబాబు.. ప్రజా సమస్యల పరిష్కారంలో మంత్రులు మరింత చొరవ చూపాలని సూచించారు. పార్టీ కోసం ఐదేళ్ల పాటు కష్టపడ్డ కార్యకర్తల పేర్ల జాబితాను అందించమని పలుమార్లు కోరినా.. ఇప్పటికీ జిల్లాల నుంచి పూర్తి వివరాలు అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు సీఎం చంద్రబాబు.. ఎన్నిసార్లు అడిగినా.. పార్టీ కోసం ఐదు సంవత్సరాలు కష్టపడ్డ వారి పేర్లు ఇవ్వడం లేదు. ఈ నిర్లక్ష్యం సరైన పద్ధతి కాదు అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. పార్టీ నిర్మాణం, పార్లమెంటు స్థాయి కమిటీల ఏర్పాటులోనూ మంత్రుల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందలేదని పేర్కొన్న చంద్రబాబు.. పార్లమెంటు స్థాయిలో కమిటీలు కూడా నేనే పూర్తి చేశాను. దీన్ని బట్టి ఆయా జిల్లాల మంత్రుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు అని అన్నారు. ప్రజా సమస్యలు, పార్టీ వ్యవహారాలు, కమిటీల ఏర్పాట్లలోనూ తానే ముందుండి పూర్తి చేయాల్సి రావడం చూస్తుంటే.. జిల్లా అధ్యక్షులు, జిల్లా మంత్రుల పనితీరు ఎలా ఉందో ప్రజలు, పార్టీ శ్రేణులు అంచనా వేసుకోవచ్చు అన్నారు సీఎం చంద్రబాబు.. మంత్రులు పార్టీ, ప్రజా సమస్యలపై సమానంగా దృష్టి పెట్టాలని ఆయన స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. పార్టీ శ్రేణుల వినతులు, కార్యకర్తల గుర్తింపు, ప్రజా సమస్యల పరిష్కారంలో మంత్రులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని, పార్టీ కోసం పని చేసిన వారికి న్యాయం చేయాలనే బాధ్యతను గుర్తుంచుకోవాలని సీఎం చంద్రబాబు హితవు పలికారు.

## ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

పొందింది.2024 ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని భాజపా నేతలు ప్రచారం చేశారు. అన్ని సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చేసేవారు. తద్వారా పేదల హక్కులను కాలరాయాలని చూశారు. కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో భాజపా 240 సీట్ల వద్ద ఆగిపోయింది. దీంతో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడింది. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభమవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం

హైదరాబాద్,జనవరి8 : ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే ప్రీ ప్రైమరీ విద్యా విధానాన్ని త్వరలో తెలంగాణలో అమలు చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్ కుమార్‌క గురువారం సిఎం రేవంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఇక్కడి విద్యావిధానంపై వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులను ? ప్రీ ప్రైమరీ పాఠశాలలకు తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యాన్ని సైతం కల్పించే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆయనకు రేవంత్ రెడ్డి వివరించారు. తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని హిమాచల్‌ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ కుమార్‌తో కూడిన ఉన్నతాధికారుల బృందం కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న విద్యా విధానాన్ని సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి రోహిత్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దుతున్నట్లు ఈ సందర్భంగా సీఎం రేవంత్ వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏటీసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మ్లలెపల్లిలోని ఐటీఐని సందర్శించాలని మంత్రి రోహిత్ కుమార్‌కు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలు కానున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపై రోహిత్ కుమార్ ఆసక్తి కనబరిచారు. స్కూళ్ల ఏర్పాటుకు సంబంధించి.. సమగ్ర నివేదికను తమకు అందించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ను హిమాచల్ ప్రదేశ్ మంత్రి కోరారు. అలాగే ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు రేవంత్ రెడ్డి విజన్‌ను రోహిత్ కుమార్ అభినందనలతో ముంచెత్తారు. ూష్ట్ర విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వివరాలను హిమాచల్‌ప్రదేశ్ మంత్రికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ వివరించారు. 25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకే చోట మినీ యూనివర్సిటీ తరహాలో రూ200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు సోదాహరణతో రోహిత్ కుమార్‌కు ముఖ్యమంత్రి వివరించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురానున్నట్లు ఆయనకు సీఎం రేవంత్ వివరించారు. అందుకు సంబంధించి ఒక కమిటీని నియమించామని.. త్వరలోనే పాలసీని తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డితోపాటు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల పాపాలే... తెలంగాణకు శాపాలైనయ్

సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని 89వ సెక్షన్ లో పలు ప్రాజెక్టులున్నప్పటికీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రస్తావనే లేదని కుండ బద్దలు కొట్టారు. అట్లాంటప్పుడు జాతీయ హోదా ఎట్లా అడిగారని ప్రశ్నించారు. గురువారం కరీంనగర్ లోని రేకుర్తి శుభం గార్డెన్స్ లో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల నాయకులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ నీళ్ల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు తెలంగాణ ప్రజలకు చేసిన మోసాలను ఎండగడుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వారం పదిరోజులుగా నీళ్ల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలాడుతున్నాయి. 6 గ్యారంటీలపై చర్చ జరగకుండా కాంగ్రెస్, అవినీతిపై విచారణ లేకుండా బీఆర్ఎస్ కలిసి నాటకాలాడుతున్నయ్. నిజానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన పాపాలు...తెలంగాణ ప్రజలకు శాపాలైనయ్. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలాడారు. పాలమూరు రంగారెడ్డి విషయంలో బీఆర్ఎస్ తీరుపై ఉద్యమం చేసింది బీజేపీయే. ఆనాడు కాంగ్రెస్ ఎన్నడైనా ఉద్యమాలు చేసిందా? .కేసీఆర్ పై ఒత్తిడి తెచ్చి మెడలు వంచింది బీజేపీయే. తెలంగాణకు అన్యాయం జరగొద్దని అనేక మీటింగ్ లు పెట్టింది కేంద్రమే. తెలంగాణకు నీళ్ల అన్యాయం చేసిన మొట్టమొదటి దోషి కాంగ్రెస్సే. ఉమ్మడి ఏపీలో క్రిష్ణా వాటాలో 811 టీఎంసీలుంటే...ఏనాడూ తెలంగాణకు 200 టీఎంసీలకు మించి నీటిని వాడుకోకుండా ఇక్కడి ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్సే. గోదావరిలో 1486 టీఎంసీల నీటి వాటా ఉంటే....తెలంగాణలో ఎన్నడూ 500 టీఎంసీలకు మించి వాడుకోలేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంపై సీఎం రేవంత్ అబద్దాలాడారు. రాష్ట్ర విభజన యాక్ట్ లోనూ తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్సే. ఏపీ పునర్విభజన యాక్ట్ సెక్షన్ 89 ప్రకారం... రాష్ట్ర విభజన నాటికి నిర్మాణంలో, ప్లాన్ లో ఉన్న నీటి ప్రాజెక్టులపై అభ్యంతరం తెలపొద్దని స్పష్టంగా ఉంది. ఆ సెక్షన్ లో ఏపీలోని 4, తెలంగాణలోని 2 ఆన్ గోయింగ్ ప్రాజెక్టులను పొందుపర్చారు. మరి తెలంగాణలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పొందుపర్చలేదు?. ఆనాడు అధికారంలో ఉన్న ఈ సోకాల్డ్ కాంగ్రెస్ నేతలు ఎందుకు నిలదీయలేదు?. పునర్విభజన యాక్ట్ లోని సెక్షన్ 89లో పాలమూరు ప్రస్తావనే లేనప్పుడు జాతీయ హోదా ఎట్లా అడిగారు?.వైఎస్ పాలనలో పోతిరెడ్డిపాడు ద్వారా ప్రతిరోజు సగటున 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలిస్తే ఎందుకు ఆపలేకపోయారు?. నీళ్ల విషయంలో పదేళ్ల కేసీఆర్ పాలనలోనూ తెలంగాణకు మరణ శాసనమైంది. నీళ్లు నిధులు నియామకాలనే ట్యాగ్ లైన్ పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నరు. కేసిఆర్ సీఎం అయిన కొత్తలో "తెలంగాణకు కేసీఆర్ అనే అణుబాంబు ఉంది.చంద్రబాబు... నీ ఆటలు సాగవ్.."అని డాంబికాలు పలికిండు. అవన్నీ పిట్టల దొర మాటలేనని తేలిపోయింది. ఏపీ ప్రభుత్వానికి అమ్ముడుపోయి ఆనాడు కేసీఆర్ క్రిష్ణా జలాలను తాకట్టు పెట్టిండు. క్రిష్ణా జలాల్లో తెలంగాణకు 575 టీఎంసీల వాటా రావాల్సి ఉంటే... 299 టీఎంసీలకే ఒప్పుకుని సంతకం చేసి దక్షిణ తెలంగాణకు తీరని ద్రోహం చేసిన మోసగాడు కేసీఆర్. ఏపీకి కేసీఆర్ అమ్ముడపోయి అపెక్స్ కౌన్సిల్ సాక్షిగా 299 టీఎంసీల నీళ్లు చాలని చేసిన సంతకాల ఒప్పందాన్ని మొట్టమొదట బయటపెట్టిందే నేను. ఎవరిని అడిగి 299 టీఎంసీల నీళ్లు చాలని ఒప్పుకున్నారు?. తెలంగాణ వచ్చాక పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 4.3 టీఎంసీల నుండి ఏకంగా 13.7 టీఎంసీలకు పెంచినా నోరు మెదపని సన్నాసి కేసీఆర్. ప్రజలను డైవర్ట్ చేసేందుకు "కాళేశ్వరం" పేరుతో కూలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో దోపిడీకి స్కెచ్ వేసిన నాయకుడు కేసీఆర్. రూ.30 వేల కోట్ల ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచి వేల కోట్లు దోచుకున్న దోపిడీ దొంగ కేసీఆర్. రెండోసారి అధికారం చేపట్టాక పాలమూరు రంగారెడ్డి పేరుతో రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి చుక్క నీరియ్యని దుర్మార్గుడు కేసీఆర్. రూ.80 వేల కోట్ల ప్రతిపాదనలతో రూపొందించిన పాలమూరు ప్రాజెక్టులో భూసేకరణ, డిస్ట్రిబ్యూటరీల అంశాలే లేవు. ఇదేందని నిలదీస్తే.... లక్షన్నర కోట్లతో పాలమూరు రంగారెడ్డి అంచనాలు పెంచి దోచుకోవాలనుకున్నడు. పాలమూరు రంగారెడ్డి పేరుతో కమీషన్లు దండుకోవడమే కేసీఆర్ పనిగా పెట్టుకున్నడు. వేల కోట్లు దోచుకున్నా ప్రజలు రెండోసారి అధికారం అప్పగిస్తే... కేసీఆర్ మరింత బరితెగించారు. క్రిష్ణా జలాల వాటా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలకు మోదీ నాయకత్వం పలుమార్లు ప్రస్తావించి హెచ్చరించినా పట్టించుకోలేదు. నిలదీసిన మమ్ముల్ని పిట్టకథలు చెబుతూ కేసీఆర్ హేళన చేశారు. క్రిష్ణా బేసిన్ లో కెడబ్ల్యూడిటి-2 ప్రకారం... ఉమ్మడి ఏపీ వాటా 1005 టీఎంసీలు ఉన్నాయని, అందులో 600 నుండి 700 టీఎంసీల వరకు నీళ్లను వాడుకునే అవకాశం తెలంగాణకు ఉంది.

### కేసీఆర్ సర్కార్ అవినీతి, అక్రమాలను బయటపెడుతున్న కల్వకుంట్ల కవితకు హ్యాట్సాఫ్.

ఆ తరువాత కూడా తెలంగాణ కోసం మళ్లీ కేంద్రాన్ని ఒప్పించి రెండోసారి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ పెట్టించినా కేసీఆర్ రాలేదు. కేసీఆర్ చేసిన అన్యాయాన్ని నిలదీ స్తూ... బీజేపీ ఢిల్లీ నుండి గల్లీదాకా నిరసనలు చేసి నం. తెలంగాణ నుండి తీవ్రమైన ఒత్తిడి రావడంతో కేసీఆ ర్ 575 టీఎంసీల నీరు కావాలంటూ యూ టర్న్ తీసు కుం ది నిజం కాదా? రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజె క్టును ఆపాలని అనేకసార్లు సీఎంకు, కేంద్రానికి లేఖ రాసింది నేనే. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతిపై సీబీఐ విచారణ జరపా లని రేవంత్ రెడ్డి ఎందుకు కోరడం లేదు. రూ.9 వేల కోట్ల అవినీతిపై విచారణకే పరిమితం ఎందుక య్యారో రేవంత్ సమాధానం చెప్పాలి. కేంద్రం ఏమీ చేయలే దని చెబుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు... తెలంగాణకు మోదీ ప్రభుత్వం 11 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లు ఇచ్చిన విషయాన్ని ఎందుకు చెప్పడం లేదు?. పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నయాపైసా కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కూడా కేంద్రంపై మాట్లాడటం హాస్యాస్పదం. తెలంగాణకు జరిగిన అన్యాయంపై ఎన్నడూ రాజీపడకుండా ఉద్యమించిన చరిత్ర బీజేపీదే. క్రిష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ ఎదుట సరైన వాదనలు వినిపిస్తే తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దవచ్చని పదేపదే కోరతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు. అసెంబ్లీలో నీళ్ల విషయంలో తెలంగాణకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు చేసిన అన్యాయంపై మాట్లాడే అవకాశం కూడా బీజేపీ ఎమ్మెల్యేలకు ఇవ్వలేదు. కమీషన్ల కోసమే ప్రాజెక్టులు కట్టాలనే మైండ్ సెట్ ను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మార్చుకోవాలి... అప్పుడే తెలంగాణకు న్యాయం జరుగుతుంది. తెలంగాణకు న్యాయం చేసే విషయంలో కేంద్రం ప్రభుత్వం సహకరిస్తుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధం

చర్చించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో గెలపు బాధ్యతలు తీసుకునేలా దిశానిర్దేశం చేశారు. వీటిని పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కట్టబెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు వేదికగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. మండలాల్లో సైతం ఈ సభలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మండలం బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి.

అలాగే ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి ప్రాజెక్టులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోందని.. ఈ వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు వరుసగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలు తిప్పికొట్టేందుకు ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా ఈ సభల వేదిక మీద నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి తదితర పథకాలు అమలును వివరించడం ద్వారా ప్రతిపక్ష విమర్శలు తిప్పికొట్ట వచ్చనే లక్ష్యంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆ పార్టీ తీసుకుంది. అంతేకాకుండా.. ఆయా జిల్లాల్లోని స్థానిక సమస్యలతోపాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందంటూ ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇంకోవైపు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగడతామంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఇందుకోసం భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామంటూ ఆయన ఇప్పటికే మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. అలాంటి వేళ బీఆర్ఎస్ పార్టీ కంటే ముందే భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఆ దిశగా ఆ పార్టీ అగ్రనాయకత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

# రాయలసీమకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు

ఎత్తిపోతల.. సంజీవని లాంటిదని చెప్పుకొచ్చారు. నెల్లూరు, రాయలసీమ ప్రజలు చంద్రబాబును విలన్‌లా చూస్తున్నారని ఆరోపించారు. సీఎం సీట్లో కూర్చుని చంద్రబాబు ఏపీ ప్రయోజనాలను తాకట్టుపెట్టారని విమర్శించారు. గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ మోహన్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'సొంత రాష్ట్రాన్ని తన స్వార్థ ప్రయోజనాలకు తాకట్టుపెట్టారు. రాయలసీమ ఎత్తిపోతలపై రేవంత్ వ్యాఖ్యలే సాక్ష్యం. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చంద్రబాబు రహస్య ఒప్పందానికి అధికార ముద్ర వేశారు. రాయలసీమ లిఫ్ట్ అవసరం లేదని మంత్రులు మాట్లాడుతున్నారు. రాయలసీమ లిఫ్ట్ వెనుక గొప్ప ఉద్దేశ్యం ఉంది. రాయలసీమ ఎత్తిపోతల ఆపమని కోరినట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. రేవంత్ వ్యాఖ్యలు చూస్తే చంద్రబాబు ఏపీని అమ్మకానికి పెట్టారని చెప్పడానికి నిదర్శనం. శ్రీశైలంలో 881 అడుగులు ఉంటేనే పోతిరెడ్డిపాడుకు నీళ్లు వస్తాయి.. పోతిరెడ్డిపాడు నుంచి 101 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. ఇరవై ఏళ్లలో మూడు, నాలుగుసార్లే అన్ని నీళ్లు తెచ్చుకోగలిగాం' అని అని వైఎస్ జగన్ తెలిపారు. 800 అడుగుల్లోపే 2 టీఎంసీల నీళ్లు తీసుకునేందుకు.. తెలంగాణలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టారు. ఎస్ఎల్‌బిసితో 45 టీఎంసీలు తరలించేలా పనులు జరుగుతున్నాయి.777 అడుగుల నుంచే లెఫ్ట్ పవర్‌హౌస్ ద్వారా..4 టీఎంసీల నీళ్లు తెలంగాణ ఖాళీ చేస్తున్న పరిస్థితి. మనకు నీళ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్నాం. తెలంగాణలో పవర్‌హౌస్ ద్వారా ఇష్టారీతిన నీళ్లు తీసుకుంటున్నారు. తెలంగాణలో లిఫ్ట్‌లు, పవర్‌హౌస్‌తో రోజుకు 8 టీఎంసీలు తీసుకుంటున్నారు. శ్రీశైలం, సాగర్, పులిచింతల పవర్‌హౌస్‌లు తెలంగాణెళి ఆపరేట్ చేస్తోంది. ఓటుకు నోటు కేసులో ఆడియో, వీడియోలతో అడ్డంగా దొరికారు. అందుకే చంద్రబాబు నోరు మెదపలేని పరిస్థితి ఉందని జగన్ ఎద్దేవా చేశారు. మేం వచ్చే నాటికే తెలంగాణలో లిఫ్ట్‌ల పనులు జోరుగా సాగుతున్నాయి. తెలంగాణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లేవని వైఎస్ జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు దగ్గరుండి రాయలసీమ లిఫ్ట్‌ను ఖూనీ చేశారన్నారు. చంద్రబాబు, ఆయన మంత్రి కలిసి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అక్కర్లేదని మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. స్టెబిలైజింగ్ రిజర్వాయర్లు కట్టకపోతే కుప్పానికే కాదు చిత్తూరు జిల్లాకు తాగునీళ్లు ఉండవని జగన్ తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచను అని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు బాదుడే బాదుడుతో ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు గడవక ముందే రాష్ట్రం రూ. 3 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసారని తెలిపారు. సంపద సృష్టిస్తానని చెప్పి రాష్ట్రాన్ని అప్పుల దిశగా నడిపిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని కోరారు. మెడికల్ కాలేజీల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుంది..

కానీ లాభాలు మాత్రం ప్రైవేటు వాళ్లకే. ఇది స్కాం కాక మరేమిటని ప్రశ్నించారు.చంద్రబాబు స్కాంలకు కాదేది అనర్హమని అన్నారు. ఇసుక.. లిక్కర్.. ఆఖరికి రేషన్ బియ్యంలోనూ స్కాంలేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను 19 నెలల్లోనే స్కామాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని తెలిపారు. ప్రజల నుంచి దోచుకోవడానికి దొడ్డిదారులు వెతుకుతున్నారని, చార్జీలు, టోల్‌లు, సెస్‌ల పేరుతో ఇష్టమొచ్చినట్లు జనాలపై ఆర్థిక భారం మోపుతున్నారని తెలిపారు. బాదుడుతో సంపద సృష్టిస్తున్నారా అని ప్రశ్నించారు. గతంలో రాయలసీమలో ఉన్న ఏ ప్రాజెక్టునూ పూర్తిగా వాడుకోలేని పరిస్థితులు ఉండేవని, 40ఏళ్ల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నీళ్లు నింపలేకపోయారని తెలిపారు. ఎన్జీటి అభ్యంతరాల తర్వాత కేంద్రం నుంచి ఎక్స్పర్ట్ అప్రైజల్ కమిటీ మూడుసార్లు సమావేశమైతే రాష్ట్రం తరఫున చంద్రబాబు కనీసం నోరు మెదపలేదని జగన్ తెలిపారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మొదటి విడతలో బాలికలకు ప్రాధాన్యం....

ఒకొక్కటి చొప్పున వైఐఐఆర్ ఎస్ ల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందేనన్నారు. ప్రస్తుతం బాలికలకు స్కూల్స్ కేటాయించిన నియోజకవర్గంలో మరో విడతలో బాలురకు కేటాయించాలన్నారు. విద్యా శాఖపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. వైఐఐఆర్‌సీలో సోలార్ కిచెన్ల నిర్మాణాన్ని పీఎం కుసుమ్‌లో చేపట్టే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. వైఐఐఆర్ ఎస్ ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల్లలో స్వచ్ఛంద సంస్థల ద్వారా అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని తెలంగాణవ్యాప్తంగా అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. తగినంత స్థలం, అవసరమైన మద్దతు అందజేస్తే పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయగలమని అక్షయపాత్ర ప్రతినిధులు సీఎంకు తెలియజేశారు. ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి అందరికీ సకాలంలో భోజనం అందేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం కేటాయింపు లేదా 99 సంవత్సరాలకు లీజు తీసుకునే అంశంపై జిల్లా కలెక్టర్లతో మాట్లాడి త్వరగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ముఖ్యమంత్రి సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 23 నూతన పాఠశాల భవనాలు నిర్మాణాలు వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాచుపల్లి పాఠశాల స్థలం కేవలం అర ఎకరం మాత్రమే ఉండడంపై సీఎం ఆరా తీశారు. ఎక్కడైనా పాఠశాలకు కనీసం ఎకరంన్నర స్థలం ఉండాలని, బాచుపల్లి ప్రస్తుతం ఉన్న స్థలం సమీపంలో ఎకరంన్నర ఆ పాఠశాల నిర్మాణానికి కేటాయించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఒకటి నుంచి పదో తరగతి వరకు సిలబస్ మార్పుపై కసరత్తును వెంటనే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం పనులు వేగవంతం చేయాలని సీఎం సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో నూతన కోర్సులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు టాటా టెక్నాలజీస్‌తో ఒప్పందం చేసుకున్నందున దానిని త్వరగా అమలయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉద్యోగం లభించేలా సిలబస్, బోధన ఉండాలని సీఎం అన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఎల్.వి.ఎస్.ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేథకు కేరాఫ్ అడ్రెస్ గా హైదరాబాద్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 08:**
కృత్రిమ మేథ సాంకేతికలో దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ పరుగులు పెడుతోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు.

గురువారం నాడు ఆయన హైటెక్ సిటీలో ఎయిడెన్ ఏఐ ఇంజనీరింగ్ కేంద్రం విస్తరణ పనులను ప్రారంభించిన సందర్భంగా ప్రసంగించారు. రెండేళ్లలో తమ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకో సిస్టం వల్ల ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇవ్వాళ తెలంగాణా వైపు చూస్తున్నాయని ఆయన తెలిపారు.

ఎయిడెన్ ఏఐలో ప్రస్తుతం 500 మంది నిపుణులు పనిచేస్తుండగా వచ్చే రెండేళ్లలో మరో 500 మంది ప్రతిభావంతులకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. న్యూజెర్సీలోని ప్రిన్స్ టన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ కృత్రిమ మేథలో నూతన ఆవిష్కరణల ద్వారా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. ఏఐని విస్తృత కార్యకలాపాలకు అభివృద్ధి చేసే సంస్థలను తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో సంస్థ సిఇఒ కిరణ్ వెంట్రప్రగడ, సిఒఒ శ్రీని కమిడి, కవితా మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో జనగణనకు రంగం సిద్ధం

- ఏప్రిల్ 1 నుంచి తొలిదశ ప్రారంభం
- కేంద్ర హెూంశాఖ వెల్లడి
- తొలి విడతలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు గృహాల లిస్టింగ్!



**హైదరాబాద్ వెలుతురు జనవరి 09:**
దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో జరగనున్న జనగణనకు రంగం సిద్ధమైంది. దేశంలో జనగణన తొలి విడతలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఇళ్ల వివరాలను సేకరించనున్నారు. ఈ మేరకు కేంద్ర హెూంశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సందర్భంగా ప్రతి రాష్ట్రానికి 30 రోజుల వ్యవధి ఉంటుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పదేళ్లకోసారి దేశవ్యాప్తంగా నిర్వహించే జన గణన 2021లో చేపట్టాల్సి ఉండగా, కొవిడ్ కారణంగా వాయిదా పడింది. తాజాగా దీనిని చేపట్టాలని నిర్ణయించిన కేంద్రం రెండు దశల్లో నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. తొలిదశలో గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్-సెప్టెంబరు), రెండో దశలో జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి- మార్చి 1)ను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్రం ఇదివరకే స్పష్టం చేసింది. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తామని, స్వీయ గణనకు ఇదెంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంది. మరోవైపు, జనగణనతోపాటే కుల గణనను కూడా చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే వెల్లడించింది.

### ప్రీ-టెస్ట్‌లో ముమ్మర కసరత్తు!

అంతకుముందు యావత్ దేశంలోని ఇళ్ల వివరాలను ఎలా సేకరించాలి? ఇందుకోసం ఏ విధమైన మార్గదర్శకాలను అనుసరించాలి? మానవ వనరులను ఎలా మోహరించాలి? అనే దానిపై ప్రీ-టెస్ట్‌లో ముమ్మర కసరత్తు చేశారు. పారదర్శకంగా ఇళ్ల వివరాల సేకరణకు అనుసరించాల్సిన మార్గాలపై అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, ఉప జిల్లాల స్థాయిలోని అధికార వర్గాలతో లోతుగా చర్చిలు నిర్వహించారు. ఇళ్ల సమాచారాన్ని సేకరించడానికి లక్షలాది మానవ వనరులను మోహరించడంపైనా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశామని అధికార వర్గాలు ఇప్పటికే వెల్లడించాయి. డిసెంబరు ప్రారంభంలోనే ప్రీ-టెస్ట్ ముగిసిందని తెలిపాయి. దీన్ని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరినీ భారతదేశ రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ అభినందించారని పేర్కొన్నాయి.

### తొలి విడతకు కార్యాచరణ ప్రణాళిక

'గృహాల లిస్టింగ్, గణన' కోసం ఏప్రిల్ నుంచి దేశంలోని ప్రతీ ఇంటిని క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎలా చేరుకోవాలి? ఇంటి యజమానులను ఏయే ప్రశ్నలు అడిగి, ఎలాంటి సమాచారం సేకరించాలి? మొబైల్ యాప్‌ను ఎలా వాడాలి? డిజిటల్‌గా సమాచారాన్ని నమోదు చేసే క్రమంలో ఉపయోగపడే భద్రతా ఫీచర్లు ఏమిటి? సిబ్బందిని రాష్ట్ర, జిల్లా, ఉప జిల్లా స్థాయుల్లో ఎలా వినియోగించాలి? అధికారులు ఎలా సమన్వయం చేసుకోవాలి? అనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవడానికి ఇటీవలే జరిగిన ప్రీ-టెస్ట్ ప్రక్రియ దోహదపడిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

### ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఆర్‌జీఐ కీలక నిర్ణయాలు

ప్రీ-టెస్ట్ సందర్భంగా చాలా అంశాలపై ఫీడ్‌బ్యాక్‌ను సేకరించారు. అన్ని స్థాయిల అధికారులు తమ ఫీడ్‌బ్యాక్‌ను ఇచ్చారు. వాటన్నింటిపై అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సెన్సస్ డైరెక్టర్ల సమక్షంలోనే సమీక్ష జరిగింది. అందరి నుంచి సలహాలు, సూచనలను స్వీకరించారు. 'గృహాల లిస్టింగ్, గణన' ముగిశాక రెండో విడత జనగణన ప్రారంభమవుతుంది. ఇందులో భాగంగా మనదేశంలోని మంచుమయ ప్రాంతాల్లో జనాభా లెక్కల ప్రక్రియను 2026 సెప్టెంబరు నుంచి అక్టోబరు 1 వరకు నిర్వహించనున్నారు. మంచుమయ ప్రాంతాల జాబితాలో జమ్ముకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు ఉన్నాయి. దేశంలోని అన్ని ఇతర ప్రాంతాల్లో జనగణన 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 వరకు జరుగుతుంది.

## సంక్రాంతికి ముందే మునిసిపల్ షెడ్యూల్...



**హైదరాబాద్ వెలుతురు జనవరి 09:**
రాష్ట్రంలో పురపాలికల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సంక్రాంతి పండుగకు మూడు రోజులు ముందుగానే ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందులో భాగంగానే 117 మునిసిపాలిటీలు, 6 మునిసిపల్ కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీని షెడ్యూల్ ప్రకారం సిద్ధంచేస్తోంది. ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. పురపాలికల్లో ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని, కార్యదర్శి మంద్ మకరంద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లతో బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 12న అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని, 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ.. ఆ వెంటనే 'టీ-పోల్' సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 16న ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచురించాలని ఆదేశించారు.

## సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణలో 6431 ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం ఛార్జీలు పెంపు

**హైదరాబాద్ వెలుతురు జనవరి 09:**
ఈనెల 9,10,12,13,18,19 రోజుల్లో 6431 ప్రత్యేక బస్సులను నడుపనున్న తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు



## ప్రజాపాలనలో రెండేళ్లలోనే తెలంగాణకు కొత్త దిశరాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జనవరి 08:**
గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెట్టిందని ఈ రెండు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రానికి ఒక స్పష్టమైన కొత్త దిశను చూపిస్తూ అభివృద్ధిసంక్షేమాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. "రైజింగ్ రేవంత్ రెడ్డి, రెండేళ్ల పాలనలో పదేళ్ల ప్రగతి" పేరుతో స్పీక్ సంస్థ రూపొందించిన సావనీర్‌ను గురువారం నాడు తన నివాసంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డితో కలసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తెలంగాణను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే కాలంలో మరింత వేగంగా అభివృద్ధి, మరింత విస్తృతంగా సంక్షేమం అందేలా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రతి నిర్ణయంలో ప్రజలే కేంద్రబిందువుగా తమ ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని అన్నారు. పదేళ్లుగా నిర్లక్ష్యం, అవినీతి, అహంకార పాలనతో వెనుకబడ్డ తెలంగాణను తిరిగి గాడిలో పెట్టే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకరించిందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను విధానాలుగా మలుస్తూ, మాటలు కాదు పనులే ప్రామాణికంగా పరిపాలన సాగిస్తున్నామని తెలిపారు. రెండేళ్ల కాలంలోనే రైతులు, పేదలు, మహిళలు, యువత, దళితులు, గిరిజనులు, మైనారిటీలకు న్యాయం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నామని, సంక్షేమ పథకాలను కాగితాలకే పరిమితం చేయకుండా ప్రజలకు అందించామని మంత్రి అన్నారు. రెవెన్యూ శాఖ పరంగా భూ పరిపాలనలో పారదర్శకత తీసుకురావడం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారాలు చూపడం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆధునిక సాంకేతికతతో సర్వే ప్రక్రియలను వేగవంతం చేయడం వంటి చర్యలు ప్రజలకు నేరుగా మేలు చేస్తున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమీషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, స్పీక్ సంస్థ గౌరవ సలహాదారు అన్నే సత్యనారాయణ, అధ్యక్షుడు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మంత్రులకు కెసిఆర్ ఆత్మీయ స్వాగతం

భారత రాష్ట్రసమితి అధినేత కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం ప్రసాదం అందజేసి.. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరను సందర్శించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా.. తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి.. సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ దంపతులు సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందు స్వీకరించిన మంత్రులు.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆహ్వానం పలికారు. తన ఇంటికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులను 'బాగున్నరా అమ్మ' అంటూ ఆత్మీయంగా పలకరించారు. వారికి సాదర స్వాగతం పలికారు. కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ వారికి అతిథి మర్యాదలు చేశారు. సంప్రదాయం ప్రకారం పసుపు కుంకుమలు, చీర, తాంబూలాలతో ఆ ఆడబిడ్డలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా మేడారం ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులు అందించిన తేనీటి విందును మహిళా మంత్రులు స్వీకరించారు. కాసేపు పరస్పర యోగక్షేమాల గురించి వారు మాట్లాడుకున్నారు. ఇష్టాగోష్టి అనంతరం మహిళా మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు. అంతకుముందు మహిళా మంత్రులు ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసం దగ్గర వాహనాలు దిగగానే మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ వారికి పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు.

## సాహితీ ఇన్‌ఫ్రా మోసం రూ. 3 వేల కోట్లు !

**హైదరాబాద్ వెలుతురు జనవరి 09:**
తక్కువ ధరకే ప్లాట్లు, ఫ్లాట్లు ఇస్తామంటూ ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో వేల మందిని నట్టేట ముంచిన సాహితీ ఇన్‌ఫ్రా కుంభకోణంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ స్కామ్ విలువ ఏకంగా రూ. 3,000 కోట్లు ఉంటుందని సీసీఎస్ పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. నాలుగేళ్ల సుదీర్ఘ దర్యాప్తు తర్వాత, పోలీసులు ఈ కేసులో కీలకమైన ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు.ఁసాహితీ ఇన్‌ఫ్రా అధినేత లక్ష్మనారాయణ , అతని బృందం ఏ విధమైన అనుమతులు లేకుండానే అమీన్‌పూర్ వంటి ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులను ప్రకటించారు. ప్రీ-లాంచ్ ఆఫర్ పేరుతో మార్కెట్ ధర కంటే తక్కువకే ఇస్తామని నమ్మించి మధ్యతరగతి ప్రజల నుంచి వందల కోట్లు వసూలు చేశారు. కానీ ఇళ్లు కట్టలేదు. ఇప్పటివరకు ఈ సంస్థపై 64 కేసులు నమోదు కాగా, వాటన్నింటిపై



సీసీఎస్ ప్రత్యేక బృందాలు విచారణ జరుపుతున్నాయి. తాజా ఛార్జ్‌షీట్‌లో ప్రధానంగా అమీన్‌పూర్‌లోని శర్వాణి ఎలైట్ ప్రాజెక్టుపై పోలీసులు దృష్టి సారించారు. ఈ ఒక్క ప్రాజెక్టుకు సంబంధించి 17 కేసులు నమోదు కాగా, వీటిపైనే ఇప్పుడు ఛార్జ్‌షీట్ దాఖలైంది. ఈ ప్రాజెక్టు పేరుతో దాదాపు రూ. 500 కోట్లకు పైగా వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బాధితులకు ప్లాట్లు ఇవ్వకపోగా, ఆ డబ్బును లక్ష్మనారాయణ తన సొంత ప్రయోజనాల కోసం, విలాసాల కోసం మళ్లించినట్లు ఆధారాలు సేకరించారు. ఈ కుంభకోణంలో కేవలం లక్ష్మనారాయణ మాత్రమే కాకుండా, మొత్తం 13 మందిని నిందితులుగా పోలీసులు చేర్చారు. సంస్థ డైరెక్టర్లు, కీలక ప్రతినిధులు ఈ మోసంలో భాగస్వాములైనట్లు అభియోగాలు నమోదయ్యాయి. అనుమతులు లేని భూములను చూపించి, నకిలీ బ్రోచర్లు సృష్టించి ప్రజలను ఏ విధంగా వంచించారో పోలీసులు ఈ ఛార్జ్‌షీట్‌లో వివరించారు. నాలుగేళ్లుగా తమ సొమ్ము కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులకు ఈ ఛార్జ్‌షీట్ కొంత ఉపశమనం కలిగించే అంశమే. వసూలు చేసిన సొమ్మును రికవరీ చేయడం, నిందితుల ఆస్తులను అటాచ్ చేయడంపై పోలీసులు దృష్టి సారించారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా పక్కా సాక్ష్యధారాలను కోర్టుకు సమర్పించినట్లు సీసీఎస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. బాధితుల సొమ్ము వెనక్కి ఇప్పిస్తేనే వారికి న్యాయం జరిగినట్లవుతుంది.

## అక్రమ మద్యం, మాదకద్రవ్యాల కట్టడిలో అబ్కారీ అధికారులది కీలక పాత్ర

- నిర్దేశిత లక్ష్యలను చేరుకోవడంలో నిబద్ధతతో వ్యవహరించాలి
- ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సెంట్రల్ ఫోరం క్యాలెండర్ ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు





**హైదరాబాద్ వెలుతురు జనవరి 08:**
ఎక్సైజ్ శాఖ అధికారులు నిబద్ధతతో పని చేసి నిర్దేశిత లక్ష్యలను చేరుకోవాలని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. అక్రమ మద్యం, మాదకద్రవ్యాల రవాణాను సమర్ధవంతంగా అరికట్టడమే అధికారుల ప్రథమ కర్తవ్యం. క్షేత్రస్థాయిలో నిరంతరం సోదాలు నిర్వహిస్తూ, నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ మద్యం విధానాలను పక్కాగా అమలు చేస్తూనే, రాష్ట్ర ఆదాయాన్ని వృద్ధి చేసే దిశగా అంకితభావంతో కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. విధుల నిర్వహణతో పాటు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల ప్రభావంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మద్యం వల్ల కలిగే అనర్థాల గురించి వివరిస్తూ, సామాజిక ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల నివారణలో రాజీలేని పోరాటం చేయాలని స్పష్టం చేశారు. ఎక్సైజ్ అధికారుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి భరోసా ఇచ్చారు. అర్హులైన అధికారులకు పదోన్నతులు కల్పించే ప్రక్రియపై ప్రభుత్వం దృష్టి సారించింది. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, అధికారులందరూ ఉత్సాహంగా పనిచేసే వాతావరణాన్ని కల్పిస్తాం అని హామీ ఇచ్చారు. పదోన్నతులు పొందిన వారు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ శాఖ ప్రతిష్టను పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ గెజిటెడ్ అధికారులు సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ , కార్యదర్శి ఎం.పి.ఆర్ చంద్ర శేఖర్, విజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, రామకృష్ణ, ఏడుకొండలు, రాగవీణ, రాధ, శ్రావణ్ కుమార్, భాద్య నాయక్, సంపత్, చంద్ర శేఖర్, జయసుధ, శిరీష తదితరులు పాల్గొన్నారు

## హెచ్‌టి పత్తి విత్తనాలను అడ్డుకోండి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతిలేని హెచ్‌టి పత్తి విత్తనాలను రాష్ట్రంలో అమ్మకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పత్తి రకాన్ని అమెరికాకు చెందిన మోన్శాంటో కంపెనీ కనుగొన్నప్పటికి, ఫీల్డ్ ట్రయల్స్ లో ఫెయిల్ అవడం మరియు దీనివలన పర్యావరణానికి కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పత్తి రకానికి అనుమతులు ఇవ్వలేదని మంత్రిగారు తెలిపారు. అయినప్పటికి కొందరు దళారులు తమ ప్రయోజనాల కోసం రైతులకు ఊ÷ు పత్తి విత్తనాలను అనధికారకంగా రైతులకు అంటగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 అధీకృత పత్తి విత్తన కంపెనీలు విత్తనోత్పత్తి చేస్తుండగా, ప్రభుత్వం సర్టి÷డ్ చేసిన మరో 40 వివిధ కంపెనీలు రాష్ట్రానికి పత్తి విత్తన ప్యాకెట్లను సరఫరా చేస్తున్నాయన్నారు. గత సంవత్సరం ఈ కంపెనీల ద్వారా సరఫరా అయిన 1.10 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను రైతుల కొనుగోలు చేశారన్నారు. కొందరు దళారులు కేంద్ర



ప్రభుత్వం బ్యాన్ చేసిన హెచ్‌టి విత్తనాలతో పాటు కల్తీ విత్తనాలను మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలోని రైతులకు అమ్ముతున్నట్లు గుర్తించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 52 లక్షల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, దీనిని ఆసరా చేసుకొని దళారులు ఊ÷ు విత్తనాలు మరియు కల్తీ విత్తనాలను రాష్ట్రంలోకి తెచ్చే అవకాశం ఉన్నందున, ఈ నెల నుంచే సరిహద్దు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసిన పత్తి విత్తనాల అక్రమ రవాణాలను అరికట్టే విధంగా నిఘా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా కో-మార్కెటింగ్ కు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ రకం పత్తి విత్తనాలను రైతులు కొనకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కలుపును తట్టుకుంటుందని, అధిక దిగుబడి వస్తుందని పత్తి విత్తనాలను కొనవద్దని ఈ సందర్భంగా మంత్రి రైతులను కోరారు. ఈ విత్తనాలను వాడటం వలన అధికంగా కలుపు మందు వాడాల్సి వస్తుందని, దీంతో పర్యావరణానికి హాని కలగడంతోపాటు జీవ వైవిధ్యం దెబ్బతిని, ఇతర పత్తి హైబ్రిడ్ లు కూడా కలుషితం అవుతాయని వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు డా.గోపితో పాటు వ్యవసాయశాఖ అధికారులు మరియు విత్తన కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంపాదకీయం.. డాలర్, ఆయిల్‌పై ఆధిపత్య ధోరణి !

ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో మార్పు వస్తోంది. డాలర్ ఆధిపత్యానికి గండికొట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. చమురుపై పెత్తనాలను సహించడం లేదు. చైనా యెన్, రష్యా రూబుల్స్, భారత్ రూపాయిల్లో వ్యాపారాలకు సమాయత్తం అవుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా వస్తుమార్పిడి పద్ధతిలో వ్యాపారాలకు తెరదీస్తున్నారు. ఆయా దేశాలు ఈ రకమైన ఒప్పందాలకు ముందుకు కదులుతున్న వేళ ఇవన్నీ కూడా అగ్రరాజ్యం అమెరికాకు కంటకింపుగా మారాయి. ఇవన్నీ జరిగితే డాలర్ పతనం అవుతుంది. చమురుపై ఆధిపత్యం పోతుంది. అందుకే అమెరికా పావులు కదిపింది. ప్రపంచ దేశాలను గుప్పిట పెట్టుకునే ప్రయత్నంలో భాగంగా వెనుజులాపై దాడికి తెగించింది. ఆ దేశ అధ్యక్షుడు ముదురోను కిడ్నాప్ చేసి బందీగా తీసుకెళ్లింది. అయితే ఈ ఘటనపై వెనిజులాలో ఎక్కడా వ్యతిరేకత రాలేదు. ఎందుకంటే అక్కడ నిరుద్యోగం తాండవిస్తోంది. వలసలు పెరిగాయి. ఆయిల్ నిల్వలు ఉన్నా ఎదగడానికి లేకుండ ఆపోయింది. చావెజ్ కాలంలో చమురుశుద్ధి రంగంలోకి దిగిన అమెరిక్ ఆయిల్ కంపెనీలను తన్ని తగలేశారు. ఈ కారణంగా అక్కడ తినడానికే తిండి లేకుండా పోయింది. సంచుల్లో కరెన్సీ పట్టుకెళితు సంచెడు కూరగాయులు కూడా దొరకని పరిస్థితి దాపురించింది. అందుకే అమెరికా దాడిని ప్రజలు స్వాగతించారు. ఇకపోతే వెనెజులాతో చైనా వ్యాపారం జోరుగా సాగుతోంది. చైనా యెన్‌లో వ్యాపారం సాగిస్తోంది. ఇది అమెరికాకు గిట్టడం లేదు. చైనాను కట్టడి చేయడానికి అమెరికా వెంటనే రంగంలోకి దగడం వెనక ఇదే కారణమని అంతర్జాతీయ పరిణామాలు చెబుతున్నాయి. ప్రపంచంలో ఆర్థికంగా ఎదిగిపోతున్న చైనాను కట్టడి



చేయడానికి అమెరికా వెనిజులాను ఎరగా చేసుకుందన్న వాదన ఉంది. అందులో భాగంగానే వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోపై నార్కో టెర్రరిస్ట్ అనే అభియోగం మోపి అమెరికా కిడ్నాప్ చేసింది. అమెరికా వెనిజులాలో లభించే చమురు, ఖనిజ నిక్షేపాలను తన ఆధీనంలోకి తీసుకునేందుకు మాత్రమే ఈ దురాక్రమణకు పాల్పడలేదు. గత రెండు దశాబ్దాలుగా లాటిన్ అమెరికాపై చైనా పట్టు పెంచుకుంటోంది. లాటిన్ అమెరికా దేశాలకు చైనా ఆర్థిక సహాయమందిస్తోంది. దక్షిణ అమెరికాపై చైనా పట్టును సడలించడానికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇలాంటి బెదిరింపులకు దిగుతున్నారు. ఆర్థిక కోణంలో పరిశీలిస్తే.. వెనిజులాలో లభించే క్రూడాయిల్ ఎక్కువశాతం చైనాకు ఎగుమతి అవుతుంది. ఇదే కాకుండా బొగ్గు, బంగారం, బాక్సైట్, ఐరన్ ఎగుమతులు కూడా రెండు దశాబ్దాల్లో చైనాకు విపరీతంగా వియత్నాం ఎగుమతుల్ని పెంచుకుంది. 2000 సంవత్సరంలో ఒక శాతం కన్నా తక్కువగా ఉన్న ఖనిజ ఎగుమతులు అధికారిక లెక్కల ప్రకారం 2018 నాటికి 28 శాతం మేర వియత్నాం ఎగుమతులు పెరిగాయి. రెండు దశాబ్దాల కాలంలోనే.. లాటిన్ అమెరికా దేశాలకు చైనా రుణాలు ఇవ్వడం కూడా పెరిగింది. 1990ల మధ్యలో వెనిజులా దిగుమతులలో అమెరికా వాటా చాలా సంవత్సరాలు స్థిరంగా 40 శాతం మార్కును దాటింది. 2023లో వెనిజులా దిగుమతుల్లో అమెరికా వాటా కేవలం నాలుగో వంతు మాత్రమే. అయితే అదే కాలంలో చైనా వాటా మూడింట ఒకవంతుగా ఉంది. గత రెండు దశాబ్దాలలో చైనా వాటా పెరిగింది. అమెరికా నుంచి దిగుమతుల వాటా దాదాపు సగానికి తగ్గింది. ఇదే క్రమంలో డాలర్ల నుంచి చైనా యెన్‌ల రూపంలో మారకం సాగుతోంది. వెనిజులాపై ఆంక్షల నేపథ్యంలో ఈ పద్ధతిని చైనా ఎంచుకుంది. ఇది కూడా అమెరికా ఆగ్రహానికి కారణమయ్యింది. చైనా 2001-2023 మధ్యకాలంలో లాటిన్ అమెరికా దేశాలకు చైనా నుంచి పెట్టుబడుల పరంగానూ, సహాయంగానూ, రుణాలు, గ్రాంట్ల రూపంలో మొత్తం 300 బిలియన్ డాలర్లకు పైగా అందించింది. అందులో మూడింట ఒకవంతు కంటే ఎక్కువ సుమారు 106 బిలియన్ డాలర్లను వెనిజులాలో చైనా పెట్టుబడి పెట్టింది. లాటిన్ అమెరికాలోనే కాకుండా.. వెనిజులా ప్రపంచవ్యాప్తంగా చైనా నుంచి సహాయం పొందుతున్న నాల్గవ అతిపెద్ద దేశం అని ఎయిడ్ డేటా అనే పరిశోధనా ప్రయోగశాల గణాంకాలు చెబుతున్నాయి. వెనిజులా దిగుమతులతో.. చైనా 170కి పైగా ప్రాజెక్టులను నిర్మించుకుంది. వెనిజులాలో చైనా 26 శాతం కంటే ఎక్కువ విద్యుత్, మైనింగ్ ఇతర సంబంధిత పరిశ్రమల వంటి కీలక రంగాల్లో పెట్టుబడి పెట్టినట్లు ఈ గణాంకాలు తెలిపాయి. లాటిన్ అమెరికాలో చైనా ప్రభావాన్ని తగ్గించడానికి, ఓ రకంగా చైనాకు కౌంటర్ ఇవ్వడానికే వెనిజులా అధ్యక్షుడు మదురోని కిడ్నాప్ చేసినట్లు ఈ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే రష్యా, చైనా, ఇతర ఐరోపా దేశాలు డాలర్ ప్రభావం నుండి బయటపడే ప్రయత్నంలో ఉన్నాయి. ఇవన్‌ఈన గమనించిన ట్రంప త్వరగా చర్య తీసుకోకపోతే మొదటికే ముప్పు వస్తుందని గుర్తించారు. డారల్‌పైనా, ఆయిల్‌పైనా పట్టు కొనసాగించాలంటే అడ్డుకట్ట వేయాలని నిర్ణయించుకున్నారు. దాని పర్యవసానమే వెనిజులాపై దాడి అని గుర్తించాలి. అలాగే చైనా, భారత్, మెక్సికో తదితర దేశాలపైనా ఆంక్షలు, టారిఫ్‌లు విధిస్తున్నారు. బెదిరిస్తున్నారు. ముఖ్యంగా భారత్ ఆధిపత్యానికి గండి కొట్టేందుకు ర కరకాలుగా ప్రయత్నిస్తున్నారు. అక్కడి ఉద్యోగులపైనా ఆంక్షలు విధిస్తున్నారు. ఇవన్నీ కూడ అమెరికా పెత్తనం కొనసాగించేందుకే అని ప్రపంచం గుర్తిస్తోంది.

# ముఖ్యమంత్రి కుర్చీ బీసీలకు ఎందుకు దూరం?
# బీసీ పట్ల రాజకీయ పార్టీలు ఎందుకు నిర్లక్ష్యం.. !



**మన్నారం నాగరాజు.**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*తెలంగాణ రాజకీయాలను నిశితంగా పరిశీలిస్తే ఒక కఠినమైన నిజం పదే పదే ఎదురవుతుంది. ఈ రాష్ట్ర రాజకీయ వ్యవస్థ బీసీలను సంఖ్యలుగా మాత్రమే చూస్తోంది, కానీ నాయకత్వంగా మాత్రం అంగీకరించలేకపోతోంది. ఎన్నికల సమయంలో బీసీలే కేంద్ర బిందువుగా మారుతారు, కానీ అధికారం రూపుదిద్దుకునే సమయంలో మాత్రం బీసీలు అప్రాసంగికులుగా మిగిలిపోతున్నారు. ఇదే తెలంగాణ రాజకీయాల అసలు వైరుధ్యం. ఇదే బీసీలకు జరుగుతున్న చారిత్రక రాజకీయ అన్యాయం.*

కామారెడ్డిలో రాహుల్ గాంధీ చేసిన డిక్లరేషన్ దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ ఒక సాధారణ ఎన్నికల ప్రకటన కాదు. అది ఒక సామాజిక ప్రకటన. అది ఒక రాజకీయ ప్రకంపన. కానీ అదే సమయంలో తెలంగాణ సమాజంలో ఒక అసౌకర్యకరమైన ప్రశ్న పుట్టుకొచ్చింది. అంత పెద్ద హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ ముఖ్యమంత్రిని చేయకపోవడం ఆ పార్టీ రాజకీయ వైఫల్యమా, లేక బీసీలు మరోసారి ఆశ పెట్టుకుని మోసపోయిన చరిత్ర పునరావృతమా అనే సందేహం ప్రజల్లో బలంగా వినిపిస్తోంది.


ఈ ప్రశ్నకు సమాధానం ఒక్క కాంగ్రెస్‌కే పరిమితం కాదు. ఇది తెలంగాణ రాజకీయాలను శాసించిన అన్ని పార్టీలకూ వర్తించే ప్రశ్న. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం వరకూ రాజకీయ చరిత్రను వెనక్కి తిప్పి చూస్తే ఒక విషయమైతే స్పష్టంగా అర్థమవుతుంది. బీసీలు ఎప్పుడూ పాలకులుగా గుర్తించబడలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఒక్కసారి కూడా బీసీ ముఖ్యమంత్రి లేరు. ఉపముఖ్యమంత్రి కూడా లేరు. దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు రెడ్డి, కమ్మ, వెలమ,బ్రాహ్మణ, వంటి వర్గాల మధ్య అధికారాన్ని పంచుకున్నాయి. బీసీల పాత్ర మాత్రం ఎన్నికల ఓట్ల స్థాయికే పరిమితమైంది.

ఇది కేవలం పార్టీల కుట్ర మాత్రమే కాదు. ఇది రాజకీయ వ్యవస్థలో బీసీలను అణగదొక్కే ఒక మౌన ఒప్పందం. బీసీలు సంఖ్యలో ఎక్కువగా ఉన్నారు కాబట్టి వారికి హామీలు ఇవ్వాలి. కానీ వారు అధికార కేంద్రానికి చేరితే సమీకరణాలు మారిపోతాయి అనే భయం రాజకీయ పార్టీల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే బీసీలకు సంక్షేమ పథకాలు ఇస్తారు. కార్పొరేషన్లు ఇస్తారు. కమిటీల్లో పదవులు ఇస్తారు. కానీ అసలు అధికారాన్ని మాత్రం ఎప్పటికీ దూరంగా ఉంచుతారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ సమయంలో ఈ పరిస్థితి మారుతుందన్న ఆశ చాలా మందిలో ఏర్పడింది. ఉద్యమ సమయంలో కేసీఆర్ చేసిన ప్రసంగాలు అణగారిన వర్గాలకు కొత్త నమ్మకాన్ని ఇచ్చాయి. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్న మాట తెలంగాణ సమాజాన్ని కుదిపేసింది. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అదే కేసీఆర్ ఆ మాటను సులభంగా పక్కన పెట్టేశారు. అది రాజకీయంగా ఆయనకు లాభం చేకూర్చి ఉండొచ్చు. కానీ సామాజిక న్యాయం కోణంలో అది ఒక నగ్నసత్యమైన మోసం. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలనలో బీసీలకు కొంతమేర సంక్షేమం అందిందన్న వాదనను పూర్తిగా తిరస్కరించలేం. కొన్ని పథకాలు వచ్చాయి. కొన్ని నిధులు కేటాయించబడ్డాయి. అందులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ప్రతి సంవత్సరం 5000 కోట్ల రూపాయలు కేటాయిస్తానని చెప్పి, పది సంవత్సరాలలో 50 వేల కోట్ల రూపాయలు కేటాయించాల్సింది పోయి ,సుమారు 27 వేల కోట్ల రూపాయల ఖర్చు చేశారు. ఇక బీసీల డెవలప్మెంట్ ఎక్కడిది, కానీ అసలు ప్రశ్న వేరే. బీసీలకు పాలసీ నిర్ణయాధికారం ఇచ్చారా? ప్రభుత్వాన్ని నడిపించే శక్తి ఇచ్చారా? ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి, మున్సిపల్ శాఖ, వంటి కీలక పదవుల్లో బీసీలకు స్థానం ఇచ్చారా? ఈ ప్రశ్నలకు సమాధానం ఎవరైనా నిజాయితీగా చెప్పాలి వస్తే “లేదు” అనే మాట తప్ప ఇంకేమీ ఉండదు.

బీఆర్ఎస్ చేసిన అతిపెద్ద తప్పిదం ఇదే. బీసీలను సంక్షేమ లబ్ధిదారులుగా మాత్రమే చూడటం. నాయకులుగా ఎదగనివ్వకపోవడం. ఇది రాజకీయంగా బీఆర్ఎస్‌కు భారీ నష్టమే చేసింది. ఎందుకంటే బీసీలు ఓటు బ్యాంక్ మాత్రమే కాదని, వారు ప్రశ్నించే శక్తిగా మారితే రాజకీయాలు తలవంచాల్సి వస్తుందన్న సత్యాన్ని ఆ పార్టీ గుర్తించలేకపోయింది.

ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే, కామారెడ్డి డిక్లరేషన్ ఒక వైపు సామాజిక న్యాయంపై పెద్ద మాటలు, మరో వైపు అధికారంలోకి వచ్చాక అదే సామాజిక న్యాయాన్ని నాయకత్వ స్థాయిలో అమలు చేయడంలో వైఫల్యం ఁ ఈ ద్వంద్వ వైఖరి కాంగ్రెస్‌కు కొత్తది కాదు. తెలంగాణలో కూడా అదే పాత పద్ధతిని కొనసాగించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీ ఇచ్చిన పార్టీ, కనీసం బీసీ ముఖ్యమంత్రిని చేయలేకపోవడం రాజకీయంగా ఒక పెద్ద



ప్రశ్నార్థకమే.ఇక్కడ కాంగ్రెస్ వాదన ఏమిటంటే “సామాజిక న్యాయం పదవులకే పరిమితం కాదు”. ఈ వాదన వినడానికి బాగానే ఉంటుంది. కానీ అదే వాదన దశాబ్దాలుగా బీసీలకు వినిపిస్తున్నప్పుడు, అది ఒక నెపంగా మారిపోతుంది. అధికారంలో భాగస్వామ్యం లేకుండా సామాజిక న్యాయం పూర్తికాదన్న సత్యాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ నిజాయితీగా అంగీకరించలేదు.

బీజేపీ పరిస్థితి కూడా తెలంగాణలో పెద్దగా భిన్నంగా లేదు. దేశ స్థాయిలో బీసీ ప్రధాని ఉన్నాడని చెప్పుకోవడం ఒక రాజకీయ వాదనగా ఉపయోగపడొచ్చు. కానీ రాష్ట్ర రాజకీయాల్లో బీసీలకు నిజమైన నాయకత్వం ఇవ్వడంలో బీజేపీ కూడా విఫలమైంది. తెలంగాణ బీజేపీ నిర్మాణంలో బీసీలు ముందుకు రావడానికి అనుకూల వాతావరణం లేదు. బీసీలను ఆకర్షించడానికి మాటలు ఉన్నాయి కానీ వారిని రాజకీయ అధికారంగా మార్చే చిత్తశుద్ధి కనిపించడం లేదు.

ఇలా చూస్తే, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ – మూడు పార్టీల మధ్య ఒక అప్రకటిత సమానత్వం కనిపిస్తుంది. అది బీసీలను ఉపయోగించుకోవడంలో ఉన్న సమానత్వం. బీసీలకు పెద్ద పదవులు ఇవ్వకుండా, చిన్న చిన్న స్థానాలతో సంతృప్తి చెందాలని ఆశించే ఒక రాజకీయ ధోరణి. ఇది స్పష్టమైన రాజకీయ ద్రోహమే.

అయితే ఇక్కడ ఒక అసౌకర్యకరమైన ప్రశ్నను బీసీలు తమకు తాము వేసుకోవాల్సి ఉంటుంది. ఈ ద్రోహానికి పార్టీలే పూర్తిగా బాధ్యత వహించాలా? లేక బీసీల రాజకీయ బలహీనత కూడా ఇందుకు కారణమా? బీసీలు ఇప్పటివరకు రాజకీయంగా ఏకమయ్యారా? తమ వర్గం నుంచి నాయకత్వాన్ని నిరంతరం నిర్మించుకున్నారా? పార్టీలను ప్రశ్నించే స్థాయికి ఎదిగారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు అంత సులభంగా




“అవును” అని చెప్పలేనివే. బీసీలను విడగొట్టి పాలించడం పార్టీలకు సులభమైంది. ఉపకులాలుగా చీలిపోయిన బీసీ సమాజం ఒక సమిష్టి రాజకీయ శక్తిగా ఎదగలేకపోయింది. ఈ బలహీనతను పార్టీలన్నీ ఉపయోగించుకున్నాయి. ఒక వర్గానికి ఒక పదవి, మరో వర్గానికి మరో హామీ ఇచ్చి, మొత్తంగా బీసీలను ప్రశ్నించకుండా ఉంచే వ్యూహం చాలా కాలంగా కొనసాగుతోంది.

ఇప్పుడు తెలంగాణ రాజకీయాలు ఒక కీలక మలుపు దగ్గర ఉన్నాయి. బీసీలపై మాటలు చెప్పడం ఇక సరిపోదు. సంఖ్యలతో ఆటలాడడం కూడా ఇక పనిచేయదు. బీసీలు ఓటు బ్యాంక్‌గా మాత్రమే మిగిలిపోతారా, లేక అధికార భాగస్వాములుగా మారతారా అన్నది రాబోయే రాజకీయాల దిశను నిర్ణయించబోతోంది.

42 శాతం రిజర్వేషన్లు కావాలి. కానీ అంతకంటే ముందు కావాల్సింది బీసీలకు నాయకత్వం. ముఖ్యమంత్రి స్థాయి అధికారం. పాలసీ నిర్ణయాల్లో పాత్ర. ఇవి లేకుండా సామాజిక న్యాయం అనే మాట ఒక రాజకీయ నినాదంగానే మిగిలిపోతుంది. తెలంగాణ రాజకీయ చరిత్ర బీసీలకు ఒక పాఠం చెబుతోంది. నిశ్శబ్దంగా ఉంటే హామీలు వస్తాయి, కానీ అధికారం రాదు. ప్రశ్నిస్తే రాజకీయాలు అసహనం చెందుతాయి, కానీ మార్పు తప్పదు. ఇకనైనా బీసీలు ఈ సత్యాన్ని అర్థం చేసుకోవాల్సిన సమయం వచ్చింది.

ఇది పార్టీల దౌర్భాగ్యమా? అవును. ఇది బీసీలకు జరిగిన అన్యాయమా? ఖచ్చితంగా అవును. కానీ ఈ అన్యాయం కొనసాగుతుందా, లేక ఇక్కడితో ఆగుతుందా అన్నది ఇక బీసీల రాజకీయ చైతన్యంపై ఆధారపడి ఉంది. తెలంగాణ రాజకీయాల్లో బీసీలు, ఎంబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు సంఖ్యాబలం కలిగిన వర్గాలే అయినా అధికార నిర్ణయాల్లో మాత్రం ఇంకా అంచుల్లోనే నిలబడుతున్నారన్నది తిరస్కరించలేని నిజం. ఎన్నికల వేళ ఓటు బ్యాంక్‌గా గుర్తింపు, సభల వేళ నినాదాలుగా వినియోగం, అధికారంలోకి వచ్చాక మాత్రం నిర్లక్ష్యం ఉ ఇదే దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజకీయ వ్యూహం. ఈ పరిస్థితి మారాలంటే ఇకపై మౌనం వీడాలి, సంఘటితంగా ఒకటై కావాలి , “ఎవరో వచ్చి మన కోసం చేస్తారు” అన్న భ్రమ నుంచి బయటకు రావాలి. ఓటు హక్కు అనేది కేవలం ఒక గుర్తు వేయడం కాదు, అది పాలన దిశను నిర్ణయించే ఆయుధం. ఆ ఆయుధాన్ని ఎవరికి, ఎందుకు ఇస్తున్నామన్న స్పష్టత లేకపోతే చరిత్ర మళ్లీ అదే పాఠాన్ని చదివిస్తుంది. “బీసీలు ఉన్నారా? కానీ పాలన మాత్రం ఇతరులదే.” ఈ వాక్యం ఇకపై చరిత్ర పుస్తకాల్లోనే ఉండాలి గానీ, నేటి రాజకీయ వాస్తవంగా ఉండకూడదు. దానికి అవసరమైనది భావోద్వేగం కాదు, రాజకీయ చైతన్యం.

బీసీ, ఎంబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు తమ మధ్య ఉన్న భిన్నతలను కాదు, తమకు సాధారణంగా ఎదురవుతున్న రాజకీయ అన్యాయాన్ని గుర్తించాలి. ఎవరు ఎక్కువ సీట్లు ఇస్తున్నారు, ఎవరు ఎక్కువ పదవులు ఇచ్చారు అన్న లెక్కలతో పాటు ఎవరు విధానాల్లో, బడ్జెట్‌లో, పాలనలో భాగస్వామ్యం కల్పించారు అన్నదే అసలు కొలమానం కావాలి. నాయకులు ముఖ్యం కాదు, విధానం ముఖ్యం అన్న స్పృహ ప్రజల్లో పెరగాల్సిన సమయం ఇది.

అధికార భాగస్వాములుగా ఎదగడం అంటే కేవలం మంత్రి పదవులు కోరడం కాదు, నిర్ణయాల్లో, విధానాల్లో, అమలులో వాటా ఉండటం. ఆ స్థాయికి చేరాలంటే సంఘటిత స్వరం అవసరం. విడివిడిగా ఉన్నంతకాలం ప్రతి వర్గం వేర్వేరుగా మోసపోతూనే ఉంటుంది. కలిసినప్పుడే ప్రశ్నించే శక్తి పెరుగుతుంది, ఒత్తిడి పెరుగుతుంది, మార్పు సాధ్యమవుతుంది. ఇది హెచ్చరిక కాదు, ఇది అవకాశం. ఇప్పటికీ నిర్ణయం తీసుకోకపోతే రేపటి తరాలు కూడా ఇదే ప్రశ్న వేస్తాయి ఉ “మాకంత సంఖ్యాబలం ఉన్నా, మాకెందుకు అధికారం లేదు?” ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత నేటి తరం మీదే ఉంది. కాబట్టి ఓటు బ్యాంక్‌గా మిగలాలా, అధికార భాగస్వాములుగా ఎదగాలా అన్న నిర్ణయం ఇప్పుడే తీసుకోవాలి. ఇదే తెలంగాణ సమాజం ముందు నిలబడ్డ నగ్న సత్యం.

## క్యాలెండర్ ఆవిష్కరించిన కేంద్రమంత్రి బండి సంజయ్.



**కరీంనగర్ వెలుతురు జనవరి 08:**
జీవీకే కన్స్ట్రక్షన్స్ , ఇంజనీర్, ఆర్కిటెక్చర్ , ప్లానర్ జి. వి. కిషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్లో ఆవిష్కరించారు.

## విద్యార్థుల కోసం రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం

**- ఎంవిఐ జి. ప్రదీప్ కుమార్ గౌడ్**




**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 08:**
ఆదిలాబాద్ జిల్లా బోత్ మండలం పొచ్చెర గ్రామం లోని సెంట్ థామస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థుల కోసం రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ప్రముఖ అతిథులుగా మండల విద్యాధికారి మొహమ్మద్ హుస్సేన్, ఎంవి ఐ జి. ప్రదీప్ కుమార్ గౌడ్ లు హాజరై మాట్లాడారు. రహదారి భద్రత ప్రాముఖ్యతపై గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు.రోడ్డు సంకేతాల (సంజ్ఞల) గురించి తెలుసుకోవటం ఎంతో అవసరం,మనం రోడ్డుపై వెళ్తున్నప్పుడు నిత్యం అనేక రకాల రోడ్డు సంకేతాలను చూస్తుంటాం. అందులో కొన్ని దారి చూపేవైతే, మరికొన్ని సమాచారాన్ని అందించేవి, ఇంకొన్ని డ్రైవర్లను అప్రమత్తం చేసివిగా ఉంటాయి. హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం,డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వాడకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని,మైనర్లు వాహనాలు నడపకూడదని విద్యార్థులకు స్పష్టంగా అవగాహన కల్పించారు.ఆరోగ్య శాఖ సిబ్బంది విద్యార్థులకు అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ ప్రాక్టికల్ను ఈ సందర్భంగా కూడా చూపించారు.అనంతరం రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించడంతో కార్యక్రమం విజయవంతంగా . ముగిసింది. ఈ కార్యక్రమంలో ఏఎంవిఐ ఎం. స్వేత, , బి. అలేఖ్య, కే. అనుష్ , హెడ్ మాస్టర్ స్మిత స్కూల్ టీచర్లు , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోనియా గాంధీ కోలుకోవాలని మహంకాళి దేవాలయంలో మహా మృత్యుంజయ హెూమం

**- మాజీ ఎంపీ వి. హనుమంతరావు**



**బషీర్ బాగ్ వెలుతురు 8 జనవరి :**
యూపీఏ చైర్ పర్సన్, ఎంపీ సోనియా గాంధీ త్వరగా కోలుకోవాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు ఆధ్వర్యంలో గురువారం అంబర్పేటలోని మహంకాళి దేవాలయంలో "మహా మృత్యుంజయ హెూమం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వి హనుమంతరావు మాట్లాడుతూ యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ త్వరగా కోలుకొని ఆయురారోగ్యాలతో ఉండాలని హెూమం కార్యక్రమాలు, పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జ్ఞానేశ్వర్ గౌడ్, దిడ్డి రాంబాబు, నారాయణ స్వామి, సీనియర్ నాయకులు శంభుల శ్రీకాంత్ గౌడ్, వెంకటేష్, శ్రీధర్ గౌడ్, అనిల్, తలుపునూరి కృష్ణ గౌడ్, సత్యనారాయణ గౌడ్, గరిగంటి రమేష్, సుధాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మంచాల గ్రామ ప్రజా సమస్యలు తెలుసుకోవటానికి గ్రామ వార్డులో పర్యటనకు సిద్ధం అవుతున్న గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్

**- మంచాల గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు**



**మంచాల వెలుతురు జనవరి 8:**
మంచాల మండలం మంచాల గ్రామ నూతన సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన ఏర్పుల మానస వినయ్ ఉపసర్పంచ్ పందుల లింగంగౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజాసమస్యలు తెలుసు కోవటానికి జన వరి తేది 8,9,10,11 నాలుగు రోజుల పాటు పారిశు ధ్యవారోత్సవాలు కా ర్యక్రమం నిర్వహిస్తున్నాం ఈ కార్యక్ర మంలో ముఖ్యంగావీధి దీపాలు కొత్తవి అమర్చడం నీటి సమస్యలు పరిష్కారం చేయడం రోడ్లపైఉన్న చెత్తపూర్తిగా తీసివేయుట డ్రైనేజీ సమస్యలు తీర్చడం లాంటిపనులు పూర్తి చేయడం జరుగుతుంది అన్నారు దయచేసి మంచాల గ్రామ ప్ర జలు ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గ్రామ పంచాయతీ పాలకమండలి దృష్టికి తీసుకు వచ్చి సహకరిం చలరని అన్నారు గ్రామంలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి పనులుచేయాలో పరిశీలించి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారం తో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతాం గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే మాలక్ష్యం అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బి శ్రీనివాస్ గౌడ్ మంచాల మాజీ ఎంపీటీసీ ఎద్మ నరేందర్ రెడ్డి వార్డు సభ్యులుగ్యార జంగయ్య పుడుతల సాలయ్య నీళ్ల పారిజాత కృష్ణ ముదిరాజ్ గ్రామ పెద్దలు నారెడ్డి హరికిషన్ రెడ్డి రావుల శ్రీనివాస్ గ్యార జగన్ ఏర్పులనరసింహ యాదయ్య ముదిరాజ్ గడ్డం జంగయ్య గడ్డం పాపయ్య తదితరులు పాల్గొ న్నారు

# కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకై కలిసి ఉద్యమిద్దాం

### కేజీకేఎస్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సభలో గౌడ, కల్లు గీత సంఘాల నాయకుల పిలుపు



హైదరాబాద్ వెలుతురు జనవరి 08: కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదని వాటి అమలుకు ఐక్యంగా ఉద్యమిద్దామని వివిధ గౌడ, కల్లుగీత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం రోజున కల్లుగీత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, సుప్రజ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శిగ విజయ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై అవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు యం.వి.రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ 2 సంవత్సరాల కాలంలో ఎన్నోసార్లు మంత్రులను, అధికారులను కలిసి వినతి పత్రాలు ఇచ్చామని, సూర్యాపేటలో వేలాది మందితో గీతన్నల రణభేరి నిర్వహించామని అన్నారు.ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిలో ప్రమాదం జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్ గ్రేషియా రెండు సంవత్సరాల నుండి ఇవ్వడం లేదని మేనిఫెస్టోలో మాత్రం నెల రోజుల లోపు ఇస్తామని చెప్పారన్నారు. వీరికి ఇవ్వాల్సిన 14 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లిక్కర్ షాపుల్లో 25 శాతం రిజర్వేషన్స్, బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందని అన్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరణ చేసిన కాటమయ్య రక్షణ కవచం 20 వేలు మాత్రమే పంపిణీ చేశారని మిగతా వృత్తి చేసే వారందరికీ ఇవ్వాలన్నారు. నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్ మూత పడిందని, నందనములోని ప్రాజెక్టు పడావు పడిందని వీటిని వెంటనే ప్రారంభించాలని అన్నారు. గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిలి వెంకన్న గౌడ్ మాట్లాడుతూ ప్రమాదానికి గురయ్యే వారికి టాడి కార్పొరేషన్ నుంచి ఇచ్చే ఆర్థిక సహాయం నిలుపుదల చేశారని వీటిని వెంటనే కొనసాగించాలన్నారు, ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించాలని అన్నారు. గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ మాట్లాడుతూ ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహం పెడతామని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెడతామని, వృత్తి పెన్షన్ 4 వేలకు, ఎక్సిగ్రేషియా 10 లక్ష లకు పెంచుతామని ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోకాపేటలోని గౌడ భవనం పూసే లేదని అన్నారు. గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కల్లు షాపులపై ఎక్సైజ్ దాడులు మానుకోవాలని,ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేని పక్షంలో భవిష్యత్ లో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి నాగరాజు, యాదగిరి చారి, బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు దుర్గయ్య,గౌడ్, బైరు శేఖర్ మరియు సంఘాల నాయకులు కొన్నింటి ప్రభులింగం గౌడ్ , మీనయ్య గౌడ్, వంగ సదానందం గౌడ్, కేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉషాగొని వెంకట నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి సిరిపురం రమేష్ గౌడ్, వర్కాల బాలరాజ్ గౌడ్, అంబాల శ్రీనివాస్,సట్ల ప్రభాకర్,కప్పల లింగం గౌడ్, రొడ్డ లలిత,జె.రాజు, నడిమింటి ఆశన్న గౌడ్ ,జంగా గౌడ్, శుభమస్తు మ్యారేజ్ బ్యూరో చైర్మన్ రాములు గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ సురుగు రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టిక్కెట్ ఎవరికి ఇచ్చినా గెలిపిస్తాం...

- సర్వే ఆధారంగానే టిక్కెట్లు ఇవ్వండి
- కలిసికట్టుగా ప్రచారం చేసి కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేస్తాం
- గడప గడపకూ వెళ్లి కేంద్రం చేసిన అభివృద్ధిని వివరించి ఓట్లు అడుగుతాం
- బీజేపీకి ఓటేయకపోతే కరీంనగర్ ప్రజలకు జరిగే నష్టాన్ని వివరిస్తాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కు బాసటగా నిలిచిన కరీంనగర్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు
- టిక్కెట్ విషయంలో రాజీ ప్రసక్తే లేదని తేల్చిన బండి సంజయ్
- మా కుటుంబ సభ్యులతో పైరవీ చేయిస్తే టిక్కెట్ కట్
- బీజేపీలో కుటుంబ సభ్యుల జోక్యం ఉండబోదు
- గెలుపు గుర్రాలకే సీట్లు ఇవ్వబోతున్నట్లు స్పష్టీకరణ
- కరీంనగర్, వరంగల్ కు ఉన్న తేడాను వివరించాలని కోరిన బండి సంజయ్



**కరీంనగర్ వెలుతురు జనవరి 08:**
"అన్నా...టిక్కెట్ ఎవరికి ఇచ్చినా మా డివిజన్ లో బీజేపీ అభ్యర్థినే గెలిపిస్తాం. దయచేసి సర్వే ఆధారంగానే టిక్కెట్లు ఇవ్వండి. మాకు టిక్కెట్ రాకపోయినా నారాజ్ కాబోం. రెబల్ గా పోటీ చేయబోం. కలిసికట్టుగా ప్రచారం చేసి కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేస్తాం" అంటూ కరీంనగర్ కార్పొరేషన్ కు చెందిన బీజేపీ నాయకులంతా ముక్తకంఠంతో నినదించారు. గురువారం రోజున కరీంనగర్ లోని రేకుర్తి శుభం గార్డెన్స్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ అధ్యక్షతన కరీంనగర్ కార్పొరేషన్ బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు, కోమాల ఆంజనేయులు, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, వాసాల రమేశ్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ సంక్రాంతి తరువాత ఏ క్షణమైనా మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీకి మంచి వాతావారణం ఉందని, ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారని చెప్పారు. టిక్కెట్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. తాను ఎవరికీ టిక్కెట్లు ఇస్తానని హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. కొంతమంది తన కుటుంబ సభ్యుల ద్వారా టిక్కెట్లు కావాలంటూ ఒత్తిడి చేయిస్తున్నారని, అలాంటి వారికి టిక్కెట్ ఇవ్వబోనని తేల్చి చెప్పారు. బీజేపీలో కుటుంబ సభ్యుల జోక్యం ఉండబోదని స్పష్టం చేశారు. టిక్కెట్ల కేటాయింపులో ఏయే అంశాలను పరిగణలోకి తీసుకోవాలో సూచనలు ఇవ్వాలని ఈ సందర్భంగా నాయకుల నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన నాయకులంతా "టిక్కెట్ ఎవరికి ఇచ్చినా మా డివిజన్ లో బీజేపీ అభ్యర్థినే గెలిపిస్తాం. దయచేసి సర్వే ఆధారంగానే టిక్కెట్లు ఇవ్వండి. మాకు టిక్కెట్ రాకపోయినా నారాజ్ కాబోం. రెబల్ గా పోటీ చేయబోం. కలిసికట్టుగా ప్రచారం చేసి కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేస్తాం" చేతులెత్తి ముక్తకంఠంతో నినదించారు. దీంతోపాటు గడప గడపకూ వెళ్లి కేంద్రం చేసిన అభివృద్ధిని వివరించి ఓట్లు అడుగుతామని చెప్పారు. బీజేపీకి ఓటేయకపోతే కరీంనగర్ ప్రజలకు జరిగే నష్టాన్ని వివరిస్తామని తెలిపారు. ప్రజల్లో బీజేపీకి మంచి వాతావరణం ఉన్న నేపథ్యంలో బయట పార్టీల నుండి ఎంతో మంది నాయకులు రావడానికి ప్రయత్నిస్తున్నారని, అందులో అవినీతిపరులను, కబ్జాదారులను మాత్రం చేర్చుకోవద్దని కోరారు.

## సంక్రాంతి సెలవుల్లో ఇళ్ల భద్రతపై కుషాయిగూడ పోలీసుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం





**కుషాయిగూడ,జనవరి 8 వెలుతురు:**
సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే ప్రజల కారణంగా పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు ఖాళీ అవుతున్న నేపథ్యంలో, దొంగతనాల నివారణ కోసం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్టేషన్ పరిధిలోని అన్ని కాలనీలు, ప్రధాన రహదారులపై ఆటోలో మైక్ సెట్ల ద్వారా ప్రజలకు ఇళ్ల భద్రతపై అవగాహన కల్పిస్తూ సలహాలు, సూచనలు అందిస్తున్నారు.
ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, ప్రజలు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా పండుగ సెలవుల సమయంలో పోలీసుల సహకారం తీసుకోవడం ద్వారా ఇళ్ల భద్రత మరింత పటిష్టం అవుతుందని పేర్కొన్నారు.
పోలీసులు సూచించిన ముఖ్య భద్రతా చర్యలు ఇవి:
1.ఇంటిని లాక్ చేసి వెళ్లే ముందు స్థానిక పోలీస్ స్టేషన్ లేదా బీట్ అధికారికి సమాచారం ఇవ్వాలి.
2.తలుపులు, కిటికీలు బాగా లాక్ చేసి, విలువైన వస్తువులను సురక్షతమైన సేఫ్లో ఉంచాలి.
3.పక్కింటివారికి లేదా నమ్మకమైన వ్యక్తికి ఇంటి భద్రత బాధ్యత అప్పగించాలి.
4.సోషల్ మీడియాలో ఊరెళ్లే విషయాలను ముందుగా పోస్టు చేయకుండా జాగ్రత్త వహించాలి.
5.అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.
ప్రజల సహకారంతోనే దొంగతనాలను పూర్తిగా అరికట్టవచ్చని, భద్రత విషయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని కుషాయిగూడ పోలీసులు తెలిపారు.

## ఎసిబికి పట్టుబడ్డ ఎస్ఐ



**వరంగల్,జనవరి 8( వెలుతురు):**
రాష్ట్రంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడుతున్నారు. గురువారం వరంగల్ కేయూసీ సబ్ ఇన్స్పెక్టర్ పి. శ్రీకాంత్ను రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఇటీవల ఒక కేసులో పట్టుబడ్డ వ్యక్తి తనపై వెంటనే చార్జ్షీట్ నమోదు చేసి పట్టుకున్న వాహనాన్ని, మొబైల్ ఫోన్ను తనకు అప్పగించాలని ప్రైవేట్ డ్రైవర్ ద్వారా ఎస్సైను సంప్రదించాడు. దీంతో లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం కేయూ జంక్షన్ వద్ద రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి ప్రైవేట్ డ్రైవర్ను, ఎస్సైను పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచారు.

## రోడ్ సురక్షపై అవగాహన ర్యాలీ నిర్వహణ విద్యార్థులతో కలిసి పాల్గొన్న సివిల్ జడ్జి శ్రీ రవీందర్




**కుషాయిగూడ, జనవరి 8 వెలుతురు:**
మెడ్చల్ఉమల్కాజ్గిరి జిల్లా సివిల్ జడ్జి (జూనియర్ సివిల్ జడ్జి) శ్రీ రవీందర్, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సహకారంతో ఆద్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ విద్యార్థులతో కలిసి రోడ్ సురక్ష అభియాన్ ర్యాలీని నిర్వహించారు.ఈ ర్యాలీ కుషాయిగూడలోని ఆద్య జూనియర్ కాలేజ్ నుండి ప్రారంభమై ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీ రవీందర్ పాల్గొన్నవారితో రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. రహదారులపై ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన వివరించారు. ముఖ్యంగా యువత రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకొని బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, కోర్టు సిబ్బంది, ఆద్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. రహదారిపై ప్రయాణించే ప్రజల్లో అవగాహన కల్పించడం, ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించేలా ప్రోత్సహించడం ఈ ర్యాలీ యొక్క ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

# బీసీలకు రాజ్యాధికారం ఖాయం

## జాజుల శ్రీనివాస్ గౌడ్, కటకం నర్సింగ్ రావు

- మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో మూడు రోజులపాటు శిక్షణ శిబిరాలు
- బీసీ వాదం బలపడడమే ఏకైక లక్ష్యంగా కొనసాగుతున్న శిక్షణ శిబిరాలు





**యాదగిరిగుట్ట, జనవరి 8 ( వెలుతురు )**
బీసీలకు రాజ్యాధికారం దక్కడం ఖాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ రావు అన్నారు. మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో మూడు రోజులపాటు బీసీ ప్రతినిధులకు బీసీ వాదంపై శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. బీసీ వాదం మరింతగా బలపడి భవిష్యత్తులో బీసీ లకు రాజ్యాధికారం దక్కేలా చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా యాదగిరిగుట్టలో బుధవారం నుండి ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరాలలో రెండవ రోజైన గురువారం రోజున ముఖ్యఅతిథిగా బీసీ సంక్షమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావులు ప్రత్యేక ప్రసంగం చేశారు . బీసీలకు రాజ్యాధికారం రావడమే ప్రధాన లక్ష్యంగా తాము నిరంతరం పోరాడుతున్నామని అన్నారు. బీసీలలో ఒక బలమైన ఆలోచన రావాలనే ఉద్దేశంతోనే బీసీ వాదం బలపడాలనే లక్ష్యంతోనే తాము ఈ శిబిరాలను నిర్వహిస్తున్నామని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగరావు అన్నారు. శిక్షణ శిబిరాలు మూడు రోజుల పాటు జరుగుతున్నాయని అన్నారు . పెద్ద ఎత్తున కార్యకర్తలు ప్రతినిధులు శిబిరాలలో పాల్గొని శిక్షణ పొందుతారని అన్నారు. 2028లో తెలంగాణ రాష్ట్రంలో బీసీలు అధికారంలోకి రావడం ఖాయమని, తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. అన్ని పార్టీలలో ఉన్న బీసీలంతా ఏకమవుతున్నారని అన్నారు . బీసీలు ఎక్కడ ఉన్న ఏ సంస్థలో ఉన్న ఏకతాటిపైకి రావాలని కోరారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రతి ఒక్క బిసి ముందుకు రావాలని అన్నారు. భవిష్యత్తులో బలమైన బీసీ ఉద్యమం కోసం తాము కృషి చేస్తున్నామని అన్నారు. మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీసీ వాదాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు .

ఈ సందర్భంగా బీసీలకు సంబంధించిన ఆయా అంశాలలో పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ నేతలు వివిధ రంగాలలో నిష్ణాతులైన బీసీ ప్రముఖులు జూలూరు గౌరీ శంకర్ , గుజ కృష్ణ , గణేష్ చారి పురుషోత్తం రావు, కోల భాస్కరరావు, గడ్డం నరసింహ ఆంజనేయులు, రాజేశ్వర్ దుర్గారాణి , మల్లికార్జున్, శ్రీనివాస్ యాదవ్, చంద్రశేఖర్, కృష్ణయ్య వెంకటయ్య యాదవ్, శంకర్ నాంపల్లి రవి , దశరథ , సూర్యరావు బ్రహ్మయ్య, నరహరి చారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిశీలన



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 08:**
నార్కట్ పల్లి పట్టణ కేంద్రంలో గల స్థానిక పభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్ బోర్డ్ ప్రత్యేక అధికారి డిప్యూటి సెక్రెటరీ భీమ్ సింగ్ విద్యార్థుల యొక్క ఉత్తీర్ణత పెంచే విషయంపై అధ్యాపకులకు 40 రోజుల యాక్షన్ ప్లాన్ తయారుచేసి రాబోయే వార్షిక పరీక్షలకు చదువులో వెనుకబడిన విద్యార్థులను సంసిద్ధం చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ కళాశాలలో రాబోయే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల పరికరాల కొనుగోలు కోసం 50,000/- ప్రభుత్వం నుంచి మంజూరు చేశారని తెలిపారు. ప్రాక్టికల్స్, సి.సి కెమెరాలు, రికార్డ్స్, స్టడీ అవర్స్ తరగతులను పరిశీలించారు. ఉపయోగించి మంచి ర్యాంకు సాధించాలి అని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలాజీ, , అధ్యాపకులు,నడింపల్లి వెంకటేశ్వర్లు,సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయి

- ఎస్సై సృజన్ కుమార్



**జనగామ జిల్లా: దేవరుప్పుల (వెలుతురు)జనవరి 8:**
సంక్రాంతి పర్వదినం పుష్కరించుకుని దేవరుప్పుల మండలం, అప్పిరెడ్డిపల్లి గ్రామంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. ఈ క్రీడా కార్యక్రమాన్ని ఎస్సై సృజన్ కుమార్ ప్రారంభించారు. విజేతలకు మొదటి బహుమతిగా 16,116/-షీల్డ్ ను,ద్వితీయ బహుమతి గా 11,116/-షీల్డ్ అందించనున్నారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత క్రీడలో రాణించాలన్నారు.మొదటి బహుమతిని సర్పంచ్ కౌడగాని అనూష నర్సింగరావు,ద్వితీయ బహుమతిని ఉపసర్పంచ్ భాషిపెల్లి కళ్యాణి సోమాజి అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో,ప్రజా ప్రతినిధులు,గ్రామ యువత పాల్గొన్నారు.


## జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన రామన్నపేట డిగ్రీ కళాశాల విద్యార్థి



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 08:**
జాతీయ స్థాయి హాకీ పోటీలకు రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నోముల సాయి కుమార్ ఎంపికయ్యారు. బుధవారం నాడు మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం నందు జరిగిన ఎంపిక పక్రియ పోటీలో పాల్గొనగా ఈ నెల 12న తమిళనాడు లోని సత్యభామ విశ్వ విద్యాలయం నందు జరిగిన జాతీయ స్థాయి పోటీలలో అడనున్నట్లు తెలిపారు. సాయి కుమార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందుకు తోటి విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ, సంతోషం తో సాయి కుమార్ కి శుభాకంక్షలు తెలిపి, జాతీయ స్థాయిలో జరిగే పోటీలో మంచి ప్రతిభ కనబరిచి, విజేత గా నిలిచి తల్లిదంద్రులకి, కళాశాల కి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

## వ్యవసాయ భూమిలో రైతు హఠాన్మరణం

- ఆలస్యంగా వెలుగులోకి విషాదంలో గ్రామస్తులు



**వనపర్తి, వెలుతురు ప్రతినిధి జనవరి 08:**
వ్యవసాయ భూమిలో వరినారు పోసేక్రమంలో, మడి రొప్పుతూ రైతు నాగేంద్రం గౌడు హఠాన్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే వనపర్తి జిల్లా పెబ్బేరు మండల పరిధిలోని తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన బుచ్చన్న గౌడ్ కుమారుడు నాగేంద్రం గౌడు(45) మంగళవారం సాయంత్రం తన సొంత వ్యవసాయ భూమి లో అకస్మాత్తుగా మృతి చెందారు. ఉదయం ట్రాక్టర్ మడి వేయగా వరితుకం పోయటంకోసం, కాడెద్దులతో మద్యాహ్నం నుండి మడి వేసారు. సాయంత్రం ఒకే ఎద్దు గ్రామానికి రావటంతో ఏమైంది అని ఆతృత పడిన గ్రామస్తులు, నాగేంద్రం గౌడు అచేతనంగా పడి ఉండటం గమనించారు. ప్రైవేట్ ఆసుపత్రికి హుటాహుటిన తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ సంఘటన తో గ్రామం యావత్తు విషాద ఛాయలు అలుముకున్నాయి.

## నల్లగొండ శక్తి న్యూ వాయిసెస్ హంగర్ రిలీఫ్ సేవలు ప్రశంసనీయం

- నల్లగొండ శక్తి న్యూ వాయిసెస్ క్లబ్ మెంబర్ విజయ శ్రీరామోజు

**నల్లగొండ జిల్లా వెలుతురు జనవరి 08:**



లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ హంగర్ రిలీఫ్ వారోత్సవాల సందర్భంగా నల్గొండ శక్తిన్యూ వాయిసెస్ క్లబ్ మెంబర్ అయిన విజయ శ్రీరామోజు ప్రోత్సాహంతో హైదాబాద్ 320 డి డా. రొయ్యూరు సురేష్ సహకారంతో బుధవారం రోజున బింగ్& బిట్స్ ప్రవేట్ పార్టీ థియేటర్ ఆవరణలో 30 మంది పేద మహిళలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ తో పాటు మోటివేషనల్ క్లాస్, సాగర్ రోడ్డులో గల అంగన్ వాడీ కేంద్రంలో న్యూట్రిషన్ ఫుడ్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ సరిత కోటా , సెక్రటరీ మాధవి మామిడాల , పాల్గొనగా గురువారం రోజున మిర్యాలగూడ లోని విద్యానగర్ అంగన్ వాడీ కేంద్రంలో న్యూట్రిషన్ ఫుడ్ శ విజయ శ్రీ రామోజు పంపిణీ చేశారు

## చమురు నిల్వల కోసమే వెనిజుల అధ్యక్షుడిని బందించిన అమెరికా - సిపిఎం

- అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిరసిస్తూ సిపిఎం నిరసన

**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 08:**
వెనిజుల దేశం పై సామ్రాజ్యవాద అమెరికా ఆధిపత్యాన్ని ప్రజలంతా ముక్తకంఠంగా ఖండించాలని, సిపిఎం జిల్లా నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య అన్నారు. విడుదల అధ్యక్షుడు మధురో నీకోలాస్ అతని భార్యను అమెరికా దళాలు అక్రమంగా తమ దేశానికి తరలించి నిర్బంధించడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ సెంటర్ లో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనిజుల దేశంలో ఉన్న చమురు నిక్షేపాలపై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నాడన్నారు. అనేక దేశాలను ఆయుధ సంపత్తితో బెదిరిస్తూ యుద్ధలను సృష్టిస్తూ ప్రపంచాన్ని ఆశాంతికి గురి చేస్తున్నాడని అన్నారు. భారత సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా ట్రంప్ దెబ్బతీసేలా ట్రంప్ వ్యవహరిస్తుంటే విశ్వ గురు అని చెప్పుకుంటున్న మోడీ మౌనంగా ఉండడం సరికాదని అన్నారు. అమెరికా నిరంకుశ సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని భారత ప్రభుత్వం వ్యతిరేకించాలని లేకుంటే మన దేశానికి నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో



సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు కందుల హనుమంతు,కల్లూరి నగేష్,మండల కమిటి సభ్యులు గొరిగే సోములు,బావండ్లపల్లి బాలరాజు,నాగటి ఉపేందర్,నీల అయిలయ్య, వేముల సైదులు,ఆవనగంటి నగేష్,మేడి గణేష్,సర్పంచ్ గట్టు నర్సింహా,శాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, ఉప సర్పంచ్ పావిరాల మత్స్యగిరి,మెట్టు శ్రవణ్ కుమార్,పల్లె సత్యం,ఆవనగంటి స్వామి, వెంకటేష్, మోటే స్వామి తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో పద్మశాలి సంఘం 2026 కాలమానిని ఘన ఆవిష్కరణ



**జహీరాబాద్ వెలుతురు జనవరి 08:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన కాలమానిని స్థానిక పద్మశాలి భవన్ కార్యాలయంలో అట్టహాసంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్య నిపుణులు డా. పట్నం గిరి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బిక్షపతి హాజరై కాలమానిని ఆవిష్కరించారు. ఈ కాలమానిని తిథులు, పండుగలు, సంప్రదాయ ఉత్సవాలు, స్థానిక విశేషాలతో రమణీయంగా రూపొందించారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డా. గిరి మాట్లాడుతూ పద్మశాలి సంఘం ఐక్యంగా ఉండి సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. అలాగే వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బిక్షపతి మాట్లాడుతూ మెజారిటీ కుటుంబాలుగా ఉన్న పద్మశాలీయులు రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత ముందుకు రావాలని ఆకాంక్షంచారు. సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్ ముఖ్య అతిథులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రధాన కార్యదర్శి పద్మ రమేశ్, కోశాధికారి రంగా అరుణ్ పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమానికి కార్యనిర్వాహక సభ్యుడు ఎన్నం రఘు వందన సమర్పణ చేయగా,



ఉపాధ్యక్షులు కనుకుంట్ల నర్సిములు, పగిడిమర్రి రాములు, కొండా శివరాజ్, ముఖ్య సలహాదారులు దోమల పండరి, పండాలి ప్రభు, పెగడ శ్రీనివాస్, సగ్గం విజయ్, ఇంజమూరి మల్లేశం, దార మధు, అప్పం శ్రీకాంత్, సగ్గం శ్రీనివాస్, అప్పం శ్రీనివాస్, చిప్ప సత్యనారాయణ, కరదాస్ ప్రేమ్, గుంజిటి విజయ్, సగ్గం చంద్రశేఖర్, గడ్డం పాండులు తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

- పెద్ద శంకరంపేట్ ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 08 :**
మెదక్ జిల్లా :- చైనా మంజా విక్రయం, వినియోగం పూర్తిగా నిషేధించబడిన నేపథ్యంలో పెద్ద శంకరంపేట్ మండలంలో ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం షాపులపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గాలిపటాలు, విక్రయించే దుకాణాలతో పాటు ఇతర వాణిజ్య కేంద్రాలను పరిశీలించారు. నిషేధిత చైనా మంజాను విక్రయించినా లేదా నిల్వ ఉంచినట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలుతీసుకుంటామని ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి హెచ్చరించారు. చైనా మంజా వలన పక్షులు, జంతువులు, ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడే



ప్రమాదం ఉందని, ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ప్రభుత్వం దీనిపై పూర్తిస్థాయిలో నిషేధం విధించిందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి సడలింపులు ఉండవని స్పష్టం చేశారు.చైనా మంజా విక్రయాలపై ఎవరైనా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ తనకి లో పెద్ద శంకరంపేట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**జహీరాబాద్ వెలుతురు జనవరి 08 :**
రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న వయస్సు నుంచే రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసం సందర్భంగా గురువారం కోహిర్ మండలం దిగ్వాల్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షమ రెసిడెన్షియల్ పాఠశాల (౦+ూఔ=ా) లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోహిర్ ఎస్ఐ నరేష్ పాల్గొని మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు, నిర్లక్ష్య డ్రైవింగ్, అధిక వేగంతో నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకపోవడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని సూచించారు. డెక్కన్ టోల్ ప్లాజా సేఫ్టీ మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ, రోడ్డు మీద నడిచేటప్పుడు తీసుకో వాల్సిన జాగ్రత్తలు, పాదచారులు పాటించాల్సిన నియమాలు, జీబ్రా క్రాసింగ్ వినియోగం, రాత్రివేళల్లో రిఫ్లెక్టర్ల ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు నేర్చుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు తెలియ జేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, డెక్కన్ టోల్ ప్లాజా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కోహీర్‌లో మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

- వ్యక్తిగత ఖర్చుతో బోర్వెల్ పంప్ సెటు అందజేసిన సామాజిక కార్యకర్త మహ్మద్ ఫిర్దోస్



**జహీరాబాద్ వెళుతుతు జనవరి 08:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ పట్టణానికి చెందిన చురుకైన సామాజిక కార్యకర్త, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహ్మద్ ఫిర్దోస్ సర్వర్ మరోసారి తన సేవా దృక్పథన్ని చాటుకున్నారు. కోహీర్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెంబర్ఉ16లో గత రెండు నెలలుగా బోర్వెల్ పంప్ సెటు ఏర్పాటు కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో బాధిత కాలనీవాసులు మహ్మద్ ఫిర్దోస్‌ను ఆశ్రయించారు. సమస్యను తెలుసుకున్న వెంటనే ఆయన స్పందించి, ఎలాంటి ఆలస్యం లేకుండా తన స్వంత ఖర్చుతో నూతన బోర్వెల్ పంప్ సెటును కొనుగోలు చేసి, బాధిత కాలనీవాసులకు, ముఖ్యంగా యువతకు అందజేశారు. ఫిర్దోస్ చేసిన ఈ మానవతా సేవకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వగురు నినాదం కూలిపోయింది

**- ప్రపంచం మోదీ వైఫల్యాన్ని లెక్కపెడుతోంది..**



**హైదరాబాద్ వెలుతురు జనవరి 08:**
రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై 500 శాతం వరకు శిక్షత్మక టారిఫ్‌లు విధించే దిశగా అమెరికా ముందడుగు వేస్తున్న వేళ, భారత్ మళ్లీ అంతర్జాతీయ ఒత్తిడిలో చిక్కుకోవడం యాదృచ్ఛికం కాదు. ఇది ప్రధానమంత్రి చ్ఘుతీవఅనతీఖ వీశీఇఱ నేతృత్వంలో సాగిన అహంకారపూరిత, నినాదాల ఆధారిత విదేశాంగ విధానానికి వచ్చిన ప్రత్యక్ష పరిణామం. పదేళ్ల పాలన తర్వాత కూడా భారత్ ఈ స్థితిలో నిలబడాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యానికి స్పష్టమైన సాక్ష్యం. ఫోటో ఆప్స్, విదేశీ పర్యటనల హడావిడి, ఖాళీ ప్రసంగాలు తప్ప – సంస్థాగత దౌత్యం ఎక్కడ ఉంది? దీర్ఘకాలిక మైత్రి బంధాలు ఎక్కడ ఉన్నాయి? అంతర్జాతీయ సంక్షభాల్లో భారత్‌కు లభించిన రక్షణ ఏది? ప్రపంచం మారుతున్న వేళ, మోదీ ప్రభుత్వం దేశాన్ని మత రాజకీయాలు, సామాజిక ధ్రువీకరణ, దేశీయ ఓటు గణితంలో ముంచేసింది. దేశం లోపల రాజకీయ లాభాల కోసం విదేశాంగ విధానాన్ని తాకట్టు పెట్టిన ఈ ప్రమాదకర దారితప్పుదనం, నేడు భారత్‌ను అంతర్జాతీయ వేదికపై బలహీనంగా మార్చింది. 2016లో "అబ్ కీ బార్ ట్రంప్ సర్కారు అంటూ బహిరంగంగా ప్రచారం చేయడం, *Donald Trump*తో వ్యక్తిగత సాన్నిహిత్యమే భారత విదేశాంగానికి ఆధారం అన్న అహంకార భావనకు నిదర్శనం. కానీ ప్రభుత్వాలు మారతాయి, జాతీయ ప్రయోజనాలు శాశ్వతం – ఈ మౌలిక సత్యాన్ని మోదీ ప్రభుత్వం విస్మరించింది. ఈ రోజు ప్రపంచం ఒక స్పష్టమైన ప్రశ్న వేస్తోంది:

***– భారత విదేశాంగ విధానం ఎవరి కోసం?***

***– దేశ ప్రయోజనాల కోసంనా, లేక ఒక వ్యక్తి ఇమేజ్ కోసంనా?***

"విశ్వగురు" అనే స్వయంఘోషిత బిరుదు ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై భారత్‌ను రక్షంచలేకపోతోంది. నినాదాలు, ఆర్భాటాలు, వ్యక్తి పూజ ఇవేవీ విదేశాంగ సంక్షభాల్ని పరిష్కరించవు. పరిష్కారం ఇచ్చేది వ్యూహం, విశ్వసనీయత, స్థిరత్వం మాత్రమే. ఈ పరిస్థితికి బాధ్యత ఎవరిది అని దేశం తెలుసుకోవాలి. జవాబుదారీ తప్పించుకునే ప్రయత్నాలు ఇక పనిచేయవు. ప్రపంచ నాయకత్వం నినాదాలతో రాదు. అది పనితో సంపాదించాలి.

మోదీ ప్రభుత్వం అది చేయడంలో విఫలమైంది.

నేటి వాస్తవం ఇదే:

నినాదాల విదేశాంగం దేశాన్ని ప్రమాదంలోకి నెట్టింది.



**రేఖ బోయలపల్లి**
**తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షరాలు**

# మానసికంగా ,శారీరకంగా దృఢంగా ఉండేందుకు విద్యతోపాటు, క్రీడలు ముఖ్యం

**- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



**నల్గొండ వెలుతురు జనవరి 08:**
మానసికంగా ,శారీరకంగా దృఢంగా ఉండేందుకు విద్యతోపాటు, క్రీడలు ముఖ్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.గురువారం ఆయన నల్గొండ జిల్లా,చర్లపల్లి వద్ద ఉన్న విపస్య పాఠశాలలో నిర్వహించనున్న 2 రోజుల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మనిషి చురుకుగా ఉండడానికి క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నారు. కొన్ని పాఠశాలలు అధిక జీపీఏలు సాధించాలన్న లక్ష్యంతో విద్య పైన దృష్టి సారిస్తున్నాయని, క్రీడల పట్ల కూడా దృష్టి పెట్టాలని అన్నారు. అలాగే ప్రైవేటు విద్యా యాజమాన్యాలు పేద విద్యార్థుల కు ఎల్లవేళలా సహాయం అందించేలా చూడాలన్నారు. క్రీడల్లో గెలుపు ,ఓటములను సమానంగా స్వీకరించాలని, ఓడిన వారు బాధపడకూడదని మరోసారి పట్టుదలతో ఆడి గెలుపు సాధించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో భాగంగా ఒక్కొక్కటి 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని, నల్గొండ జిల్లా కేంద్రంలో ఎస్ఎల్బీసీ వద్ద నిర్మిస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల భవనం నిర్మాణంలో ఉందని తెలిపారు. తరగతి గదులు, డార్మెంటరీ ,డైనింగ్ ,కిచెన్, క్రికెట్ ఫుట్బాల్ స్టేడియంలతో ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగ్గా వీటిని నిర్మిస్తున్నామని, వచ్చే సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభం అవుతాయని మంత్రి తెలిపారు. పాఠశాల/కళాశాల వదిలిన వెంటనే ఉద్యోగం వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం వీటిని రూపొందిస్తున్నదని, ప్రతి విద్యార్థి జీవితంలో రాణించేలా చదువుకోవాలని కోరారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పాటవుతున్నందున భవిష్యత్ లో నల్గొండ ను స్మార్ట్ సిటీగా ఏర్పాటు చేస్థామని, ఆర్ అండ్ బి ద్వారా 200 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని, 700 కోట్ల రూపాయలతో పట్టణంలో భూగర్భ డ్రైనేజీ నిర్మిస్తున్నామని, నల్గొండను హైదరాబాద్ కు మోడల్ గా చేయాలనే సంకల్పంతో ఉన్నట్లు మంత్రి తెలిపారు .ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా 12 కోట్ల రూపాయలతో నల్గొండ పట్టణంలోని బొట్టుగూడ ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం జరిగిందని, త్వరలోనే ఈ పాఠశాల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో క్రీడలు చాలా అవసరమని, శారీరకంగా, మానసికంగా ఉండేందుకు క్రీడలు తోడ్పడతాయని అన్నారు. ప్రభుత్వం తరఫున విద్యార్థులకు అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నదని, ఓడిన, గెలిచినవారు క్రీడలను సమానంగా తీసుకోవాలన్నారు. నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ , డిటిసి వాణి, పాఠశాల యాజమాన్యం, తదితరులు ఉన్నారు.







# వీ బి- జి రామ్ జీ చట్టాన్ని బలోపేతం చేసిన కేంద్రాన్ని తప్పు పట్టడం సరికాదు...

బ్రిటీష్ జనతా పార్టీ అనడానికి రేవంత్ రెడ్డికి సిగ్గుండాలి. బిజెపి పేరులోనే భారతీయత ఉంది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ను స్థాపించింది. A.O.Hume - Allan Octavian Hume, a retired British civil servant, floated INC on 28 December, 1885. కాంగ్రెస్ అనే పదంలో భారతీయత లేదు. అది బ్రిటీషోళ్లు పెట్టిన పార్టీ. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాస్తా ఇపుడు ఇస్లామిక్ నేషనల్ కాంగ్రెస్ అయింది. సీఎం రేవంత్ రెడ్డినే స్వయంగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలోనే కాంగ్రెస్ అంటేనే ముస్లింలు ... ముస్లింలు అంటేనే కాంగ్రెస్ అంటూ మాట్లాడారు. అందుకే INC – ఇస్లామిక్ నేషనల్ కాంగ్రెస్ అని రేవంత్ రెడ్డినే కాంగ్రెస్ పేరు మార్చారు – భారత ఎన్నికల సంఘం (ఈసీ) ఓటర్ల జాబితాలో ప్రక్షాళన చేపడుతూ ప్రత్యేక సమగ్ర సమీక్ష(SIR Special Intensive Revision (SIR) కార్యక్రమాన్ని నిర్వహించడం దేశంలో నిత్యం జరిగే పక్రియే. దేశంలో ఇప్పుడే మొదటిసారిగా 'SIR' ప్రక్రియ చేపడుతున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదం. This is for only satisfying MIM Brother." ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ ఓట్ చోర్ అనే నినాదంతో హడావుడి చేసిన రాహుల్ గాంధీకి బిహార్ రాష్ట్ర ప్రజలు చెంప చెళ్లుమనిపించే తీర్పు ఇచ్చారు. అయినా కాంగ్రెస్ నేతలకు బుద్ధి రాలేదు. ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించిన ఇదే రాహుల్ గాంధీ ... ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు SIR ప్రక్రియను చేపడితే కూడా తప్పుపట్టారు. ఇది రాహుల్ గాంధీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. SIR ప్రక్రియ అమలుకు ముందు జరిగిన లోకసభ ఎన్నికల్లో బీహారులో బిజెపికి వచ్చిన ఓట్ల కంటే SIR' ప్రక్రియ అమలు తర్వాత వచ్చిన ఓట్లు స్వల్పంగా తగ్గాయి. అదే RJD కి స్వల్పంగా పెరిగాయి. ఎన్నికల ఫలితాల విశ్లేషణలు, ఓట్ షేర్ గణాంకాల లెక్కలన్నీ మీడియాలో వచ్చాయి. ఇన్ని రుజువులు ఉన్నా కాంగ్రెస్ నేతలు SIR ప్రక్రియపై అదే తప్పుడు ప్రచారం చేస్తున్నారు." SIR ప్రక్రియలో మరణించినవారివి, శాశ్వతంగా వలస వెళ్లినవారివి, డూప్లికేట్ కేటగిరీ వంటి కారణాలతోఓట్లు తొలగిస్తుంటే ప్రజలకు ఎలాంటి నష్టం కలుగుతోందో సీఎం రేవంత్ రెడ్డి వివరించాలి. SIR ప్రక్రియలో తొలగిస్తున్న ఓట్లు ఎవరివో సీఎం ప్రజలకు చెప్పాలి." SIR ప్రక్రియను వ్యతిరేకిస్తున్న రాహుల్ గాంధీకి దమ్ముంటే, ఈ SIR ప్రక్రియ అంశంపై ప్రజాతీర్పును కోరగలడా, తన రాయబరేలి ఎంపీ సీటుకు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లగలరా" వికసిత్ భారత్ లక్ష్యాల ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ –2047 విజన్ డాక్యుమెంట్ తెచ్చిందని అసెంబ్లీలో మంత్రులు చెప్పారు. అసెంబ్లీ బయట కూడా ఇదే చెప్పారు. మరిపుడు వికసిత్ భారత్ కాదు సంక్షోభ భారత్ అంటూ విమర్శించడం అర్థరహితం కాదా" SIR ప్రక్రియను "VB - G RAM G" చట్టాన్ని వ్యతిరేకిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఇదే అంశంపై తెలంగాణలో కాంగ్రెసుకున్న ఎనిమిది మంది లోకసభ ఎంపీలను రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని సవాల్ చేస్తున్నాం.



# ఖైజర్ యఫై గోల్డ్ కప్-4లో ఉత్కంఠభరిత పోటీలు

**- సెమీఫైనల్‌కు చేరిన జై సేవాలాల్ జహీరాబాద్....**

**- సూపర్ నాకౌట్‌లో నయీమ్ 11 (నిజామాబాద్ ) ఘన విజయం...**

**జహీరాబాద్ వెలుతురు జనవరి 08:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో గురువారం నాడు నిర్వహించిన ఖిజర్ యఫై గోల్డ్ కప్ – 4 క్రికెట్ పోటీలు క్రీడాభిమానులను ఉత్సాహపరిచాయి. ఈ టోర్నీని శేకపూర్ గ్రామ సర్పంచ్ మొహమ్మద్ చెష్మోద్దీన్, సీనియర్ నాయకుడు ఏం.జి. రాములు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. కులమతాలకు అతీతంగా క్రీడలను ప్రోత్సహిస్తూ, దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడంతో పాటు, స్థానిక యువతలో క్రికెట్‌పై మక్కువ పెంచేలా ఖిజర్ యఫై చూపుతున్న చొరవ అభినందనీయమని ముఖ్య అతిథులు ప్రశంసించారు. ఇలాంటి టోర్నీలు యువతను క్రీడల వైపు మళ్లించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని వారు అన్నారు.





**క్వార్టర్ ఫైనల్లో జై సేవాలాల్ జహీరాబాద్ ఉత్కంఠభరిత విజయం:**

టోర్నీలో భాగంగా జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో జై సేవాలాల్ జహీరాబాద్, మ్యాక్ క్రికెట్ క్లబ్ బళ్లారి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన మ్యాక్ బళ్లారి బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. 225 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జై సేవాలాల్ జట్టు దూకుడైన ఆటతో 18.2 ఓవర్లలో కేవలం 3 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసి ఘన విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో 68 పరుగులు చేసిన అభిమన్యు జాధవ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ అవార్డును ముఖ్య అతిథులు మొహమ్మద్ చెష్మోద్దీన్, ఏం.జి. రాములు చేతుల మీదుగా వెయ్యి రూపాయల నగదు బహుమతి మరియు ట్రోఫీతో ప్రదానం చేశారు.

**సూపర్ నాకౌట్ మ్యాచ్‌లో నయీమ్ 11 (ఛ్గీదీ) ఆధిపత్యం:**

మధ్యాహ్నం జరిగిన సూపర్ నాకౌట్ మ్యాచ్‌లో నయీమ్ 11 (నిజామాబాద్), రియునైటెడ్ సీడనీ సీసీ (జహీరాబాద్) జట్లు తలపడ్డాయి. ఈ పోరులో నయీమ్ 11 (నిజామాబాద్) జట్టు 97 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అద్భుతమైన 90 పరుగులు చేసిన ఆసిఫ్ ఖాన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు.

**విశేషంగా పాల్గొన్న ప్రముఖులు:**

ఈ కార్యక్రమంలో సర్పంచులు మోహన్ రాథోడ్, భీంరావు, ప్రేమ్ రాథోడ్, ఆహ్వాన కమిటీ చైర్మన్ రాములు నేత, మీడియా ఇంచార్జ్ మహేబూబ్ అలీ, అదం యఫై, అబుద్ యఫై, తహ యఫై, నిర్వాహకులు మాక్సూద్ అలీ, మొహమ్మద్ అలీ, రాంచరణ్, వ్యాఖ్యాతలు అబ్దుల్లా సిద్దిఖీ, జయచంద్ రాథోడ్, మొహమ్మద్ ఫెరోజ్, సయ్యద్ మహేబూబ్ అలీ, విజయ్ రాథోడ్, మొయిజ్ లష్కరి తదితరులు పాల్గొని టోర్నీని విజయవంతం చేశారు.

# నిరుద్యోగులపై దమనకాండ దారుణం

**- ఆందోళన చేస్తున్న వారిపై పోలీసుల దాష్టీకం**

**- జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేసిన రేవంత్**

**- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు**

**హైదరాబాద్,జనవరి8 వెలుతురు:**
నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లపై రేవంత్ సర్కారు సాగిస్తున్న దమన కాండపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. నిన్న దిల్‌సుఖ్‌నగర్, నేడు అశోక్ నగర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై పోలీసులు క్రూరంగా విరుచుకుపడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందు అశోక్ నగర్ లైబ్రరీ చుట్టూ చక్కర్లు కొట్టి పొర్లుదండాలు పెట్టి నిరుద్యోగులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్నారు. వారి ఉద్యోగ కాంక్షను ఆసరా చేసుకొని, వారిని కాంగ్రెస్ కార్యకర్తలుగా మార్చుకొని ఇంటింటికి తిప్పి ప్రచారానికి వాడుకుని.. అధికార పీఠం ఎక్కగానే అదే నిరుద్యోగ గొంతులపై ఉక్కు పాదం మోపి తొక్కుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. ఇవాళ తెలంగాణలో నిరంకుశత్వం రాజ్యమేలుతున్నది. పోలీసు రాజ్యం నడుస్తున్నది. ఓడ దాటే దాకా ఓడ మల్లన్న, ఓడ దాటినాక బోడ మల్లన్న అన్నట్లు ఇప్పుడు నిరుద్యోగులకు లాఠీ చార్జీలు, అరెస్టులు, సంకెళ్లను బహుమతిగా ఇస్తున్నారని హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేశారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేశారని మండిపడ్డారు. రెండేళ్లలో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నవు..నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నవు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవని సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రంథాలయాల్లో పోలీసులు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఈ రోజు గాయపడిన ప్రతి నిరుద్యోగికి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పి తీరాలి. దాడికి బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. నిర్బంధాలను ఆపి నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. నిరుద్యోగులను లాకప్ హింసకు గురిచేసినా, బెదిరింపులకు పాల్పడినా బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. అరెస్టు చేసిన నిరుద్యోగ సోదరులను భేషరతుగా తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.



# నిలకడగా సోనియాగాంధీ ఆరోగ్యం



**న్యూఢిల్లీ,జనవరి8 వెలుతురు:**
కాంగ్రెస్ పార్టీ ఛైర్‌పర్సన్, సీనియర్ నేత సోనియాగాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని సర్ గంగారామ్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ అజరు స్వరూప్ గురువారం వెల్లడించారు. సోనియాగాంధీ ఢిల్లీలో గాలికాలుష్యం వల్ల శ్వాసకోశ సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం సోమవారం రాత్రి సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె చికిత్సకు స్పందిస్తున్నారని, కోలుకుంటున్నారని అజరు స్వరూప్ ఆమె ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని వెల్లడించారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ దూకుడు

**- మాజీ ఎమ్మెల్యే జైపల్ యాదవ్ విచారణ**

**హైదరాబాద్,జనవరి 8( వెలుతురు):**
తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు మరింత ఊపందుకుంది. ఫోన్లు ట్యాప్ చేసిన ఆరోపణలపై సిట్ దూకుడుగా విచారణ చేపడుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన సిట్.. వారిని విచారిస్తోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ గురువారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. గతేడాది నవంబర్ 17న కూడా ఆయన సిట్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి నోటీసు అందడంతో జైపాల్ యాదవ్ విచారణకు రాగా.. సిట్ అధికారులు ఈ కేసుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఈ కేసులో నిందితుడైన అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, జైపాల్ యాదవ్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్లు సిట్ గుర్తించింది. దర్యాప్తులో భాగంగా.. ఒక కేసులో భార్యాభర్తల మధ్య తలెత్తిన సమస్యపై తిరుపతన్నతో మాట్లాడినట్లు జైపాల్ యాదవ్ వాంగ్మూలం ఇచ్చారు. అయితే సిట్ అధికారులు ఎన్నికల సమయంలో జరిగిన ఈ కాల్స్, సంభాషణలపై లోతుగా విచారించారు. జైపాల్ యాదవ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసినట్లు సమాచారం.అలాగే ఈ కేసులో మరో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యనూ సిట్ విచారించనుంది. ఇటీవల సిట్ జారీ చేసిన నోటీసుల్లో భాగంగా ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతోపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి కూడా విచారణకు హాజరు కానున్నారు. బీఆర్ఎస్ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు దర్యాప్తులో తేలడంతో ఆయనను సాక్షిగా పిలిచినట్లు తెలుస్తోంది.

# అవినీతి కేసుల్లో సుప్రీంకోర్టు కీలక తీర్పు

**- హైకోర్టు ఇచ్చిన తీర్పు రద్దు**

**న్యూఢిల్లీ,జనవరి 8( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్‌లో 2016-2020 మధ్య కాలంలో ప్రభుత్వ ఉద్యోగులపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల అవినీతి కేసుల్లో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన 13 ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఏపీ విభజన తర్వాత విజయవాడలోని ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను ప్రత్యేక పోలీస్ స్టేషన్‌గా అధికారికంగా నోట్గి÷ చేయలేదన్న టెక్నికల్ కారణంతో హైకోర్టు ఆ ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన కేసులో హైకోర్టు ఆదేశాన్ని సుప్రీంకోర్టు రద్దు చేస్తూ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. కేసులో ఆంధప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, సిద్దార్థ్ అగర్వాల్ వాదనలు వినిపించారు. ఇలాంటి టెక్నికల్ కారణాలతో దేశవ్యాప్తంగా అనేక అవినీతి కేసులు హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ తీర్పు మైలురాయిగా నిలుస్తుంది.

# రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

**- మరోమారు రేంవత్‌పై కెటిఆర్ ధ్వజం**



**హైదరాబాద్,జనవరి 8( వెలుతురు):**
కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో శేరిలింగపల్లి నియోకవర్గానికి చెందిన పలువురు నాయకులు వివిధ పార్టీల నుంచి వచ్చి బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి స్వయంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సర్కారు ప్రజలను మోసం చేసిందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామీని కూడా ఈ రేవంత్ సర్కారు నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడి పోయినయని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి ఇయ్యకుండా నిరుద్యోగులను మోసం చేసింద్రని ఆరోపించారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు విద్యార్థులు రోడ్లపైకి వస్తున్నారని కేటీఆర్ చెప్పారు. నిన్న దిల్‌సుఖ్‌నగర్‌లో, ఇవాళ అశోక్‌నగర్‌లో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని అన్నారు. జాబ్ నోటిఫికేషన్‌లు ఎక్కడ రాహుల్‌గాంధీ అని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సెమ్గీ÷నైల్ లాంటివని, ఈ ఎన్నికల్లో చాకుల్లాంటి కుర్రోళ్లను అభ్యర్థులుగా నిలబెడుతామని, గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

# చైనా మాంజాపై పోలీసుల ఉక్కుపాదం

**- పెద్ద ఎత్తున నిల్వలు స్వాధీనం**

**హైదరాబాద్,జనవరి 8( వెలుతురు):**
మనుషులకు, పక్షులకు, పర్యావరణానికి హాని కలిగిస్తున్న చైనా మాంజా పై హైదరాబాద్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్న రూ.1.24 కోట్ల విలువైన నిషేధిత చైనా మాంజాను పట్టుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ గురువారం పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకునే సమయంలో కొందరు చర్యల వల్ల ప్రాణాలు హరిస్తున్నాయని అన్నారు. చైనా మాంజాపై నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ కొందరు గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారని, నగరంలో ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా, గోదాముల్లో నిల్వ చేసినా, అక్రమ రవాణాకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పోలీసులు చేపట్టిన తనిఖీల వల్ల వ్యాపారులు ఆన్‌లైన్ బాట పట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఈ-కామర్స్ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికగా సాగే క్రయవిక్రయాలపై 24 గంటల పాటు ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఎ÷-లాస్టిక్, గాజు పెంకులు, మెటాలిక్ కోటింగ్ ఉండే ఈ మాంజా వల్ల పిల్లలకు విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి సంప్రదాయ నూలు దారాలనే ప్రోత్సహించాలని కోరారు. ఎవరైనా మాంజా విక్రయిస్తే 'డయల్ 100' లేదా వాట్సాప్ నెంబర్ 94906 16555 కి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నగరవ్యాప్తంగా అన్ని జోన్లలో నిర్వహించిన దాడులలో ఇప్పటివరకు మొత్తం 103 కేసులు నమోదు కాగా, 143 మంది నిందితులను అరెస్టు చేశామని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ సీపీ ఎం. శ్రీనివాసులు, డీసీపీలు కారె కిరణ్ ప్రభాకర్, జి. చంద్రమోహన్, , గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ రావు అధికారులు పాల్గొన్నారు.

# భారత ఇంధన వారోత్సవం- 2026

**- ఈ యేడు అంతర్జాతీయ ఇంధన కార్యాచరణకు నిర్దేశం**

**- ఇంధన భద్రత, పరివర్తనను ముందుకు తీసుకెళ్లేలా...**

**- 75,000 కి పైగా నిపుణులు, కీలక ఇంధన ఆర్థిక వ్యవస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు, సీఈవోలు, ఆవిష్కర్తల సమావేశం**





**వెలుతురు హైదరాబాద్/విజయవాడ, 2026 జనవరి 8:**
గోవా వేదికగా జనవరి 27 నుంచి 30 వరకు భారత ఇంధన వారోత్సవం (ఐఈడబ్ల్యూ) - 2026 జరగబోతోంది. 120కి పైగా దేశాల నుంచి దాదాపు 75,000 మంది ఇంధన రంగ నిపుణులు, 700కు పైగా ప్రదర్శన కంపెనీలు, 6,500 మందికి పైగా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సంవత్సరంలో మొదటి ప్రధాన అంతర్జాతీయ ఇంధన సమావేశం ఇది. విధాన నిర్ణయాలు, మార్కెట్లు, సాంకేతికత, పెట్టుబడుల్లో భాగస్వామ్యం కోసం ఓ సమగ్ర వేదికగా ఈ వారోత్సవం నిలుస్తుంది. తద్వారా ఇంధనపరంగా ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను అందించడంతోపాటు సుస్థిర భవిత దిశగా ఆచరణీయ మార్గాలను అన్వేషిస్తుంది. భారీ స్థాయి ప్రదర్శన, ఉన్నత స్థాయి సదస్సు, ప్రపంచ దేశాల నేతల భాగస్వామ్యం, ప్రత్యేక ఇతివృత్తాలతో ప్రదర్శనలతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. విధానాలను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చడమే లక్ష్యంగా ఈ వారోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించబోతోంది.

ప్రదర్శన:
సాంకేతికత, మార్కెట్లు, పెట్టుబడుల అనుసంధానం
భారత ఇంధన వారోత్సవం- 2026లో అత్యంత ముఖ్యమైన అంశం ఈ ప్రదర్శన. ఇంధన రంగ కార్యకలాపాల్లోని ప్రతి దశకూ చెందిన 700కు పైగా దేశీయ, అంతర్జాతీయ కంపెనీలను ఈ ప్రదర్శన ఒక్కచోట చేరుస్తుంది. హైడ్రోకార్బన్లు, పునరుత్పాదక ఇంధనాలు, హైడ్రోజన్, జీవ ఇంధనాలు, ఎల్ఎన్‌జీ, పెట్రోకెమికల్స్, డిజిటలైజేషన్, తదుపరి తరం ఇంధన వ్యవస్థలకు సంబంధించి అత్యాధునిక సాంకేతికతలు, మార్గాలకు అంతర్జాతీయ వేదికగా ఈ ప్రదర్శన నిలవనుంది. పారిశ్రామిక దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, పెట్టుబడిదారులు, తుది వినియోగదారుల మధ్య నేరుగా అనుసంధానానికి అవకాశం కల్పించడం ద్వారా.. నూతన భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలోనూ, వాణిజ్యపరమైన ఫలితాలను వేగవంతం చేయడంలోనూ ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషించనుంది. పెట్టుబడులతో ఇంధన రంగంలో పరివర్తనకూ ఉపయోగపడుతుంది.

***సదస్సు:***
అంతర్జాతీయ వ్యూహ రచన నుంచి క్షేత్ర స్థాయిలో అమలు వరకు...
ప్రదర్శనకు అనుబంధంగా భారత ఇంధన వారోత్సవం-2026లో సదస్సును నిర్వహిస్తున్నారు. వారం పాటు జరిగే వ్యూహాత్మక, సాంకేతిక చర్చలకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుంది. విధానపరమైన లక్ష్యలకూ, వాటి వాస్తవిక అమలుకూ మధ్య సమన్వయమే దీని లక్ష్యం.
వ్యూహాత్మక సదస్సు 65కు పైగా ఉన్నత స్థాయి సెషన్ల ద్వారా 300 మందికి పైగా సీనియర్ వక్తలను ఒకచోట చేర్చనుంది. ఇందులో మంత్రులు, విధాన నిర్ణేతలు, సీఈఓలు, వివిధ సంస్థల అధినేతలు పాల్గొని.. ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థ బలోపేతం, పెట్టుబడుల సమీకరణ, విద్యుదీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం వంటి ప్రధానమైన అంశాలపై చర్చిస్తారు.
సాంకేతిక సదస్సు ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లనుంది. 45కు పైగా ప్రత్యేక సెషన్లలో 250 మందికి పైగా నిపుణులు ప్రసంగిస్తారు. ఇంధన పరివర్తన ప్రక్రియను వేగవంతం చేస్తున్న నవ సాంకేతికతలు, వినూత్న మార్గాలు, అత్యుత్తమ పద్ధతులపై లోతైన విశ్లేషణలను వీరు అందిస్తారు.
విలక్షణమైన అంతర్జాతీయ నాయకత్వం, ఇంధన దౌత్యం
ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ప్రభుత్వాల సీనియర్ మంత్రులు, అంతర్జాతీయ సంస్థల అధిపతులు, ప్రముఖ అంతర్జాతీయ ఇంధన కంపెనీల సీఈవోల భాగస్వామ్యం.. భారత ఇంధన వారోత్సవం- 2026లోని ముఖ్యమైన అంశం. అమెరికా, ఐరోపా, మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా, ఆసియా-పసిఫిక్ ప్రాంతాల నుంచి ప్రతినిధుల భాగస్వామ్యంతో.. అంతర్జాతీయ ఇంధన దౌత్యానికీ, అగ్రశ్రేణి నాయకత్వ స్థాయి చర్చలకు కీలక వేదికగా 'భారత ఇంధన వారోత్సవం- 2026' స్థానం మరింత సుస్థిరం కాబోతోంది.

***ప్రత్యేక ఇతివృత్తాలు:***
ఇంధన భవిత దిశగా నిర్దేశిత మార్గాలు 11 ప్రత్యేక ఇతివృత్తాలతో కూడిన జోన్లుగా ఈ ప్రదర్శనను విభజించారు. అంతర్జాతీయ ఇంధన వ్యవస్థకు కీలక ప్రాతిపదికలైన ఒక్కో అంశాన్నీ ప్రతిబింబించేలా వీటిని తీర్చిదిద్దారు. అణు శక్తి, పర్యావరణ హిత విమానయాన ఇంధనం, హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధనం, జీవ ఇంధనాలు, ఎల్ఎన్‌జీ, పెట్రోకెమికల్స్, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్, డిజిటలీకరణ - ఏఐ, మేకిన్ ఇండియా - ఉద్గార రాహిత్యం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యంతో రూపొందించిన ఈ జోన్లు.. సాంకేతిక ప్రదర్శనలకు, నూతన భాగస్వామ్యాల ఏర్పాటుకు, కొత్త మార్గాలను అన్వేషించేలా చర్చలకు అనువైన వాతావరణాన్ని నెలకొల్పుతాయి.
సహకారం కోసం అంతర్జాతీయ అనుసంధానమున్న వేదిక
కేంద్ర పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ సౌజన్యంతో.. భారత పెట్రోలియం పరిశ్రమల సమాఖ్య (ఎఫ్ఐపీఐ), డీఎంజీ ఈవెంట్స్ సంయుక్తంగా 'భారత ఇంధన వారోత్సవం-2026'ను నిర్వహిస్తున్నాయి. ఇంధన భద్రత, అందుబాటు ధరలు, సుస్థిరత వంటి అంశాల్లో పురోగతి దిశగా.. అంతర్జాతీయ స్థాయి అనుసంధాన వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుంది. ఇంధన రంగానికి చెందిన అన్ని వర్గాల ప్రతినిధులను ఒక్కచోట చేర్చడం ద్వారా.. ఈ ఏడాదికి అంతర్జాతీయ ఇంధన కార్యాచరణను తీర్చిదిద్దడంలో 'భారత ఇంధన వారోత్సవం- 2026' కీలకపాత్ర పోషించబోతోంది.
మరింత సమాచారం కోసం చూడండి: https://www.indiaenergy-week.com/

# ఉపాధి పేరు మార్పుపై ఆందోళనలు

**- ఏఐసిసి పిలుపు మేరకు రాష్ట్రంలో నిరసనలు**

**- కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి**

**హైదరాబాద్,జనవరి 8( వెలుతురు):**
ఏఐసీసీ సూచన మేరకు జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకిస్తూ నిరసనలు ఉధృతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత 20 నుంచి 30వ తేదీల్లో అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. నరేగా చట్టం గొప్పతనం వివరిస్తూ ప్రతి నియోజకవర్గానికి ఐదు వేల చొప్పున కరపత్రాలు పంపిణీ చేయాలని మార్గనిర్దేశర చేశారు. ప్రతి కరపత్రం గ్రామాలు, వాడవాడకూ చేరాలని సూచించారు. విదేశాల్లో ఉన్న వ్యక్తులు కూడా ఉపాధి హామీ పథకం గురించి ఆరా తీశారని పేర్కొన్నారు. ఈ పథకం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారని చెప్పుకొచ్చారు.జీ రామ్ జీ చట్టంతో పేదల హక్కు కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తూ డీసీసీలు గ్రామసభలు నిర్వహించి తీరాల్సిందేనని హుకుం జారీ చేశారు. జీ రామ్ జీ చట్టంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆయా జిల్లాల్లో బహిరంగ



సభల్లో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీసీసీ పదవి బాధ్యతగలదని.. అన్ని కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించాలని మహేశ్ కుమార్ గౌడ్ దిశానిర్దేశర చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా గ్రామ సభలు ఏర్పాటు చేద్దామని సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో పీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. వందేమాతరం గీతంతో ఈ సమావేశం మొదలైంది. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీ రామ్ జీ చట్టంపై చర్చించారు. అలాగే టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం అజెండా రూపొందించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను నిరసిస్తూ తీర్మానం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని వెనక్కు తీసుకుని.. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 25వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలను చేపట్టాలని మార్గనిర్దేశర చేశారు.

# సిపిఐ వందేళ్ల ప్రస్థానంపై ఖమ్మంలో సభలు

**- 18న ఖమ్మంలో భారీ ర్యాలీకి సన్నాహాలు**

**- 19, 20, 21 తేదీల్లో జాతీయ కౌన్సిల్ సమావేశం**

**- సిపిఐ జాతీయ నాయకులు హాజరు**

**- సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ వెల్లడి**

**ఖమ్మం,జనవరి8( వెలుతురు):**
సిపిఐ వందేళ్ల ప్రస్థానం పురస్కరించుకుని ఖమ్మం నగరంలో ఈ నెల 18వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. సీపీఐ జాతీయ నాయకులంతా ఈ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. 18వ తేదీన నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సంఘీభావంగా ఈ ర్యాలీలో పాల్గొంటారని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లాలో రామకృష్ణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌కు వెళ్లారు. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ..సీపీఐ ఆవిర్భావం నుంచి పోరాటాల పంథా కొనసాగించిందని తెలిపారు. పేదలు, కార్మికుల హక్కుల కోసం ఎంతోమంది జైలుకు వెళ్లారని అన్నారు. దేశం కోసం సీపీఐ ఎన్నో త్యాగాలు చేసిందని ప్రస్తావించారు. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పోరాటాల గడ్డ ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఖమ్మంలో జాతీయ కౌన్సిల్ సమావేశం ఉంటుందని తెలిపారు. 20వ తేదీ వామపక్ష పార్టీల జాతీయ నాయకులు ఆహ్వానించి సెమినార్ ఏర్పాటు చేశామని అన్నారు. 18వ తేదీ నుంచి



21వ తేదీ వరకు జరిగే ఈ సెమినార్‌కు ఎనలేని ప్రాధాన్యత ఉందని వివరించారు. ఈ సెమినార్‌లో వామపక్ష పార్టీలు పాల్గొంటాయని వెల్లడించారు. వామపక్ష పార్టీలు దేశంలో ఇతర పార్టీలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు రామకృష్ణ. ప్రపంచాన్ని బెదిరించాలనే దుస్సాహసానికి ట్రంప్ పాల్పడ్డారని ,ఇంత జరుగుతున్నా.. ప్రధాని నరేంద్రమోదీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తనను సంతృప్తిపరచాల్సిన బాధ్యత మోదీపై ఉందని డొనాల్డ్ ట్రంప్ ఇటీవల అన్నారని ప్రస్తావించారు. ఒకప్పుడు ప్రపంచ దేశాలకు నాయకత్వం ఇచ్చిన ఇండియా.. ఇప్పుడు మాట్లాడలేని పరిస్థితికి ఎందుకు దిగజారిందని నిలదీశారు. మోదీ పాలనలో ప్రపంచ దేశాల్లో భారతదేశానికి విలువ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ పిచ్చోడి చేతిలో రాయిలాగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక దేశ అధ్యక్షుడి ఇంటిపై దాడి చేసి కిడ్నాప్ చేసే నీచ స్థితికి ట్రంప్ దిగజారారని షాకింగ్ కామెంట్స్ చేశారు. పోలవరం ముంపు ప్రాంతాల మండలాల్లో ఈరోజు(గురువారం) సమావేశం ఉందని రామకృష్ణ తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి 2027 మార్చి నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అందిస్తామని అంటున్నారని అన్నారు. పోలవరం పూర్తిచేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పోలవరం ఏర్పాటుకు త్యాగాలు చేసిన భూ నిర్వాసితుల పరిస్థితి గురించి మాట్లాడటం లేదని అన్నారు. ఆగస్టు నెల వస్తే ఆ మండలాల్లోనే గ్రామాలు మునిగిపోతున్నాయని చెప్పుకొచ్చారు. 135 అడుగుల వరకు మాత్రమే సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం ముంపు బాధితులను గాలికి వదిలేశారని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందని అన్నారు. మావోయిస్టుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆపరేషన్ కగార్‌ను సీపీఐ పార్టీ ఖండిస్తోందని తెలిపారు. తక్షణమే నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరారు. మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ కూడా బూటకమేనని, పట్టుకొచ్చి కాల్చి చంపారని ఆరోపణలు చేశారు. ప్రశ్నించే వాళ్లని అర్బన్ నక్సల్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని రామకృష్ణ విమర్శించారు.

# 20న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్

**హైదరాబాద్, జనవరి8( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. గతేడాది డిసెంబర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ).. ఇప్పుడు పట్టణ పోరుపై దృష్టి సారించింది. జనవరి 20వ తేదీ నాటికి రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో.. దానికి సంబంధించి ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ జనవరి 12 అని తెలిపారు. అదే రోజున ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని మొదట ఆదేశించారు. టీ పోల్ యాప్‌లో, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను జనవరి 13వ తేదీన అప్‌లోడ్ చేయాలి. జనవరి 16వ తేదీన ఫోటోలతో కూడిన ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నారు. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను కూడా ఆరోజే వెల్లడిస్తారు. ఇక జనవరి 20వ తేదీన మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.2019 నాటి ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని.. బీఎల్‌వోల ద్వారా క్షేత్రస్థాయిలో వివరాల పరిశీలన జరుగుతోంది. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేయాలని కలెక్టర్లను ఈసీ ఆదేశించింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయడానికి ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ అయ్యాయి. గురువారం రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించి, వారి సూచనలను తీసుకోనుంది.తుది ఓటర్ల జాబితాను ఆయా వార్డు పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దీనివల్ల ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం, బూత్ వివరాలు తెలుస్తాయని ఈసీ వెల్లడించింది. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలపైనా కలెక్టర్లకు ఈసీ దిశానిర్దేశం చేసింది. బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించి.. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని ఎన్నికల కమిషన్ సూచించింది.




## గెలుపు గుర్రాలపై గురి

మున్సిపల్ ఎన్నికలపై అధికార పార్టీ ప్రత్యేక గురి పెట్టింది. పంచాయతీ ఎన్నికలలో వచ్చిన ఫలితాలను మున్సిపల్ ఎన్నికల్లో పునరావృతం కాకుండా అధికార పార్టీ ఆచితూచి అడుగులు వేస్తుంది.మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని స్థానాల ' పైచేయి' సాధించేలా క్షేత్రస్థాయి కసరత్తులు ముమ్మరం చేసింది. ఇప్పటికే పార్టీ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా మున్సిపాలిటీ వారిగా సర్వే చేయించి పార్టీ బలాలు, బలహీనతలు పై దృష్టి సారించింది.సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం పీసీసీ చీఫ్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించి...జిల్లా ఇన్చార్జి మంత్రులతో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యేలు పార్టీ ఇంచార్జిల కు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా లో ఉన్న మున్సిపాలిటీలో అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకునేలా ఎత్తుగడలు వేయాలని ఎక్కడ కూడా ప్రతిపక్ష పార్టీకి అవకాశం ఇవ్వొద్దు అంటూ అంతర్గతంగా నేతలకు దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీ ఎన్నికల పై ప్రధాన రాజకీయ పార్టీలు సైతం కసరత్తు ముమ్మరం చేశాయి.మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. అసంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చతికిలపడినప్పటికీ స్థానిక పోరు బూలో బీఆర్ఎస్, బీజేపీ లు అనూహ్యంగా పుంజుకోవడం తో ఆ పార్టీ శ్రేణుల్లో కొంత ఆత్మస్థైర్యం నింపినట్ల య్యింది. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు బిఆర్ఎస్, బిజెపి పార్టీ లు సైతం ఎన్నికల కు సై అంటుంది. దీంతో ఆయా పార్టీ లు గెలుపు కోసం వ్యూహరచన చేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 15 మున్సిపాలిటీలు మూడు కార్పొరేషన్లు ఉండగా అందులో ఎనిమిది మున్సిపాలిటీలు మూడు కార్పొరేషన్లను ఇటీవల ప్రభుత్వం జిహెచ్ఎంసిలో విలీనం చేసింది. ప్రస్తుతం ఆమనగల్, షాద్నగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్పల్లి మున్సిపాలిటీ ఎన్నికలకు అధికారులు సన్నాహాలు చేస్తుండగా కొత్తూరు మున్సిపాలిటీ కి పాలకవర్గం గడువు తీరకపోవడం తో అక్కడ ఎన్నికలు మరింత సమయం పడుతుంది. మిగతా ఆరు మున్సిపల్ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల ను గెలుచుకొంది. రాష్టంలో అధికారం కోల్పోయి మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మళ్ళీ పురఎన్నికలో పట్టు నిలుపుకునేలా ఎత్తుగడలు వేస్తుంది. నియోజకవర్గాలో సన్నాహక సమావేశాలు నిర్వహించి పార్టీ నేతల్లో ఉత్సాహం నింపుతుంది. మున్సిపాలిటీ,వార్డుల వారిగా బస్తి బాట పేరుతో ప్రచారానికి సైతం దిగింది. వార్డుల వారిగా రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులను గెలుపు గుర్రాలను అధికారపాటికి దీటుగా నిలబెట్టేలా వ్యూహాలు సిద్ధం చేసే పనులు పార్టీ నేతలు నిమగ్నంగా అయ్యారు.పురపాలికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేలా వ్యూహాలకు పదును పెడుతోంది. ఈ మేరకు ఇప్పటికే రంగారెడ్డి జిల్లా లో ఆరు మున్సిపల్ పరిధిలో ఆయా పార్టీ అధ్యక్షులు ఇప్పటికే సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయా డివిజన్ల వారీగా పార్టీ పరిస్థితి, గెలుపు గుర్రాలపై కీలక నేతలతో చర్చిం చారు. గెలవడానికి ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని.. పార్టీ అభ్యున్నతే లక్ష్యంగా ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ కు దీటుగా అభ్యర్థులను రంగంలోకి దించేలా క్షేత్రస్థాయిలో గెలుపు గుర్రాలను జల్లెడ పట్టే బాధ్యతలను పలువురికి అప్పగించినట్లు సమాచారం.స్థానిక పోరు లో విజయం సాధించినా కానీ కాంగ్రెస్ లో కొంత అసంతృప్తి నెలకొంది. మెజార్టీ స్థానాలు సాధించలేకపోయామని నేతలు బహిరంగంగానే తమ లోపాలను బయట పెట్టుకున్నారు. సమన్వయంతో పార్టీలో ముందుకు వెళ్ళలేదని పంచాయతీలో వచ్చిన ఫలితాలను చూసి తమ తప్పులను ఒప్పుకుంటున్నారు. పంచాయతీ లో బీఆర్ఎస్ పుంజు కోవడం తో కాంగ్రెస్ నేతలను కొంత ఇరకాటంలో పడేసినట్లయ్యింది.స్థానిక పోరు లో బీఆర్ఎస్, బీజేపీ మద్దతుదారులు గెలవడా నికి ప్రధాన కారణం స్వపక్షంలోని రెబల్స్ అభ్యర్థులేనని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించింది. సీఎం సైతం జిల్లా, నియోజకవర్గా ల వారిగా ఫలితాలను చూసి కొంత అసంతృప్తి వెళ్ళగక్కారు. నియోజకవర్గం ఫలితాలను చూసి అందుకు బాధ్యులపై చీవాట్లు పెట్టారు. ఈ నేపథ్యంలో పురపాలక పోరులో రెబల్స్ ప్రభావం లేకుండా ఆ పార్టీ ముఖ్య నేతలు ఆచితూచి వ్యవహరిస్తు న్నారు. ఇందులో భాగంగా ఆయా డివిజన్లు / వార్డుల వారీగా ఆశా వహులు,కౌన్సిలర్ అభ్య ర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరి స్తోంది. ప్రస్తుతం వ్యక్తిగత సమాచారం తో పాటు ఆయా వార్డుల్లో బలా బలాలు, సామాజిక వర్గాల వారిగా ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా అభ్యర్థులను ఖరారు ఖరారు చేసే పనులు ప్రస్తుతం నేతలు నిమగ్నం అయ్యాయి.

# ఇంకా మండుతూనే ఉన్న బ్లో ఔట్

**- అదుపులోకి రాని మంటలు**



**కోనసీమ, జనవరి8( వెలుతురు):**
ఇరుసుమండ వద్ద ఓఎన్‌జీసీ బావిలోసంభవించిన బ్లోఅవుట్ ఇంకా అదుపులోకి రాలేదు. వరుసగా నాలుగో రోజూ అగ్నికీలలు ఎగసిపడుతూనే ఉన్నాయి. ఈ నెల 5న బ్లోఅవుట్ జరిగినప్పుడు భారీ మంటలు రాగా.. ప్రస్తుతం ఉద్ధృతి తగ్గింది. ప్రమాద స్థలానికి 10 మీటర్ల దగ్గరకు వెళ్లి సిబ్బంది నియంత్రణ చర్యలు చేపడుతున్నారన్నారు. మంటల్ని అదుపు చేసేందుకు నీటిని విరజిమ్మే పక్రియ నిరంతరం కొనసాగుతోంది. మంటలు పూర్తిగా ఆర్పేందుకు మరికొన్ని రోజుల సమయం పట్టే అవకాశం ఉంది.

# అమరావతిపై జగన్ అసత్య ప్రచారాలు

**- రివర్‌కు, రివర్ బెడ్‌కు తేడా తెలియకుండా వ్యాఖ్యలు**

**- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి నారాయణ**




**అమరావతి, జనవరి8( వెలుతురు):**
జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా రాజధాని అమరావతి నిర్మాణం ఆగదని పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. అమరావతిపై అవగాహన లేకుండా జగన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజధాని అమరావతిపై జగన్ చేసిన ఆరోపణలను మంత్రి నారాయణ ఖండించారు.నదీ గర్భంలో నిర్మాణాలు చేస్తున్నామని అసత్య ప్రచారం చేస్తున్నారు. కోర్టుల్లో కేసులు వేయిస్తున్నారు. అక్కడ ఎలాంటి పరిస్థితుల్లో కూడా నిర్మాణాలు జరగవు. నేతలు పూర్తిగా అవగాహన చేసుకుని మాట్లాడాలని సూచించారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌ను జగన్ అర్థం చేసుకుని స్పందించాలి. మిడి మిడి జ్ఞానంతో మాట్లాడం తప్పన్నారు. రివర్‌బెడ్, రివర్ బేసిన్‌కు తేడా తెలుసుకోవాలి. వాస్తవాలు తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడం తగదుని మంత్రి హితవు పలికారు. రెండో విడత భూ సమీకరణకు రైతులు ముందుకు వస్తున్నారు. గంటల వ్యవధిలో వందల ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చారు. ఇది చూసి ఓర్వలేకే జగన్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. అమరావతి ముందుకెళ్లిపోతోందన్న అసూయతోనే అవాస్తవాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇలాగే వ్యవహరిస్తే.. ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడితే జగన్‌కు ప్రస్తుతం ఉన్న 11 సీట్లు సున్నాకు చేరుకుంటాయని హెచ్చరించారు. ఏ రాష్ట్రానికైనా ఒక రాజధాని ఉంటుంది. ప్రతి జిల్లాకు హెడ్ క్వార్టర్, కలెక్టర్ కార్యాలయం ఉంటాయి. రాజధానిలో మంత్రులు, కార్యదర్శులు, అధికారులు అందరూ ఉండి.. ప్రజల సమస్యలను పరిష్కరిస్తారు. వచ్చే ఏడాదిన్నరలో రాజధానిలో ట్రంక్ రోడ్లు పూర్తి చేస్తాం. రెండున్నరేళ్లలో లేఔట్ రోడ్లు పూర్తి చేస్తాం. మూడేళ్లలో ఐకానిక్ భవంతుల నిర్మాణం పూర్తవుతుందని నారాయణ తెలిపారు.

# డ్వాక్రా బజార్‌లో హల్వా రుచి చూసిన బాబు

**గుంటూరు, జనవరి8( వెలుతురు):**



గుంటూరు నగర శివారులో సరస్ ప్రదర్శన – అఖిల భారత డ్వాక్రా బజార్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం పరిశీలించారు. ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం స్వయంగా పరిశీలించారు. ఒక స్టాల్‌లో ఏర్పాటు చేసిన మాడుగుల హల్వా రుచి చూసి.. టేస్ట్ బాగుందని నిర్వాహకులను అభినందించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను సీఎం ఆసక్తిగా తిలకించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే మాధవి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులను వెంటనే ఆసుపత్రికి తరలించాలి

**-జిల్లా ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్**

**-మంథనిలో విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించిన రవాణా శాఖ**

**మంథని జనవరి8( వెలుతురు):**
ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే ప్రజలు వీడియోలు తీయకుండా గాయపడ్డ బాధితులను వెంటనే ఆసుపత్రికి తరలిస్తే వారు బ్రతికే అవకాశం మెండుగా ఉంటుందని జిల్లా ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు జనవరి 2026లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం, రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాల నివారణకై మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో,మండలంలోని ఎగ్లాస్పూర్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత పై అవగాహన సదస్సులను జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రమాదాల నివారణపై ట్రాఫిక్ రూల్స్ పై విద్యార్థిని విద్యార్థులకు ప్రమాదాలు జరగకుండా ఎలా ఉండాలనే అంశంపై అధికారులు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు వారు డ్రైవింగ్ చేయవద్దని, రాష్ డ్రైవింగ్ చేయవద్దని హెల్మెట్ ధరించాలని డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని సీట్ బెల్ట్ ధరించాలని అవగాహన పెంపొందించారు. ఈ సందర్భంగా ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రతిరోజు 20 దాకా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు చనిపోతున్నారని, చాలామంది ప్రమాదాల ద్వారా అంగవైకల్యం కలుగుతుందని తెలిపారు. అందుకే రవాణా శాఖ నియమ నిబంధనలను పాటించి సురక్షితంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత సమిష్టిగా అందరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నిఖిల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఉష, పిఇటి రవి,హెడ్మాస్టర్లు అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పంతం నెగ్గించుకున్న కవిత

**హైదరాబాద్, జనవరి8( వెలుతురు):**
నిజామాబాద్ స్థానిక సంస్థల శాసనమండలి సభ్యత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజీనామా చేసిన విషయం తెలిసిందే. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేసి నాలుగు నెలలు గడిచింది. ఎట్టకేలకు ఆమె రాజీనామాను ఆమోదించారు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి. అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడిన కొద్ది కాసేపట్లోనే కవిత రాజీనామాకు ఆమోదం తెలుపుతున్నట్లు నోటిఫికేషన్ జారీ చేశారు లెజిస్లేటివ్ సెక్రటరీ. 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి శాసనమండలి సభ్యురాలిగా కల్వకుంట్ల కవిత ఎన్నికయ్యారు. బీఆర్ ఎస్ పార్టీతో అంతర్గత విభేదాల కారణంగా గత ఏడాది సెప్టెంబర్ 3వ తేదీన ఆ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. గడచిన సోమవారం శాసనమండలికి చివరిసారిగా హాజరై, తన రాజీనామాను ఆమోదించాలంటూ శాసన మండలి చైర్మన్ ను విజ్ఞప్తి చేశారు.చివరిసారి తాజాగా తెలంగాణ శాసన మండలిలో భావోద్వేగంగా ప్రసంగించిన కల్వకుంట్ల కవిత , తన రాజీనామా విషయంపై స్వయంగా చైర్మన్ కోరినా వినలేదు. తొందరపడకండి, ఆవేశంలో నిర్ణయాలు తీసుకోవడం సరికాదు, మీరు బాధలో ఉన్నారు. మరోసారి రాజీనామాపై పునరాలోచించండి అంటూ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కవితకు చివరిసారి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆమె వినలేదు. తాను రాజకీయాల్లోకి అమెరికా నుంచి ఎందుకు వచ్చాను, తెలంగాణ ఉద్యమ సమయంలో జాగృతి ఏర్పాటు చేయడంతోపాటు, ఉద్యమానికి , బీఆర్ ఎస్ పార్టీకి జాగృతి చేసిన కృషి గురించి మండలిలో చివరి ప్రసంగంలో మాట్లాడారు కవిత. తన తండ్రి స్థాపించిన బీఆర్ ఎస్ పార్టీలో తాను మొదటి నుంచి ఎదుర్కొంటున్న అవమానాలను ప్రస్తావిస్తూనే, బీఆర్ ఎస్ ప్రభుత్వంలో భారీ అవినీతి జరిగిందంటూ మండలిలో సంచలన ఆరోపణలు చేశారు. కుటుంబ సభ్యుల నుంచి మద్దతు లేకుండా ఇన్నాళ్లు తాను ఎదుర్కొన్న సవాళ్లను సభలో ప్రస్తావిస్తూ ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు కవిత.



ఉబికి వస్తున్న కన్నీళ్లతో తన ప్రసంగం ఆద్యంతం కొనసాగింది. ఇంతలా అవమానాలు ఎదుర్కొన్న తాను ఇక బీఆర్ఎస్ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో కొనసాగలేనని, తన రాజీనామా వెంటనే ఆమోదించాలని మండలి చైర్మన్‌ను కోరారు కవిత. కవిత మాటకు స్పందించిన చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారించే ప్రయత్నం చేసినా కవిత వినలేదు. ఇప్పటికే నాలుగు నెలలు రాజీనామా ఆమోదం కోసం ఎదురు చూశానని, అన్ని విషయాలు ఆలోచించిన తరువాతే ఈ నిర్ణయం తీసుకున్నానని, వెనక్కు తగ్గబోనని స్పష్టం చేశారు. కవిత రాజీనామా విషయంలో నిర్ణయం మార్చుకోవడం కష్టమని భావించిన శాసన మండలి చైర్మన్ తాజాగా ఆమె రాజీనామాకు తెలుపుతూ నోటిఫికేషన్ విడుదల చేయడంతో కవిత పంతం నెగ్గించుకున్నట్లైంది.

**మరో ఉపఎన్నిక...**

ఉత్కంఠకు తెరపడింది. జాగృతి అధ్యక్షురాలు కవిత రాజీనామాకు ఆమోద ముద్ర పడింది. కవిత రాజీనామాను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదించారు. గతేడాది సెప్టెంబర్ 2న బీఆర్ఎస్ పార్టీ కవితను సస్పెండ్ చేసింది. ఆ వెంటనే 3వ తేదీన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కవిత ప్రకటించారు.2022 జనవరిలో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో బీఆర్ఎస్ కు ఫుల్ మెజార్టీ ఉంది. నాడు కాంగ్రెస్ పోటీ చేయలేదు, బీజేపీ కూడా అభ్యర్థిని నిలపలేకపోయింది. ఆ పరిస్థితుల్లో కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2028 వరకు కవిత పదవీ కాలం ఉంది. అయితే రెండున్నర సంవత్సరాల పదవీ కాలం ఉండగానే ఆమె రిజైన్ చేసేశారు.ఇప్పుడు కవిత రాజీనామాకు ఆమోద ముద్ర పడటంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. తెలంగాణలో మరో ఉప ఎన్నిక అనివార్యం అయ్యింది. కవిత రాజీనామాకు ఆమోదం లభించడంతో కౌన్సిల్‌లో ఓ స్థానం ఖాళీ అయినట్టు ఎన్నికల కమిషన్‌కు చైర్మన్ కార్యాలయం నుంచి సమాచారం వెళ్లింది. దీంతో ఆ స్థానం భర్తీ కోసం కొన్ని రోజుల్లోనే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందికవిత రిజైన్ తో ఉపఎన్నిక అనివార్యమే అయినా స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాకే బైపోల్ జరిగే అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు ఓటు వేయాలంటే మొదట స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఎంపిక కావాల్సి ఉంటుంది.ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇటీవల పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది రాష్ట్ర ప్రభుత్వం. త్వరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల కోసం సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ లెక్కన నిజామాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఓటర్లు లేరు. దీనివల్ల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఇప్పుడే నిర్వహించడం సాధ్యం కాదు. మున్సిపల్ కార్పొరేటర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటు వేయాల్సి ఉంటుంది కాబట్టి.. పరిషత్ ఎన్నికలు ముగిశాకే? పాలక మండళ్లు కొలువుదీరిన తర్వాతే ఎమ్మెల్సీ ఉపఎన్నిక జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కనీసం మూడు, నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం.బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న కవిత.. తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఎన్నికల్లో ఆమె పోటీ చేయకపోవచ్చనే విశ్లేషణ వినిపిస్తోంది.డిసెంబర్ నెలలో పంచాయతీ ఎన్నికలు ముగియడంతో రాష్ట్రంలో మిగతా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. తొలుత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రెడీ అవుతోంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెలలోనే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికలు ముగియగానే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

# పాకిస్తాన్ లో కరువు ఛాయలు

**న్యూఢిల్లీ జనవరి8( వెలుతురు):**
గత ఏడాది ఏప్రిల్‌లో జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి జరిగింది. 26 మంది పర్యాటకులు చనిపోయారు. దీంతో భారత ప్రభుత్వం సింధు జల ఒప్పందం రద్దు చేసింది. 1969లో జరిగిన ఈ ఒప్పందం నిలిపివేయడంతో మన దేశం నుంచి పాకిస్తాన్‌లోకి వెళ్లాల్సిన జలాలు ఆగిపోయాయి. అవసరం లేని సమయంలో వరదలు వస్తున్నాయి. తాజాగా ఒప్పందం నిలివేత ఎఫెక్ట్ పాకిస్తాన్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. చుక్క నీరు కూడా పాకిస్తాన్ దాటి



వెళ్లడం లేదు. దీంతో దాయాది దేశంలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి.భారత్ పాక్‌పై ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రతీకారంగా ఈ చర్య తీసుకుంది. పాకిస్తాన్‌లో సింధు, జెహ్లం, చెనాబ్ నదులపై ఆధారపడిన వ్యవసాయం, రోజువారీ జీవనం కష్టమవుతోంది. డ్యామ్‌ల నిర్మాణం, నీటి నిల్వలు భారత్‌కు ప్రయోజనకరంగా మారాయి. ఇప్పటికే పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్‌లో తాజాగా జల సంక్షోభం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.పాకిస్తాన్ మొత్తం వ్యవసాయంలో చాలా వరకు సింధు జలాలపై ఆధారపడి సాగుతోంది. నీటి నిలిపివేతతో 30 నుంచి 40 శాతం వ్యవసాయం తగ్గే అవకాశం ఉంది. ఆహార భద్రత దెబ్బతినే ప్రమాదం ఉంది. నదీ ప్రవాహ మార్పులు డెల్టా ప్రాంతాల్లో ఉప్పు పెరగడం, జీవవైవిధ్య నష్టానికి దారితీస్తాయి. ఈ నేపథ్యంలో పాక్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వం కోరవచ్చు. కానీ భారత్ దృఢంగా నిలబడుతుంది. ఒప్పందం పునరుద్ధరించే అవకాశాలు తక్కువ.

# లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించిన గుత్తా

**నల్లగొండ, జనవరి8( వెలుతురు):**
నల్లగొండ క్యాంప్ కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా మంజూరు అయిన రూ.12.50 లక్షల విలువ గల చెక్కులను తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం చాలా ఉపయోగకరమైన పథకమని, ఈ పథకం ద్వారా పేద ప్రజలకు ఎంతో లబ్ది చేకూరుతుందన్నారు. అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

# తిరుమలలో పెరిగిన రద్దీ

**తిరుమల, జనవరి8( వెలుతురు):**
వైకుంఠ ద్వార దర్శనానికి గురువారం ఆఖరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తిరుమలకు తరలివచ్చారు. దీంతో ఆలయ మాఢవీధులు భక్తుల గోవిందనామ స్మరణతో మారుమ్రోగిపోతున్నాయి. వివిధ ప్రాంతాల ను0చి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లన్నీ నిండిపోగా శిలాతోరణం వరకు క్యూ లైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. నిన్న 85,752 మంది తలనీలాలు సమర్పించుకోగా 19,443 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ.4.69 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

# మోకిల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**- చెట్టును ఢీకొన్న విద్యార్థుల కారు**

**- నలుగురు ఇక్ఫయ్ విద్యార్థుల దుర్మరణం**



**రంగారెడ్డి, జనవరి8( వెలుతురు):**
రంగారెడ్డి జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తాపడటంతో నలుగురు విద్యార్థులు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్ ఇక్ఫాయి యూనివర్సిటీ విద్యార్థులు శ్రీ నిఖిల్, సూర్యతేజ, సుమిత్, రోహిత్, నక్షత్ర కలిసి కోకాపేటలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఓ స్నేహితుడిని డ్రాప్ చేసి తిరిగి మోకిల నుండి హైదరాబాద్ నగరానికి వస్తుండగా గురువారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలోని మీర్జాగూడ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది.. కారు వేగం ఎక్కువగా ఉండటంతో అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. నక్షత్ర అనే యువతికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే యువతిని అత్యవసర చికిత్స ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘోర ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

# గ్రామీణ రోడ్లకు మహర్దశ

**- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడి**



**తిరుపతి, జనవరి8( వెలుతురు):**
కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ కలుగుతున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం ఉదయం నారాయణవనం మండలం భీమునిచెరువులో రూ.5.00 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ తో కలిసి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండుగ 2.0 ద్వారా ప్రభుత్వం ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5.00 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇదే విధంగా అన్నీ గ్రామ పంచాయతీలలో రోడ్లు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జడ్పీ ÷నాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ మాట్లాడుతూ తమ స్వగ్రామంలో సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణానికి రూ.5.00 లక్షలు మంజూరు చేసిన తమ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు కూటమి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# కువైట్‌లో మాదక ద్రవ్యాల సరఫరా

**- ఇద్దరు భారతీయులకు మరణశిక్ష**



**న్యూఢిల్లీ, జనవరి8( వెలుతురు):**
మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో కువైట్‌లోని ఓ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. మాదకద్రవ్యాలతో పట్టుబడిన ఇద్దరు భారతీయులను దోషులుగా తేల్చి, మరణశిక్ష విధించింది. అయితే, వారిద్దరు భారత్‌లో ఏ ప్రాంతానికి చెందిన వారనే విషయంపై స్పష్టత లేదు. దేశంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించిన కువైట్ అంతర్గత వ్యవహారాల శాఖ ఇటీవల ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా కైఫాన్, షువైఖ్ ప్రాంతాల్లో నిఘా పెట్టిన డ్రగ్ కంట్రోల్ అధికారులు.. ఇద్దరు భారతీయులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 14 కిలోల హెరాయిన్, 8 కిలోల మెథాంఫెటమైన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. వీటికి సంబంధించిన ఆధారాలను ప్రాసిక్యూటర్లు కోర్టులో ప్రవేశపెట్టగా.. దోషులకు మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది.

# రైల్వేజోన్‌కి శంకుస్థాపనకు ఏడాది పూర్తి

**- అయినా మొదలు కాని కార్యకలాపాలు**

**- జీవిఎంసి వద్ద ఎపి లోక్‌సత్తా నేతల నిరసన**



**విశాఖపట్టణం, జనవరి8( వెలుతురు):**
విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడిన దక్షిణ కోస్తా సౌత్ కోస్ట రైల్వే జోన్ కి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గత ఏడాది జనవరి 8 న శంకుస్థాపన చేసి నేటికి 12 నెలలు పూర్తి కావచ్చినా నేటికీ కేంద్ర రైల్వే శాఖ గెజిట్ విడుదల చేయకపోవడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుందని ఎపి లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరుని నిరసిస్తూ ?. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ ? 2019 ఫిబ్రవరి లో కేంద్ర ప్రభుత్వం దక్షిణ కోస్తా (సౌత్ కోస్ట్) రైల్వే జోన్ ఏర్పాటు చేసిందని, 2020 లో రూ.170 కోట్లు బ్జడెట్ కేటాయింపులు చేసారన్నారు. 2025 జనవరి లో డిపిఆర్ ఆమోదిస్తూ, అదే నెల 8 న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం జోన్ కార్యాలయంకి శంకుస్థాపన కూడా చేసారన్నారు. 2025 జూన్ 5 న జోన్ జీఎం గా సందీప్ మాథుర్ ని నియమించారని, వీఎంఆర్డీఏ నిర్మించిన డెక్ బిల్డింగ్ లో 6,7, అంతస్థుల భవనాలు తీసుకొని సిద్ధం చేసారన్నారు. ఇంత జరిగినప్పటికీ నేటికీ రైల్వే జోన్ గెజిట్ విడుదల చేయకపోవడం శోచనీయం అన్నారు. గెజిట్ విడుదల చేయకపోతే ఉద్యోగుల సర్దుబాటు, జోన్ హద్దులు, పరిపాలనా వ్యవహారాలు ఎలా సాగుతాయని బాబ్జి ప్రశ్నించారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు రైల్వే డివిజన్లు ఇప్పటికే వెనకపడ్డాయని కేంద్ర మంత్రులు, రాష్ట్ర ఎంపిలు, గెజిట్ విడుదలకు కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవడంలో విఫలమైయ్యారని ఆరోపించారు. విశాఖపట్నం రైల్వే జోన్ రాజు లేని రాజ్యంలా ఉందని, రాష్ట్ర విభజన చట్టం షెడ్యూల్ 8 లో జోన్ అంశం స్పష్టంగా ఉండికూడా 12 సంవత్సరాల్లో పూర్తి చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ సత్తా నగర అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.మూర్తి, గొట్టాపు సుధీర్ ఐ.అనంతలక్ష్మ, రాజేశ్వరి, మోహంతి, తాత్రాజు రాజారావు, బోర రమేశ్, నాగరాజు, తుమ్మగంటి రామ్మోహనరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, అకేష్, తదితరులు పాల్గొన్నారు.

# వైకాపాలో లోపించిన అంతర్గ ప్రజాస్వామ్యం - యనమల



**అమరావతి, జనవరి8( వెలుతురు):**
జగన్ అసెంబ్లీ కార్యకలాపాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తే.. వైకాపా ఎమ్మెల్యేలు మాత్రం ఆయనకు తెలియకుండా రిజిస్టర్‌లో సంతకాలు చేయడం ఏంటని మాజీ మంత్రి యనమల నిలదీసారు. ఇదికేవలం జీతాల కోసమేనని అన్నారు. అలాగే ఆ పార్టీలో అంతర్గత విభేదాలను ప్రతిబింబిస్తోందని తెదేపా మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఈ పరిణామాలు భవిష్యత్తులో వైకాపాలో చీలికకు దారితీయొచ్చని అభిప్రాయపడ్డారు. సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ప్రజలు వారిని ఎన్నుకుంటే సమావేశాలను బహిష్కరించడాన్ని ప్రజలు గమనించాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 190 (4) ప్రకారం అనర్హత వేటు పడుతుందనే భయంతోనే వారు ఇలా చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని వ్యాఖ్యానించారు.

# గులాబీకి వరుస చిక్కుముళ్లు

**హైదరాబాద్, జనవరి8( వెలుతురు):**
రాజకీయాలలో ముఖ్యంగా కుటుంబాలు నడిపే పార్టీలలో అంతర్గతంగా కుమ్ములాటలు చోటు చేసుకోవడం మనదేశంలో కొత్తేమీ కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ లో సంజయ్ గాంధీ వ్యవహార శైలి ఈ దేశ ప్రజలకు సుపరిచితమే. తమిళనాడులో డీఎంకే, ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు.. అంతిమంగా అధికారం కోసం, అలవిమాలిన సంపాదన కోసం జరిగే పోరాటాలు ప్రాంతీయ కుటుంబ పార్టీల అసలు బాగోతాన్ని బయటపెడతాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి భారత రాష్ట్ర సమితి కూడా చేరింది.2014లో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలంగాణలో వ్యవస్థలను ఎంత నాశనం చేయాలో అంత చేసింది. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలను అడ్డగోలుగా కొనేసింది. ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకుంది. కాళేశ్వరం నుంచి మొదలు పెడితే గొర్రెల పంపిణీ వరకు ఇలా ప్రతి పథకంలోనూ అవినీతి జరిగిందని, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వినిపించాయి. వాస్తవానికి ఇటువంటి కుంభకోణాలు పార్టీకి డ్యామేజ్ చేయడం ఒక ఎత్తు అయితే.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కలిగించే డ్యామేజ్ మరొక ఎత్తు.వాస్తవానికి గులాబీ పార్టీలో ఈ స్థాయిలో అంతర్గతంగా కుమ్ములాటలు జరుగుతాయని ఎవరూ ఊహించలేదు. సాక్షాత్తు కెసిఆర్ కుమార్తె వ్యతిరేక స్వరాన్ని వినిపిస్తారని.. తన తండ్రి పరిపాలనను ఉదాహరణలతో వివరిస్తూ విమర్శిస్తారని ఎవరూ అంచనా వేయలేదు. కాళేశ్వరం ప్రయోజనం నెరవేరలేదని, పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పండబెట్టారని, సామాజిక తెలంగాణ సహకారం కాలేదని ఇలా ప్రతి విషయంలోనూ కవిత విమర్శలు చేసుకుంటూ పోయారు. కొన్ని సందర్భాలలో లెక్కలతో సహా వివరించారు.




ఒక రకంగా ఈ పనిని కాంగ్రెస్ చేయాల్సి ఉండేది. ఒక రకంగా బలమైన స్వరాన్ని వినిపించే ప్రయత్నం చేశారు కవిత.కవిత చేస్తున్న ఆరోపణల్లో నిజం లేకపోలేదు. కానీ 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఏం చేశారు అనేది ఇక్కడ అసలైన ప్రశ్న. భారత రాష్ట్ర సమితి ఏర్పాటును వ్యతిరేకించానని చెప్పిన ఆమె.. పార్టీ ప్రారంభత్సవానికి ఢిల్లీ ఎందుకు వెళ్లినట్టు? 10 సంవత్సరాల కాలంలో తెలంగాణలో విధ్వంసం జరిగిందని చెబుతున్న ఆమె.. గతంలో బంగారు తెలంగాణ సాకారం అయిందని ఎందుకు చెబుతున్నట్టు.. లిక్కర్ కేసులో అడ్డంగా ఇరుక్కుపోయారు కాబట్టి.. కేసుల నుంచి తప్పించుకోవాలంటే ఆమె కెసిఆర్ కు వ్యతిరేకంగా వ్యవహరించాలి కాబట్టి.. అలానే చేస్తున్నారని గులాబీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి రాజకీయాల లక్ష్యాలకు అనుగుణంగా ఆమె నడుచుకుంటున్నారని గులాబీ నేతలు మండిపడుతున్నారు.వాస్తవానికి తన పార్టీలో ఉన్నప్పుడు ప్రాధాన్యం దక్కలేదని పదేపదే ఆరోపిస్తున్న కవిత.. ఒకసారి ఎంపీ ఎలా అయ్యారు? మరోసారి ఎమ్మెల్సీ ఎలా అయ్యారు? సింగరేణిలో అధ్యక్షురాలిగా ఎలా ఉన్నారు? ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయని గులాబి పార్టీ నేతలు అంటున్నారు. అధికారం దూరంగానే కెసిఆర్ కు వ్యతిరేకంగా మాట్లాడటం సమంజసం కాదని ఆమెకు గుర్తుచేస్తున్నారు. మరోవైపు జాగృతి నేతలు స్పందిస్తున్న తీరు వేరే విధంగా ఉంది. కేటీఆర్ కూడా ఆమెకు ద్రోహం చేశారని.. కనీసం ఒక పని కూడా చేసుకునే అవకాశం కల్పించలేదని.. ఆమె భర్త ఫోన్ కూడా టాప్ చేశారని.. అలాంటప్పుడు ఆమె పార్టీలో ఎలా ఉంటారంటూ జాగృతి నేతలు చెబుతున్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో హరీష్ రావు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని.. అందువల్లే కవిత ఆయన టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేస్తున్నారని జాగృతి నేతలు చెబుతున్నారు.. కవిత రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేక ఆమెకు అడుగడుగునా అడ్డు పుల్లలు వేస్తున్నారని.. అందువల్లే కవిత ఈ స్థాయిలో స్పందిస్తున్నారని జాగృతి నేతలు అంటున్నారు.కవితకు, కెసిఆర్ కు మధ్యలో గ్యాప్ రావడానికి ప్రధాన కారణం హరీష్, సంతోష్ రావు అని జాగృతి నేతలు చెబుతున్నారు. అందువల్లే ఆమె ఆధారాలతో సహా విమర్శలు చేస్తున్నారని.. ఇందులో వ్యక్తిగత లక్ష్యాలు అంటూ ఏమీ లేవని జాగృతి నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ అంతపురంలో జరిగే కుమ్ములాటలు రాజ్యానికి అసలు మంచివి కావు. ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా ఆ పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఇప్పటికే పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలు వచ్చాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో అధికార పార్టీకి సానుకూలమైన ఫలితాలు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలు కూడా గులాబీ పార్టీకి రాలేదు. అలాంటప్పుడు ఈ అంతర్గత కుమ్ములాటను ఏ స్థాయిలో కేసీఆర్ పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది.

# టాప్ గేర్ లో రియల్ ఎస్టేట్

**హైదరాబాద్, జనవరి8( వెలుతురు):**
దేశంలోని 8 ప్రధాన నగరాల్లో చూస్తే హౌసింగ్ సేల్స్ (ఇళ్లు లేదా ఫ్లాట్ల విక్రయాలు) గతేడాది 3.48 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. ఇది అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే స్వల్పంగా ఒక శాతం తగ్గిందని చెప్పొచ్చు. అయితే ఇదే సమయంలో ఈ ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 19 శాతం వరకు పెరిగినట్లు పేర్కొంది. బుధవారం రోజు వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా ఈ డేటా విడుదల చేసింది. ఇక్కడ ప్రధానంగా హోం లోన్ వడ్డీ రేట్లు తగ్గడం సహా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటం, ద్రవ్యోల్బణం తగ్గుతుండటం వంటివి హౌసింగ్ డిమాండ్‌ను స్థిరంగా ఉంచేందుకు దోహదం చేసినట్లు తెలిపింది. ఈ 8 ప్రధాన నగరాలు చూస్తే ఢిల్లీ- ఔఅఖీ, ముంబై, బెంగళూరు, పుణె, హైదరాబాద్, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా ఉన్నాయి.ఇక్కడ ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే సేల్స్ కాస్త ఎక్కువగా పెరిగాయి. ఇక్కడ 2025 సంవత్సరంలో మొత్తం ఇళ్ల విక్రయాలు 4 శాతం పెరిగి 38,403 యూనిట్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో ఇళ్లు లేదా ఫ్లాట్స్ ధరలు కూడా 13 శాతం వరకు పెరిగి చదరపు అడుగుకు సగటు ధర రూ. 6,721 గా ఉంది. రెండో అర్ధభాగంలో అంటే జులై- డిసెంబర్ సమయంలో హౌసింగ్ సేల్స్ హైదరాబాద్ నగరంలో 19,355 గా ఉండగా.. ఇది అంతకుముందు సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 5 శాతం ఎక్కువ.కొత్త ఇళ్ల సప్లై విషయానికి వస్తే 2025లో హైదరాబాద్‌లో ఇది 40,737 యూనిట్లుగా ఉండగా.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 7 శాతం తగ్గింది. ఇక 2025లో అన్‌సోల్డ్ ఇన్వెంటరీ అంటే అమ్ముడుపోని ఇళ్లు లేదా ఫ్లాట్ల సంఖ్య హైదరాబా?ద్‌లోనే 54,878 యూనిట్లుగా ఉండటం గమనార్హం. అంటే ఇక్కడ డిమాండ్‌కు మించి కొత్త ఇళ్ల సప్లై ఉండటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, ఉద్యోగాల సృష్టిలో దూసుకెళ్తుండటం వల్ల రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతున్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్ తెలిపింది.ముంబైలో హౌసింగ్ సేల్స్ ఒక శాతం పెరిగి 97,188 యూనిట్లుగా ఉంది. ఇక్కడ సగటున ఇళ్ల ధరలు 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,856 గా ఉంది. బెంగళూరులో ఇళ్ల విక్రయాలు స్థిరంగా 55,373 యూనిట్లుగా ఉంది. ఇళ్ల ధరలు సగటున 12 శాతం వరకు పెరిగి చ.అడుగుకు రూ. 7,388 గా ఉంది. పుణె, ఢిల్లీ- ఔఅఖీ, కోల్‌కతాలోనూ ఇళ్ల అమ్మకాలు కాస్త తగ్గుముఖం పట్టాయి.



# హరిద్వార్‌లోని గంగా ఘాట్‌లలో హిందువులకే ఎంట్రీ

**ఉత్తరాఖండ్, జనవరి8( వెలుతురు):**
హరిద్వార్‌లోని 105 ఘాట్‌లలోకి హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధించాలని ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం యోచిస్తోంది. రిషికేశ్, హరిద్వార్‌లను 'సనాతన పవిత్ర నగర్'లుగా ప్రకటించే ప్రతిపాదన కూడా ఉంది. అయితే, 1916 నాటి ఒప్పందాన్ని పరిశీలిస్తూ, అర్ధ కుంభ్ మేళా నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆధ్యాత్మిక గుర్తింపును కాపాడతామని తెలిపారు. అయితే, స్థానికులు మాత్రం దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది మన మతం విధానం కాదని అంటున్నారు.రిషికేశ్, హరిద్వార్‌లను 'సనాతన పవిత్ర నగర్'లుగా ప్రకటించాలని కూడా పుష్కర్ సింగ్ ధామి ప్రభుత్వం భావిస్తోంది. 2027 జనవరి 14న మకర సంక్రాంతికి ప్రారంభం కానున్న అర్ధ కుంభ్ మేళా నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.ఈ విషయంలో 1916లో భారతరత్న పండిట్ మదన్ మోహన్ మాలవ్యా, బ్రిటిష్ ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందం వివరాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. గంగా సభకు తొలి అధ్యక్షుడిగా మాలవ్యా వ్యవహరించారు. ఆ ఒప్పందం ప్రకారం.. గంగా నది ప్రవాహాన్ని నిరంతరాయంగా కొనసాగించడం, పుణ్యనగరం పవిత్రతను కాపాడటం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా గంగా ఘాట్‌లలోకి హిందూయేతరుల ప్రవేశంపై ఆంక్షలు విధించారు. అంతేకాదు, రిషికేశ్, హరిద్వార్‌లలో హిందువులు కానివారు శాశ్వతంగా నివసించడానికి వీలులేదు. వారు కేవలం పని నిమిత్తం వచ్చి, తమ పనులు పూర్తయ్యాక తిరిగి వెళ్లిపోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ అసలు ఒప్పందంలోని నిబంధనలను పునరుద్ధరించాలని తీవ్రంగా పరిశీలిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గంగా సభ అధ్యక్షుడు నితిన్ గౌతమ్ గతంలో మాట్లాడుతూ.. 'హరిద్వార్ పవిత్రతను కాపాడటానికి, మొత్తం కుంభ్ మేళా, హరిద్వార్ నగరాన్ని హిందువులు కానివారికి నిషేధిత ప్రాంతంగా ప్రకటించాలి. వారి ప్రవేశాన్ని నిషేధించాలి. హరిద్వార్, రిషికేశ్‌లలోని అన్ని నదీ తీరాలు వారికి ప్రవేశం ఉండకూడదు' అని అన్నారు. అయితే తాను విశ్వ హిందూ పరిషత్ (హరిద్వార్) మాజీ అధ్యక్షుడిగా ఆ డిమాండ్ చేశానని, గంగా సభలో దీనిపై ఎలాంటి తీర్మానం చేయలేదని చెప్పారు.రాజకీయ పార్టీలు కూడా ఈ విషయంపై స్పందించాయి. కాంగ్రెస్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అశోక్ శర్మ మాట్లాడుతూ.. "హిందూయేతరుల ప్రవేశం నిషేధాన్ని హరి-కి-పౌరి మాత్రమే పరిమితం చేయాలని కోరిన మదన్ మోహన్ మాలవ్యా కంటే బీజేపీ-ఆర్ఎస్ఎస్ పెద్ద హిందువులా? ఈ నిషేధాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం" అని అన్నారు. హరిద్వార్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సందీప్ గోయల్ మాట్లాడుతూ.. 'ఇది మా పార్టీ విధానం కాదు...' అని తెలిపారు.




# నేడు థియేటర్లలోకి ది రాజాసాబ్ మూవీ

## ప్రభాస్ అభిమానులకు సంక్రాంతి పండగ

మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ చేస్తూ వచ్చానని మార్పు కోసమే 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేశానని అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ఇది. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నేడు సినిమా విడుదల కానుండడంతో థియేటర్ల వద్ద ప్రభాస్ అభిమానుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా 'స్పిరిట్' డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగాతో ప్రభాస్, కథానాయికలు ముచ్చటించారు. సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఒక తరహా కథలకు అలవాటు పడిన హీరోలు అంత త్వరగా మార్పును కోరుకోరని, 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేయడానికి కారణం ఏంటని ప్రభాస్‌ను సందీప్ అడిగారు. అందుకు ఆయన స్పందిస్తూ.. 'నా కెరీర్ మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ ఎక్కువగా చేశా. ఒకే జానర్ ఫిల్మ్స్ చేసి బోర్ కొట్టేసింది. ఆ మార్పు కోసమే 15ఏళ్ల కిందట 'డార్లింగ్' చేశా. 'ఇది వర్కవుట్ అయ్యే సినిమా కాద'ని అందరూ అన్నారు. కానీ, బాగా ఆడింది. ఇప్పుడు భారతీయ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలి. అందుకే ఇది ప్రయత్నించా. ఇది బామ్మ-మనవడి కథ. ఇందులో బామ్మ భర్త విలన్. అనుకోని పరిస్థితుల్లో ఆ పాడుబడిన మహల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అది ఎందుకనేది సినిమా చూడాలి. ఇందులో 'ది రాజాసాబ్'గా నటించేది నేనే. సినిమా ప్రారంభ సమయంలో రెండు, మూడు టైటిల్స్ అనుకున్నాం. చివరకు 'ది రాజాసాబ్' ఓకే చేశాం'అని ప్రభాస్ చెప్పారు. ఈ సందర్భంగా 'స్పిరిట్' మూవీ పోస్టర్ గురించి చర్చ జరిగింది. 'బాహుబలి' చేసిన ఒక హీరోను ఎలా ప్రజెంట్ చేయాలా? అని చాలా ఆలోచించి ఇప్పుడున్న లుక్‌ను విడుదల చేశాం. ప్రభాస్ చేతిలో ఉన్న గ్లాస్ గురించి సోషల్‌మీడియా బాగానే చర్చ జరిగింది. అది ఒక లీటర్




బాటిల్. ఆయన చేతిలో అది గ్లాస్‌లాగానే కనిపిస్తుంది. ఆ సీన్ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటుంది. పోస్టర్‌లో ఎక్కువగా తెలుపు మాత్రమే హైలైట్ అయింది. అందుకే మద్యం ఉన్న బాటిల్ అందరి దృష్టిలో పడిందని సందీప్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.




# ఎన్టీఆర్‌తో కార్తికేయ సినిమా

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పటినుండో ఓ కథ రెడీ చేస్తున్నారు. అదే లార్డ్ కార్తికేయ సుబ్రహ్మణ్య స్వామి కథ. ఈ సినిమాకు గాడ్ ఆఫ్ వార్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు వార్తలు ఎప్పటినుండో వినిపిస్తున్నాయి. అయితే ఈ సినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో చేస్తున్నట్టు లాంగ్ బ్యాక్ ఒక అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. హ్యాట్రిక్స్ హిట్స్ తర్వాత అల్లు అర్జున్- త్రివిక్రమ్ కాంబోలో ఒక భారీ మైథలాజికల్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. కాని పుష్ప హిట్ తర్వాత త్రివిక్రమ్ సినిమా నుండి బన్నీ స్టెప్ అవుట్ అయ్యాడు. ఆ ప్లేస్ లోకి జూనియర్ ఎన్టీఆర్ వచ్చి చేరాడు. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో రూ.1000 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా ఉంటుందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో వినిపించింది. . త్రివిక్రమ్ మార్క్ షార్ప్ డైలాగ్స్, మైథలాజికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను ప్రపంచ స్థాయి ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించనున్నారని టాక్ నడిచింది. అయితే ఇటీవల ఈ కథ మళ్లీ అల్లు అర్జున్ కాంపౌండ్ లోకి వచ్చిందని బాలీవుడ్ నుండి ఫీలర్లు వదిలారు. దాంతో ఈ సినిమాపై గందరగోళం నెలకొంది. తాజాగా సితార నాగవంశీ అనగనగ ఒక రాజు ట్రైలర్ ఈవెంట్ లో మాట్లాడుతూ ' కాలర్ లు ఎగరేయడం ఇప్పుడు ఎందుకులే. మే నెల నుండి కాలర్ ఎగరేద్దాం అని చెప్పాడు. దాంతో ఈ మూవీ జూనియర్ ఎన్టీఆర్ తోనే ఉంటుందని చెప్పకనే చెప్పేసాడు నాగవంశి. అన్ని అనుకున్నట్టు జరిగితే 2027 ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్టీఆర్ - త్రివిక్రమ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.

# భారత సంస్కరణ ఉద్యమాల చరిత్రనే పూలే సినిమా

**- నిర్మాత పొన్నం రవిచంద్ర**

**హైదరాబాద్ వెలుతురు జనవరి 08:**

సుపదా క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మించిన 'పూలే ' భారత సంస్కరణ ఉద్యమాల చరిత్రకు మైలురాయి వంటిదని నిర్మాత సినీ విమర్శకుడు పొన్నం రవిచంద్ర అన్నారు. గురువారం హైదరాబాదులోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూలే దంపతులు మహిళలందరికీ విద్య నేర్పిన ఆది గురువులని అన్నారు. 200 సంవత్సరాల క్రితం సావిత్రిబాయి పూలే జ్యోతిబాపూలే దంపతులు దళితులు స్త్రీలు బహుజనుల పట్ల అప్పటి సమాజ అమానవీయతకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. ఆ సామాజిక ఉద్యమాన్ని తెలుగు నేలపై స్ఫూర్తి నింపడం కోసం హిందీ లో వచ్చిన ఈ సినిమాను తెలుగు లో చేశామని తెలిపారు. సినిమా మాటల రచయిత కత్తి చేతన్ మాట్లాడుతూ ఇది వ్యాపారత్మక సినిమా కాదని, సామాజిక సంఘర్షణల కళాత్మక చిత్రమని దీనిని రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యావంతులంతా చారిత్రక దృష్టితో చూడాలని అన్నారు. ఈ సినిమా తెలుగులో ఒక సంచలమైన సందర్భం అవుతుందని అన్నారు. ముఖ్యమంత్రికి, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు, శాసన సభ్యులకు కృతజ్ఞతలు. పూలే సినిమాను ప్రివ్యూ షో చూసి సినిమా టీంని అభినందించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్ గారికి మరియు మంత్రివర్గ సభ్యులు శాసనమండలి సభ్యులు శాసనసభ్యులు, దిల్ రాజు లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పొన్నం రవిచంద్ర, కత్తి చేతన్ సివి నవీన్ కుమార్, రాజీవ్ చంద్ర పొన్నంలు తెలిపారు. ఈ సినిమాకు వినోదపు పన్ను మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సినిమా భారతీయ సమాజానికి అద్భుతమైన సందేశాన్ని ఇస్తుందని మహిళా అభ్యున్నతికి ఆనాడు ఉన్న కుల వివక్షకు వ్యతిరేకంగా సర్వ సమానత్వ భావన కోసం జరిపిన త్యాగాలను ఈ తరానికి గుర్తు చేస్తుందని వారు అన్నారు. తెలుగు సమాజంలో బహుజన రాజకీయ అధికారానికి బాటలు వేస్తుందన్నారు. ఇది హిందీ లో అనంత మహదేవన్ దర్శకత్వంలో పూలే దంపతుల సంపూర్ణ బయోగ్రఫీ చిత్రమని ఇందులో ప్రతిక్ గాంధీ, పత్రలేఖ పాల్ ల నటన అద్భుతమని అన్నారు. ఈ సినిమా సెన్సార్ బోర్డ్ పరిశీలన తర్వాత ఈ జనవరి చివరి వారంలో అన్ని థియేటర్లలో రిలీజ్ చేస్తామన్నారు. మనం ఇప్పుడు ఈ ఆధునిక ప్రజాస్వామిక సమాజంలో ఉన్నామంటే పూలే అంబేద్కర్ లాంటి దార్శానిక విప్లవకారులే కారణమన్నారు. ఈ సమావేశంలో తిరుపతి గౌని, ఉదయ్ కుంభం, జనని, నేతికార్ సురేష్ లాల్, అభినవ్ వరాల, నీలం రమేష్, బత్తిని వినయ్ గౌడ్, బత్తుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.








# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అనగనగా ఒక రాజు

రాజుగారి పెళ్లి ఏడుతరాలు గుర్తిండిపోతుందంటూ నవ్వులు పూయిస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన ప్రధానపాత్రలో మారి తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు' . మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా సందడి చేయనున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అందులో నవీన్ తన మార్క్ కామెడీతో ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలు అందించిన నవీన్ ఇప్పుడు అనగనగా ఒకరాజుతో వస్తున్నాడు.




# మన శంకర్ వరప్రసాద్ గారు నుంచి హుక్‌స్టెప్ సాంగ్

చిరంజీవి కథానాయకుడి అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. జనవరి 12న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రంలో 'హుక్ స్టెప్' సాంగ్‌ను విడుదల చేశారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఈ సాంగ్‌ను టెలికాస్ట్ చేయగా, అభిమానులే కాదు, వెంకటేశ్, అనిల్ రావిపూడి కూడా ఈ పాటకు డ్యాన్స్ వేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చిన ఈపాటను బాబా సెహగల్ ఆలపించారు. ఇప్పటివరకూ ఈ చిత్రం నుంచి వచ్చిన పాటల్లో ఇదే హైలైట్ కావడం గమనార్హం. అంతేకాదు, సోషల్‌మీడియాను కూడా ఓ ఊపు ఊపేయడం ఖాయం.





## మరోసారి మానవత్వం చాటుకున్న రియల్ హీరో.. మూగజీవాల కోసం సోనూ సూద్ పోరాటం

ాశీఅబ ాశీశీస ఎ బాలీవుడ్ నఅబశ్రీశ్రీటుడు సోనూ సూద్ మరోసారి తన మంచి మఅబశ్రీశ్రీనఅబశ్రీశ్రీసును చాటుకున్నాడు. కేవలం మనుషులకే కాకుండా మూగజీవాల పట్ల కూడా కరుణ చూపాలని ఆయన పిలుపునిచ్చారు. వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ (టీకాలు) మరియు స్టెరిలైజేషన్ (సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు) చేయించాలని ఆయన ప్రజలను కోరారు. వీధి కుక్కల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటి పట్ల క్రూరంగా ప్రవర్తించకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సోనూ సూద్ సూచించారు. కుక్కలకు టీకాలు వేయించడం వల్ల అవి వ్యాధుల బారిన పడకుండా ఉంటాయి, అలాగే స్టెరిలైజేషన్ చేయడం ద్వారా వాటి జనాభాను నియంత్రించవచ్చు. ఇది కుక్కలకు, సమాజానికి ఇద్దరికీ మంచిది అని ఆయన పేర్కొన్నారు. వీధి కుక్కల పట్ల ద్వేషాన్ని పెంచుకోకుండా, వాటికి ఆహారం, నీరు అందించి మానవత్వాన్ని చాటుకోవాలని ఆయన కోరారు. ముంబైలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న సోనూ సూద్, యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్లతో కలిసి పనిచేయాలని తన అభిమానులకు విజ్ఞప్తి చేశారు. కుక్కల దాడి ఘటనలు పెరుగుతున్న తరుణంలో, వాటికి సరైన చికిత్స మరియు సంరక్షణ అందించడమే శాశ్వత పరిష్కారమని ఆయన అభిప్రాయపడ్డారు. జంతువుల పట్ల హింసను అరికట్టి, మన చుట్టూ ఉన్న మూగజీవాలను ప్రేమతో చూసుకోవాలని ఆయన సందేశం ఇచ్చారు.

## అయలాన్ సినిమా వచ్చేసింది.... ఆహా ఓటీటి లో స్ట్రీమింగ్

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) జనవరి 8 :**

తమిళ స్టార్ శివకార్తికేయన్, గ్లామరస్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటించిన ప్రయోగాత్మక చిత్రం ' అయలాన్ '. ఆర్. రవికుమార్ దర్శకత్వంలో ఏలియన్ కథంశంతో సైన్స్ ఫిక్షన్ ఫాంటసీ కామెడీ జోనర్ లో ఈ చిత్రం తెరకెక్కింది. శరద్ కేల్కర్, యోగిబాబు, భానుప్రియ, ఇషా కొప్పికర్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. రెండేళ్ల క్రితం తమిళంలో విడుదలై మంచి విజయం సాధించింది. శివకార్తికేయన్ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. అయితే దాదాపు రెండేళ్ల తర్వాత ఎట్టకేలకు ఇప్పుడు తెలుగులోకి వచ్చింది.అయలాన్ణ చిత్రాన్ని 2024 సంక్రాంతి కానుకగా తెలుగు, తమిళ భాషల్లో థియేటర్లలో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. శివకార్తికేయన్ కి తెలుగులో ఉన్న మార్కెట్ ని దృష్టిలోం పెట్టుకొని, హైదరాబాద్ వచ్చి ప్రమోషన్స్ కూడా నిర్వహించారు. ఆ తర్వాత జనవరి 26న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాలు, ఆర్థిక పరమైన ఇబ్బందుల వల్ల తెలుగు వెర్షన్ థియేటర్లలో రిలీజ్ కాలేదు. ఆ తర్వాత తమిళ వెర్షన్ సన్ నెక్ట్స్ ఓటీటీలోకి వచ్చినప్పటికీ, తెలుగు డబ్బింగ్ వెర్షన్ మాత్రం అందుబాటులోకి రాలేదు. దాదాపు రెండేళ్ల నిరీక్షణకు తెరదించుతూ, ఆహా ఓటీటీలో ప్రత్యక్షమైంది.



# మూడేళ్ల తర్వాత కాదు.. ఇప్పుడే చూసుకుందాం రండి

**- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి జెసి ప్రభాకర్ రెడ్డి సవాల్**



**అనంతపురం,జనవరి8( వెలుతురు):**
రాయలసీమ పౌరుషంపై ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కేతిరెడ్డి వ్యాఖ్యలు రాయలసీమ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డారు. 'నేను రాయలసీమ బిడ్డనే.. నాకు పౌరుషం ఉంది. కానీ కేతిరెడ్డి కుటుంబానికే పౌరుషం లేదు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. వైసీపీ నేతలు మూడేళ్ల తర్వాత చూస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని, దమ్ముంటే ఇప్పుడే రావాలని సవాల్ విసిరారు. 'మూడేళ్ల తర్వాత కాదు.. ఇప్పుడే చూసుకుందాం రండి' అంటూ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. రాయలసీమకు పౌరుషం లేదని కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడటం దురహంకారమని, ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే రాయలసీమ ప్రజలు చెప్పులతో కొడతారని జేసీ హెచ్చరించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఉప్పు కారం తిన్న కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇప్పుడు ఎక్కడ? ఆయన కొడుకులు ఎక్కడున్నారు? అంటూ ప్రశ్నించారు. ధర్మవరంలో కేతిరెడ్డి చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. 'గుడ్ మార్నింగ్' అంటూ షో చేయడం తప్ప ప్రజలకు ఏం చేశారని విమర్శించారు. 'పౌరుషం లేని మీరు రాయలసీమ పౌరుషం గురించి మాట్లాడతారా?' అంటూ మండిపడ్డారు. నీటి ప్రాజెక్టుల విషయంలో వైసీపీ రాజకీయాలు చేస్తే రైతులే తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కేతిరెడ్డి వద్ద ఉన్న కార్లు, గుర్రాలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు నాయుడు మంచివారు కాబట్టే ఇప్పటి వరకు ఓపికగా ఉన్నామని, అభివృద్ధి కోసం ఆయన తిరుగుతుంటే.. వైసీపీ నేతలు రప్పా రప్పా అంటూ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఇంకోసారి రాయలసీమ పేరు తీస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. దమ్ముంటే రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు రావాలని.. చంద్రబాబు ఏం చేశారో?.. జగన్ ఏం చేశారో? ప్రజల ముందు తేలుద్దాం అంటూ జేసీ ఛాలెంజ్ విసిరారు. చీము, రక్తం ఉంటే తాడిపత్రికి రావాలన్నారు. అవసరమైతే మళ్లీ జైలుకి వెళ్లడానికి కూడా సిద్ధమేనని జేసీ స్పష్టం చేశారు. కేతిరెడ్డి కుటుంబం రాయలసీమ ప్రజలను తక్కువ అంచనా వేస్తే తగిన ఫలితం తప్పదని జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు.

# గూడ్స్ నుంచి విడిపోయిన బోగీలు

**- వెంటనే గుర్తించడంతో తప్పిన ప్రమాదం**



**అనంతపురం, జనవరి8(వెలుతురు):**
రాయదుర్గం పట్టణం రైల్వే స్టేషన్ సమీపంలో రన్నింగ్ గూడ్స్ ఇంజన్ నుంచి బోగీలు విడిపోయిన ఘటన కలకలం రేపింది. మొలకలమూరు నుంచి జిందాల్‌కు వెళ్లే గూడ్స్ రైలు.. రన్నింగ్‌లో ఉండగా, 4వ వ్యాగన్ వద్ద లింక్ కట్ కావడంతో సుమారు 45 బోగీలు.. ఇంజిన్ నుంచి విడిపోయాయి. ఇంజిన్ దాదాపు 2 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లింది. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఇంజన్‌ను ఆపేశారు. రైలు రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. సాంకేతిక లోపంపై విచారణ చేపట్టామని తెలిపారు. బోగీలను మళ్లీ అనుసంధానం చేసే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

# ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

**- సంతాపం ప్రకటించిన జైరామ్ రమేశ్**



**పూనె,జనవరి8( వెలుతురు):**
ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ (82) కన్నుమూశారు. ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పూనెలోని తన నివాసంలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు సిద్దార్థ్ గాడ్గిల్ గురువారం వెల్లడించారు. మాధవ్ గాడ్గిల్ పశ్చిమ కనుమల పర్యావరణ ప్రాముఖ్యతకు ఆయన విశేష కృషి చేశారు. ప్రపంచ జీవవైవిధ్య హాట్‌స్పాట్ అయిన పశ్చిమ కనుమలలో ఆయన చేసిన కృషికి గాను 2024లో ఐక్యరాజ్యసమితి అత్యున్నత పర్యావరణ గౌరవమైన వార్షిక ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డును బహూకరించింది. ÷ూగా, ఆయన పర్యావరణానికి సంబంధించి విలువైన సిఫార్సులను అందించారు. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో పర్యావరణానికి నష్టం చేకూర్చకుండా కఠినమైన ఆంక్షలను తన నివేదికలో సిఫార్సు చేశారు. వాటిల్లో కొత్త రోడ్లు లేదా భవన నిర్మాణాల కట్టడాలకు అనుమతించరాదని, నిటారుగా ఉన్న వాలులో అభివృద్ధి చేయరాదని, రాతి తవ్వకాలపై నిషేధం విధించాలని ఆయన సిఫార్సు చేశారు. మాధవ్ గాడ్గిల్ మృతికి మాజీ పర్యావరణశాఖా మంత్రి, కాంగ్రెస సీనియర్ నేత జైరాం రమేశ్ సంతాపం తెలిపారు. 'మాధవ్ గాడ్గిల్ ఒక అత్యున్నతస్థాయి విద్యావేత్త, అవిశ్రాంత క్షేత్ర పరిశోధకుడు, మార్గదర్శక సంస్థ నిర్మాత, గొప్ప సంభాషణకర్త, ప్రజల నెట్‌వర్క్‌లు, ఉద్యమాలను దృఢంగా నమ్మిన వ్యక్తి, ఐదు దశాబ్దాలకు పైగా చాలామందికి స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శి, గురువు. ఆధునిక శాస్త్రంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో శిక్షణ పొందిన ఆయన జీవవైవిధ్య పరిరక్షణలో ఛాంపియన్‌గా నిలిచారు' అని జైరాం రమేష్ తన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అలాగే మాధవ్ స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలిచిపోతారని జైరాం రమేష్ అన్నారు.

# నకిలీ ప్రభుత్వ ఉద్యోగాలతో మోసం

**- ఆరు రాష్ట్రాల్లో ఏకకాలంలో ఇడి దాడులు**
**- ఇడి దాడులపై మండిపడ్డ బెంగాల్ సిఎం మమత**



**న్యూఢిల్లీ, జనవరి8( వెలుతురు):**
ఒక వ్యవస్థీకృత ముఠా నిర్వహిస్తున్న నకిలీ ప్రభుత్వ ఉద్యోగాల కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం ఆరు రాష్ట్రాల్లో సోదాలు జరిపింది. బీహార్‌లోని ముజఫర్‌పూర్, మొతిహారి, పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా, కేరళలోని ఎర్నాకులం, పండలం, అడూర్ మరియు కోడూర్, తమిళనాడులోని చెన్నై, గుజరాత్‌లోని రాజ్‌కోట్, ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ప్రయాగ్‌రాజ్ మరియు లక్నోలోని 15 ప్రదేశాల్లో సోదాలు కొనసాగుతున్నట్లు ఇడి అధికారులు తెలిపారు. భారతీయ రైల్వేలో మొదట ఈ కుంభకోణాన్ని గుర్తించినప్పటికీ, అటవీ, పోస్ట్, ఐటి, హైకోర్టు, ప్రజా పనుల శాఖ, బీహార్ ప్రభుత్వం, ఢిల్లీ అభివృద్ధి అథారిటీ, రాజస్థాన్ సెక్రటేరియట్, ఇతర ప్రభుత్వ సంస్థలు సహా 40కి పైగా విభాగాల్లో ఈ స్కామ్ జరిగినట్లు దర్యాప్తులో తేలిందని అన్నారు. ఈ ముఠా ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లను అనుకరిస్తూ నకిలీ ఇమెయిల్ ఖాతాలను వినియోగించి మోసపూరిత జాయినింగ్ లెటర్స్ పంపిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నమ్మించేందుకు రైల్వేలు, ఇతర సంస్థల్లో నియమించిన కొంతమంది బాధితులకు ఈముఠా రెండు నుండి మూడు నెలల వరకు జీతాల చెల్లింపులు కూడా చేశాయని అన్నారు. ÷రిళిల్‌కతాలో కొనసాగుతున్న ఇడి దాడులపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు రాజకీయ ప్రేరేపితమని, రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఐ-ప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ నివాసంలో జరిగిన సోదాల్లో ఇడి అధికారులు టిఎంసి హార్డ్ డిస్క్‌లు, అంతర్గత పత్రాలు, రహస్య డేటాను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారని అన్నారు. జైన్ నేతృత్వంలోని కన్‌స్టలెన్సీ సంస్థ ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ కార్యాలయంలో కూడా సోదాలు కొనసాగుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కి చెందిన ఐటి సెల్‌ను కూడా ఐ-ప్యాక్ నిర్వహిస్తోంది. అధికార పార్టీ అంతర్గత వ్యూహం, అభ్యర్థుల జాబితాలు, గోప్యమైన డిజిటల్ మెటీరియల్‌ను ఇడి యాక్సెస్ చేసేందుకు యత్నిస్తోందని, ఆ సమాచారానికి, ఆర్థిక దర్యాప్తుతో సంబంధం లేదని అన్నారు. తమ పార్టీ వ్యూహం, ప్రణాళికలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను తీసుకునేందుకు యత్నిస్తున్నారని అన్నారు. రాజకీయ పార్టీల అంతర్గత పత్రాలను సేకరించడం ఇడి పనా అని కేంద్రాన్ని నిలదీశారు. ఈ పక్రియు బెదిరింపుగా అభివర్ణించారు. ఇది చట్ట అమలు సంస్థ కాదని, రాజకీయ ప్రతీకారమని అన్నారు. హోంమంత్రి దేశాన్ని రక్షించే వ్యక్తిలా కాకుండా అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

# అమరావతిలో దేవతలా... ఎక్కడా కనిపించరే?

**- మనుషులు, వాళ్ళ కష్టాలు కనబడుతున్నాయి**
**- చంద్రబాబు వ్యాఖ్యలపై మాజీ ఎంపి చింతా మోహన్ ఎద్దేవా**

**గుంటూరు,జనవరి8( వెలుతురు):**
తెలుగు మహా సభల్లో అమరావతి దేవతల రాజధాని అని చంద్రబాబు అనడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపి చింతామోహన్ ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తున్న తనకు ఎక్కడా ఒక దేవత కూడా కనపడలేదనీ, ఒక్క దేవత అయినా కనపడితే మాట్లాడదాం అనుకున్నానని కానీ మనుషులు, వాళ్ళ కష్టాలు కనబడుతున్నాయే తప్ప, ఎక్కడా దేవతలు కనబడడం లేదు.. అని చింతామోహన్ ఎద్దేవా చేశారు. గురువారం చింతామోహన్ మీడియాతో మాట్లాడుతూ ఎక్కడైనా రాజధాని నిర్మాణానికి వెయ్యి ఎకరాలు చాలునన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి లక్ష ఎకరాలు అవసరం లేదు అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 80 శాతం మంది ప్రజలు అమరావతి రాజధానిని కోరుకోవడం లేదు అని అన్నారు. వారానికి ఒకసారి ఢిల్లీకి చంద్రబాబు పరుగులు తీస్తున్నారని విమర్శించారు. అమరావతి మరో కర్నూల్ అవుతుందనే అనుమానం కలుగుతోందన్నారు. రాజధాని ప్రాంతంలో రైతులు సంతోషంగా లేరని అన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం దుర్మార్గమని మండిపడ్డారు. కామ్రేడ్ హరికిషన్ సింగ్ సూర్జిత్ హృదయంలో నుంచి ఉపాధి హామీ చట్టం పుట్టిందని చెప్పారు. దేశ స్వాతంత్రం కోసం, అంటరానితనానికి వ్యతిరేకంగా మహాత్మా గాంధీ ఎన్నో పోరాటాలు చేశారు అని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కారంచేడు, చుండూరు తరహాలో తెలియకుండా అనేక హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. దేశంలో జ్యుడీషియల్ వ్యవస్థ బలహీన పడుతోందన్నారు. కోట్ల రూపాయలు ఉన్న వారి కోసమే కోర్టులు ఉన్నట్లు న్యాయ వ్యవస్థ మారుతోందని ఆరోపించారు. కోర్టులలో ఆర్థికపరమైన అంశాలు, టెండర్లు, కాంట్రాక్టులు వంటి తగాదాలపై మాత్రమే కేసులు జరుగుతున్నాయన్నారు. సామాజిక న్యాయంపై ఏమాత్రం కోర్టులలో కేసుల విచారణ జరగడం లేదు అని చెప్పారు. సామాజిక స్పృహ తో జడ్జీలు పనిచేయవలసిన అవసరం ఉందని చింతామోహన్ కోరారు. రాష్ట్రంలో చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవు అని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రూ.4 వేల పెన్షన్ ఇస్తే పేదరికం నిర్మూలన జరగదు అని చెప్పారు. ఉద్యోగాలు, స్వయం ఉపాధికి రుణాలు కేటాయించాలని కోరారు. గ్రామాల్లో మూడు పూటలా భోజనం చేసే పరిస్థితి లేక, ఒక పూట భోజనం చేసి అర్ధాకలితో జీవించే కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ ౹÷నాన్స్ కార్పొరేషన్ కు నిధులు కేటాయించడం లేదని అన్నారు. ఎస్సీ౹÷నాన్స్ కార్పొరేషన్ కు వచ్చే బ్జడెట్లో కనీసం వెయ్యి కోట్ల రూపాయలు బ్జడెట్ పెట్టాలని చెప్పారు. అర్హులైన ఎస్సీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం రుణాలు ఇవ్వాలన్నారు. 11 ఏళ్లు వైఎస్ కుటుంబం రాష్టాన్ని పరిపాలించిందని, 15 ఏళ్లు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాయలసీమకు చేసింది సున్నా అని ఎద్దేవా చేశారు. జగన్ కి కేసుల భయం, చంద్రబాబు నాయుడు నిధులు కోసం బిజెపికి మద్దతు ఇస్తున్నారు అని ధ్వజమెత్తారు. వైసిపి, టిడిపి రెండు ప్రాంతీయ పార్టీలు ఏపీలో ఒకరిపై ఒకరు తిట్టుకుంటారని, ఢిల్లీలో కలిసుంటారు అని, బిజెపికి మద్దతు ఇస్తారు? ఆ మూడు పార్టీలు త్రీ ఇన్ వన్ అని చింతామోహన్ అన్నారు. ఈ విలేకరులు సమావేశంలో ప్రముఖ దళిత నాయకులు అన్నవరపు కిషోర్ పాల్గొన్నారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com